అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 09-12-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి: 10 సంచిక: 290 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు వెల: 6.50



ఆదివాసీ బిడ్డల ఆత్మస్థైర్యాన్ని, పోరాటస్ఫూర్తిని దెబ్బతీసే కుట్ర

- 3సార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రినయ్యా
- నా ఎదుగుదల, ప్రజాదరణను చూసి ఓర్వలేకనే ఆరోపణలు
- బండి సంజయ్ తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలి : మహబూబాబాద్ మీడియా సమావేశంలో మంత్రి సీతక్క
- 'క్యాబినెట్‌లో అర్బన్ నక్సలైట్లు' అంటూ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందన

నవతెలంగాణ-మహబూబాబాద్

క్యాబినెట్‌లో మాజీ మావోయిస్టులున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఘాటుగా స్పందించారు. ఆదివారం మహబూబాబాద్‌లో స్థానిక ఎమ్మెల్యే మురళినాయక్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాస్ రెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అట్టడుగు స్థాయి నుంచి ఎదిగొచ్చిన ఆదివాసీ బిడ్డనని, తనలాంటి వారి ఆత్మస్థైర్యాన్ని, పోరాటస్ఫూర్తిని దెబ్బతీసే కుట్రలో భాగంగానే బండి సంజయ్ ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని భావోద్వేగానికి లోనయ్యారు. క్యాబినెట్‌లో అందరూ అర్బన్ నక్సలైట్లేనని మాట్లాడటం దారుణమన్నారు. మంత్రివర్గంలో నక్సలైట్ బ్యాక్‌గ్రౌండ్ నుంచి వచ్చింది తానొక్కదాన్నే అని, అంత మాత్రాన మొత్తం క్యాబినెట్‌కు నక్సలైట్ ముద్ర ఆపాదించడం దుర్మార్గమన్నారు. 2004లో మొదటి సారి తాను ఎమ్మెల్యేగా పోటీచేసినప్పుడు బీజేపీ తనకు మద్దతిచ్చి ప్రచారం చేసిందని గుర్తుచేశారు. అప్పుడు తన బ్యాక్ గ్రౌండ్ బీజేపీ నేతలకు తెలియదా అని ప్రశ్నించారు. జనజీవన స్రవంతిలో కలిసాక తాను నల్లకోటు వేసుకుని లాయర్‌గా ప్రజల పక్షాన ఎన్నో కేసులు వాదించానని తెలిపారు. తాను దొడ్డి దారిలో రాజకీయాల్లోకి రాలేదని, భారత రాజ్యాంగం కల్పించిన హక్కులతోనే మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని స్పష్టంచేశారు. ప్రధాని, హోం మంత్రి నక్సలైట్లను జనజీవన స్రవంతిలో కలవాలని కోరుతారని, బండి సంజయ్ మాత్రం జనజీవన స్రవంతిలో కలిసిన వారిని అవమాన పరిచేలా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ ఏ భావజాలమో బండి సంజయ్‌కు తెలియదా అని ప్రశ్నించారు. పేదల ఐఏఎస్‌గా గుర్తింపు పొందిన ఆకునూరు మురళిని అర్బన్ నక్సలైట్ అనడం ఏం సంస్కారమన్నారు. కరీంనగర్‌లో దొరల దౌర్జన్యాలను, దాష్టికాలను ఓడించింది ఏ భావజాలమో మీ తల్లిదండ్రులని అడగండని బండి సంజయ్‌కు సూచించారు. ప్రజాస్వామ్యబద్ధంగా రాజ్యాంగాన్ని నమ్ముకుని రాజ్యాంగానికి లోబడి పని చేస్తున్నామని తెలిపారు. బలమైన కుటుంబ నేపథ్యం, కుల నేపథ్యం లేకుండా అడవి జీవితాలు అనుభవించి నేడు పంచాయతీ రాజ్ వంటి పెద్ద శాఖకు మంత్రిగా సేవలందిస్తున్నానని సగర్వంగా చెప్పారు. తన ఎదుగుదల, ప్రజాదరణను చూసి ఓర్చుకోలేక లేని పోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తన ప్రసంగాలను మార్ఫింగ్ చేసి తన ఇమేజ్‌ను డామేజ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏండ్ల తన రాజకీయ జీవితంలో ఎలాంటి మచ్చ లేదని, దొడ్డి దారిన పదవులు దక్కించుకోలేదని, ప్రజల మధ్య ఉండి కష్టపడి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిస్తేనే మంత్రి పదవి వచ్చిందని తెలిపారు. బండి సంజయ్ ఎన్నోసార్లు తనని వీరవనిత అన్న సందర్భాలు ఉన్నాయని, రాజకీయ దురుద్దేశంతో మమ్మల్ని తొక్కి పడేయాలని చూస్తే సహించేది లేదని చెప్పారు. మతాలు, కులాల పేరుతో విద్వేశ రాజకీయాలు చేయొద్దని, బండి సంజయ్ తన వ్యాఖ్యలను తక్షణం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హత్యలు, ఎన్‌కౌంటర్లు లేకుండా రాష్ట్రంలో శాంతియుత వాతావరణం ఉండాలని, అందరూ స్వేచ్ఛ, సమానత్వంతో బతకాలంటూ.. ములుగు ఎన్‌కౌంటర్‌పై మీడియా ప్రశ్నలపై మంత్రి పైవిధంగా స్పందించారు.

కొడుకును బావిలో తోసి తల్లి ఆత్మహత్య

- వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలో ఘటన


(ఫైల్)

నవతెలంగాణ-నవాబుపేట్

కొడుకును బావిలో తోసి ఆపై తల్లి కూడా బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గేట్ వనంపల్లి గ్రామానికి చెందిన గుళ్ల రాములు, అరుంధతి(35) దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు రుత్విక్(7), కూతురు ప్రజ్వల ఉన్నారు. శనివారం సాయంత్రం రాములు పొలం వద్దకు వెళ్లాడు. ఇదే సమయంలో అరుంధతికి ఫోన్ కాల్ వచ్చింది. ఆ ఫోన్ మాట్లాడిన తరువాత ఆమె ఏడుస్తూ కూతురు, కుమారుడిని తీసుకుని గ్రామంలోని ఓ బావి వద్దకు వెళ్లింది. మొదట తన కొడుకుని బావిలో తోసేసింది. ఇది చూసిన ఆమె కూతురు భయపడి అక్కడి నుంచి పారిపోయింది. అనంతరం అరుంధతి కూడా బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని మృతురాలి కూతురు గ్రామస్తులకు చెప్పడంతో వారు పోలీసులకు, మృతురాలి భర్తకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను వెలికితీసి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. చనిపోవడానికి ముందు మృతురాలికి ఎవరు ఫోన్ చేశారు. ఆమె మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఇన్నా రెడ్డి

- సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తిరుమల్‌రెడ్డి ఇన్నా రెడ్డి ఖరారైనట్టు కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ (సీపీఎస్) యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చిలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలపై యూనియన్‌లో చర్చించామని పేర్కొన్నారు. సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్ హాజరైనట్టు తెలిపారు. 28 ఏండ్లుగా తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి ఉపాధ్యాయులకు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఎస్ అధ్యాపకున్ని, మరోవైపు పాత పెన్షన్‌లో ఉన్న ఉపాధ్యాయున్ని అభ్యర్థులుగా పోటీలో నిలిపి, సీపీఎస్ ఓపీఎస్ అనే తేడా లేకుండా ఉపాధ్యాయ వర్గం నుండి పెట్టుబడిదారి పెన్షన్ విధానాన్ని పారదోలేందుకు సీపీఎస్ విధానంపై రెఫరెండంగా ఎన్నికల్లో బరిలో ఉంటున్నామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పవన్‌కుమార్, పోల శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లి కార్జున్, రాజేష్ వనమాల, సిర్పూర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాల్ రెడ్డికి టీఆర్‌టీఎఫ్ మద్దతు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పీఆర్‌టీయు టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పింగళి శ్రీపాల్ రెడ్డికి టీఆర్‌టీఎఫ్ మద్దతు ప్రకటించినట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కటకం రమేష్, మారెడ్డి అంజిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్దతు లేఖను శ్రీపాల్ రెడ్డికి వారు అందజేశారు.

కొత్త రెవెన్యూ చట్టంపై అసెంబ్లీలో బిల్లు

- ధరణి కోసం కొత్త యాప్
- ఈనెల ఒకటి నుంచి ఎన్ఐసీకి పోర్టల్ నిర్వహణ బాధ్యతలు
- గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తాం
- రోల్ మోడల్‌గా ఆర్వోఆర్ చట్టం : విలేకర్ల సమావేశంలో మంత్రి పొంగులేటి



నవతెలంగాణ బ్యూరో హైదరాబాద్

సోమవారం నుంచి నిర్వహించబోయే శాసనసభ సమావేశాల్లో కొత్త రెవెన్యూ చట్టం బిల్లును ప్రవేశపెట్టబోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఒక వైపు ధరణి పోర్టల్ ప్రక్షాళనకు అవసరమైన చర్యలు చేపడుతూనే మరోవైపు దానికి సంబంధించి గత ప్రభుత్వంలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఇంకోవైపు కొత్త రెవెన్యూ చట్ట రూపకల్పనకు శ్రీకారం చుట్టి కొలిక్కి తీసుకొచ్చామని చెప్పారు. సీఎం రేవంత్ నాయకత్వంలో ఏడాది కాలంగా పలు నిర్ణయాలు తీసుకుని, రెవెన్యూ సేవలను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. తద్వారా ఆ విభాగంలో గణనీయనమైన ప్రగతిని సాధించామని వివరించారు.

ప్రజాపాలన-విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాలు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికపై పొంగులేటి మాట్లాడారు. ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతల నుంచి టెర్రాసిస్ అనే విదేశీ సంస్థను తప్పించి, కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎన్.ఐ.సీకి వాటిని అప్పగిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నామని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఈనెల ఒకటి నుంచి ఎస్.ఐ.సీ ఆ బాధ్యతలను చూస్తోందని చెప్పారు. ధరణి పోర్టల్ కారణంగా రైతులు గతంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. తరతరాలుగా తమ యజమాన్యంలో ఉన్న భూములపై వారు సర్వ హక్కులూ కోల్పోయారని చెప్పారు. భూముల వివరాలను ధరణి పోర్టల్‌లో నమోదు చేసే సమయంలో జరిగిన లోపాలు, అక్రమాలు, అవకతవకల వల్ల లక్షలాది మంది రైతులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని వాపోయారు. రైతులు తమ భూములను అమ్ముకోవడానికి గాని, ఆ భూములపై బ్యాంకుల నుంచి రుణాలు పొందడానికి గాని అనేక కష్టాలు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సామాన్యులకు రెవెన్యూ సేవలు అందేలా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. ముఖ్యంగా ధరణి సమస్యలపై సమీక్షించి వాటి పరిష్కారానికి మార్గాలను చూపించేందుకు భూ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ధరణి సమస్యలను పరిష్కరించేందుకు కేంద్రీకృతమై ఉన్న అధికారాలను వికేంద్రీకరించి, మండల స్థాయిలో తహశీల్దార్‌కు, డివిజన్ స్థాయిలో ఆర్డీఓలకు, జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్లకు సమస్యలను అధికారాన్ని అప్పగించామని వివరించారు. ఒక్కప్పుడు ధరణిలో ఏ ఎంట్రీ మారినా, ఎందుకు మారిందో తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌లో కానీ, కాగితాలపైగానీ ఎలాంటి ఆధారం ఉండేది కాదన్నారు. కానీ, ఇప్పుడు ఈ విధానాన్ని మార్చి దరఖాస్తు వచ్చినప్పటి నుండి సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రతీదాన్ని కంప్యూటర్‌లో ఉంచి ఎవరైనా, ఎప్పుడైనా చూసుకునేలా చేశామని వివరించారు. గత ప్రభుత్వంలో ఏ కారణం చెప్పకుండానే దరఖాస్తులను తిరస్కరించే వారనీ, కానీ ఇప్పుడు దరఖాస్తు తిరస్కరించాల్సి వస్తే తిరస్కరణకు గల కారణాలు వివరిస్తూ నివేదికను తప్పనిసరి చేశామని పొంగులేటి చెప్పుకొచ్చారు.

ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాం...

ధరణి సమస్యల పరిష్కారానికి ఈ యేడాది మార్చి 1 నుంచి 15 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి 2.46 లక్షల దరఖాస్తుల్లో పెండింగ్‌లో ఉండగా, స్పెషల్ డ్రైవ్ ద్వారా 1.38 లక్షల దరఖాస్తులను పరిష్కరించామని తెలిపారు. కొత్తగా 3.16 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇప్పటివరకు వచ్చిన మొత్తం 5.62 లక్షల దరఖాస్తులలో 4.68 లక్షలను పరిష్క రించాం. తద్వారా దాదాపు 83 శాతం దరఖాస్తులను పరిష్కరించి రైతాంగానికి తమ ప్రభుత్వం అండగా నిలించిందని వివరించారు. గత ప్రభుత్వంలో సంవత్సరాలు గడిచినా దరఖాస్తులకు మోక్షం లభించేది కాదనీ, ఇప్పుడు ఒక్క నెల్లోనే పరిష్కారం లభిస్తోందని తెలిపారు.

ఒక్కో గ్రామానికి ఒక్కో రెవెన్యూ ఉద్యోగి

గత ప్రభుత్వం విఆర్‌వో, విఆర్‌ఏ వ్యవస్థను రద్దుచేసి గ్రామాల్లోని సామాన్యులకు రెవెన్యూ సేవలను దూరం చేసిందని మంత్రి విమర్శించారు. ఈ క్రమంలో రెవెన్యూ వ్యవస్థను పటిష్ఠపరచటానికి గ్రామాల్లో ఆయా సేవలను పునరుద్ధరించాలని నిర్ణయించామన్నారు. రాష్ట్రంలోని 10,954 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు వీలుగా ఒక్కో గ్రామానికి ఒక్కో రెవెన్యూ ఉద్యోగిని నియమించడానికి కార్యాచరణను రూపొందించామని వెల్లడించారు.

సిద్ధమైన కొత్త చట్టం

రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా 'నూతన రెవెన్యూ చట్టం-2024'ను సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టబోతున్నామని మంత్రి తెలిపారు. ఆగస్టులో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ముసాయిదా చట్టాన్ని ప్రవేశపెట్టి, విస్తృతంగా చర్చించామని గుర్తు చేశారు. అదేరోజు సిసిఎల్ఏ వెబ్‌సైట్‌లో కూడా ముసాయిదా చట్టాన్ని పెట్టామని తెలిపారు. రైతు సంఘాలు, మేధావులు, ప్రజా ప్రతినిధులు, రిటైర్డ్ అధికారుల నుంచి స్వీకరించిన సలహాలు, సూచనలతో కొత్త చట్టాన్ని తయారు చేశామన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు బోయినపల్లి వినోద్ కుమార్ చేసిన సూచనలు కూడా పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా యాచారం, నల్గొండ జిల్లా తిరుమలగిరి మండలాల్లో పైలట్ ప్రాజెక్టును కూడా నిర్వహించామనీ, పద్దెనిమిది రాష్ట్రాల్లో అధ్యయనం చేసి, అక్కడ అమలవుతున్న మంచి అంశాలను చట్టంలో పొందుపరిచామని వివరించారు. తరతరాల భూ సమస్యలకు ముగింపు పలికేలా, భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా, దేశానికే ఆదర్శంగా ఉండేలా ఒక రోల్ మోడల్‌గా '2024-ఆర్వోఆర్ చట్టా'న్ని తీసుకు రాబోతున్నామని వెల్లడించారు.

దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు...

ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు వచ్చే నాలుగేండ్లలో దశల వారీగా సుమారు 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించేందుకు ప్రభుత్వం పూనుకుందని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు. మొదటి విడతలో భాగంగా ఈ ఏడాది నియోజకవర్గానికి 3500 నుంచి 4000 ఇండ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల ఇండ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

మొదటి విడతలో నివాస స్థలం ఉన్నవారికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలనీ, రెండో దశలో ప్రభుత్వమే నివాస స్థలంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించిందని తెలిపారు. వికలాంగులు, ఒంటరి మహిళలు, అనాథలు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లు, సఫాయి కర్మాచారులకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నామని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ఒక్కో ఇంటికి 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని ఆయన వివరించారు. మహిళల పేరు మీద ఇండ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ ఇండ్లకు నాలుగు దశల్లో లబ్దిదారులకు చెల్లింపులు చేస్తామనీ, మధ్యవర్తుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా నేరుగా లబ్దిదారుని బ్యాంకు ఖాతాలో డబ్బును జమ చేస్తామని స్పష్టం చేశారు. పేదలకు ఇండ్లు నిర్మించే గృహ నిర్మాణ శాఖను గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని మంత్రి విమర్శించారు.

ఆ విభాగాన్ని మూసేసి, ఉన్న ఉద్యోగులను ఇతర శాఖలలో విలీనం చేసిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తమ ప్రభుత్వం ఒక్కొక్క అడుగు వేస్తూ ఆ శాఖను పునరుద్ధరించి, లబ్దిదారుల ఎంపిక నుంచి ఇండ్ల నిర్మాణం, పర్యవేక్షణ వరకు అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చుకుందని చెప్పారు. 326 మంది ఉద్యోగులను తిరిగి నియమించడం ద్వారా హౌసింగ్ కార్పొరేషన్‌ను బలోపేతం చేశామని తెలిపారు.

పోరాటాలే.. అమరులకు సరైన నివాళి

- పోటు ప్రసాద్ ఆశయ సాధనకు పునరంకితమవుదాం
- మోడీ పాలనలో ప్రభుత్వ రంగం నిర్వీర్యం
- అంబానీ, అదానీలకు దేశ సంపదను కట్టబెట్టే యత్నం : పోటు ప్రసాద్ సంస్మరణ సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి అమర్జిత్ కౌర్, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



నవతెలంగాణ- ఖమ్మం

ప్రజా ఉద్యమాల్లో పనిచేస్తూ బహుముఖ పోరాటాలకు నేతృత్వం వహించి అమరులైన వారికి ప్రజా పోరాటాల కొనసాగింపే సరైన నివాళి అని సీపీఐ జాతీయ కార్యదర్శి అమర్జిత్ కౌర్ తెలిపారు. విద్యార్థి దశ నుంచి కార్మిక నాయకునిగా, కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శిగా పనిచేసిన పోటు ప్రసాద్ ఆశయ సాధనకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. గత నెల 27న మరణించిన సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ సంస్మరణ సభ ఖమ్మంలోని పాత మమత మెడికల్ కళాశాలలోని పువ్వాడ ఆడిటోరియంలో ఆదివారం జరిగింది. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో అమర్జిత్ కౌర్ మాట్లాడారు. పోటు ప్రసాద్ కుటుంబం మూడు తరాల నుంచి కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తూ వచ్చారని, మూడో తరం వారైన ప్రసాద్ విద్యార్థి ఉద్యమంలోనూ, కార్మిక ఉద్యమంలోనూ ఎంతో నిబద్ధతతో పని చేశారని తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ పార్టీ శ్రేణులను ప్రజా పోరాటాలకు సన్నద్ధం చేసేవారని గుర్తుచేశారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకులపై ప్రజా పోరాటాలు ఉధృతి చేయాల్సిన సమయంలో ప్రసాద్ మరణం యావత్ ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. యువశక్తి నిర్వీర్యం అవుతుందని, ప్రభుత్వ రంగంలో నియామకాలు లేవని, ప్రభుత్వ రంగాన్ని మోడీ సర్కార్ నిర్వీర్యం చేస్తూ అంబానీ, అదానీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. దేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో 25 శాతం మంది రోజు వారి కూలీలేనని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగం పెరుగుతుండటంతో దేశ వ్యాప్తంగా పలు పోరాటాలు మొదలవుతున్నాయన్నారు. అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను సైతం కేంద్ర ప్రభుత్వం హరించివేస్తుందని విమర్శించారు. రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. తుదిశ్వాస వరకు నిబద్ధత, నిస్వార్థంతో కమ్యూనిస్టు పార్టీ పురోభివృద్ధికి కృషి చేసిన పోటు ప్రసాద్‌కి నివాళిగా సీపీఐ శత వసంతాల జాతీయ స్థాయి ముగింపు సభ ఖమ్మంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష మందితో బహిరంగ సభ నిర్వహిస్తామని అన్నారు. అనంతరం సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, కొండబాల కోటేశ్వరరావు, గుమ్మడి నర్సయ్య, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ సీపీఐ నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, వనజ, కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తుమ్మల యుగంధర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ, బాగం హేమంతరావు, నాయకులు పోట్ల మాధవరావు, జర్నలిస్టు సంఘాల నాయకులు కె.రాంనారాయణ, ఎ.ఆదినారాయణ తదితరులు మాట్లాడారు. ప్రజానాట్య మండలి కళాకారులు ఆలపించిన గేయాలు ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఝాన్సీ, లింగయ్య, సూర్యాపేట జిల్లా నాయకులు ఎం వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకులు ఎస్, సాబీర్ పాషా, మహ్మద్ మౌలానా, బి.అయోధ్య, ప్రసాద్ కుమారుడు రాజా సాత్విక్, సతీమణి పోటు నిర్మల, తల్లి సక్కుబాయి, సోదరి పోటు కళావతి, పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఏసీకే జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, కార్పొరేటర్ బీజీ క్లెమెంట్ పాల్గొన్నారు.

తమిళనాడు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏఐకేఎస్ బృందం పర్యటన

- జాతీయ విపత్తుగా ప్రకటించాలి
- కేంద్రం తగిన నిధులు ఇవ్వాలని నాయకుల డిమాండ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఫెంగల్ తుఫాన్ వల్ల దెబ్బతిన్న ప్రాంతాలను ఆదివారం ఏఐకేఎస్ బృందం పరిశీలించింది. ఆదివారం తమిళనాడులోని విలుపురం, కడలూరు జిల్లాల గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను, బాధిత రైతులను కలిసి వారి ఇబ్బందులను, కష్టాలను తెలుసుకున్నారు. ప్రతినిధి బృందంలో ఏఐకేఎస్ ఆర్థిక కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పి. కృష్ణప్రసాద్, సహాయ కార్యదర్శి టి.సాగర్, ఉపాధ్యక్షులు రవీంద్రన్, కేపీ పెరుమాళ్, తమిళనాడు కిసాన్‌సభ నాయకులు ఆర్‌టి మురుగన్, తాండవరాయన్, రవిచంద్రన్, ఆర్.శరవణన్, వెల్‌మారన్, సీపీఐ(ఎం) నాయకులు ఎన్. సుబ్రమణియన్, మాజీ ఎమ్మెల్యే ఆర్.రాంమూర్తి, సీకేసీ సభ్యులు ఉన్నారు. రైతులు, గ్రామీణ కార్మికులను పరామర్శించి, వారికి జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫెంగల్ తుఫాన్ లక్షల ఎకరాల్లో పంట దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణనష్టంతోపాటు దాదాపు మూడు లక్షల ఎకరాల్లో వరి, లక్ష ఎకరాల్లో మినుము, లక్ష ఎకరాల్లో ఉద్యాన పంటలు, ఇతర పంటలు దెబ్బతినడంతో రైతులు వేలకోట్లమేర నష్టం జరిగిందన్నారు. దాదాపు ఐదు వేల ఇండ్లు ధ్వంసమయ్యాయని తెలిపారు. దీన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలనీ, పునరావాసం కోసం తగిన నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఒక్క విలుపురం జిల్లాలోనే దాదాపు 15000 ఎకరాల్లో పంట నాశమైందన్నారు.. తమిళనాడు కమిటీకి ఏఐకేఎస్ రూ. 5 లక్షల విరాళాన్ని ప్రకటించింది. తమిళనాడు రైతుల కోసం విరివిరిగా విరాళాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. విరాళాల ఇవ్వాల్సిన అడ్రస్...తమిళనాడు వివసైగళ్ సంఘం, అకౌంట్ నెంబర్ 414267900, ఐఎఫ్ఎస్ కోడ్ ఐడీఐబీ000టీ092 ఇండియన్ బ్యాంక్, వెస్ట్ తంబరామ్ బ్రాంచ్.

10నుంచి సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె

- టీఎస్ఎస్‌యూఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నుంచి ఉద్యోగులు సమ్మె బాట పట్టనున్నట్టు తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం(టీఎస్ఎస్‌యూఎస్) రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య , కార్యనిర్వాహక అధ్యక్షులు అనిల్ చారి, కోశాధికారి దుర్గం శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. పెన్ డౌన్, చాక్ డౌన్ తో కేజీబీవీ,యూఆర్ఎస్, భవిత సెంటర్ల లో బోధన ఆగనున్నదని పేర్కొన్నారు. సమ్మెలో జిల్లా విద్యా, మండల విద్యా శాఖ కార్యాలయాల సిబ్బందితో పాటు క్లస్టర్ పాఠశాలల సిబ్బంది, ఉన్నత పాఠశాలలోని ఒకేషనల్ ఇన్ స్ట్రక్టర్ సిబ్బంది పాల్గొంటున్నారని తెలిపారు.



వీఆర్‌ఏ, వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరించాలి

- ప్రభుత్వానికి రెవెన్యూ ఉద్యోగుల వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకు రానున్న ఆర్‌వోఆర్ చట్టంలో వీఆర్‌ఏ, వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరించాలని రెవెన్యూ ఉద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. కొత్త ఆర్వోఆర్ చట్టం రూపకల్పన, తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలో అధికారాల వికేంద్రీకరణ, రెవెన్యూ ఉద్యోగులపై దాడులు, భవిష్యత్ కార్యచరణపై ఈ సందర్భంగా చర్చించారు. అనంతర ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ వి.లచ్చిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామ స్థాయి రెవెన్యూ వ్యవస్థను ఎత్తేయడం వల్ల మొత్తం ప్రభుత్వ వ్యవస్థనే నిర్వీర్యం అయ్యిందని పేర్కొన్నారు. ఫలితంగా లగచర్ల, నిర్మల్ వంటి ఘటనలు జరిగే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చిన్నాభిన్నమైన రెవెన్యూ వ్యవస్థను తిరిగి పునరుద్ధరించేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం సంతోషకరమనీ, ఈ ప్రయత్నంలో రెవెన్యూ ఉద్యోగులుగా అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, టీజీటీఏ అధ్యక్షులు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్ పాక, సెక్రటరీ జనరల్ ఫూల్ సింగ్ చౌహాన్, మహిళా అధ్యక్షురాలు రాధ, కోశాధికారి శ్రీనివాస్ శంకర్‌రావు తదితరులు పాలొన్నారు.

టీజీఆర్ఎస్ఏ నూతన కమిటీ ఎన్నిక

టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర నూతన కమిటీని ఈ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాణాల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బిక్షం, కోశాధి కారిగా మల్లేశ్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా సుజాత చౌహాన్ ఎన్నికయ్యారు.

మెట్రో కారిడార్లు, స్టేషన్లలో ప్రజాపాలన విజయోత్సవాల సంరంభం

- తెలంగాణ తల్లికి ఘన నీరాజనం
- 25 మెట్రో స్టేషన్లలో 'తెలంగాణ తల్లి' చిత్రాల ఏర్పాటు

నవతెలంగాణ-సిటీబ్యూరో



ప్రజాపాలన- ప్రజా విజయోత్సవాలను హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ ఘనంగా నిర్వహిస్తోంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దిశానిర్దేశంతో రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహ నమూనా చిత్రాన్ని రద్దీ ఎక్కువగా ఉండే మెట్రో స్టేషన్లలో ప్రదర్శించింది. 'జయ జయహే తెలంగాణ-జననీ జయకేతనం' అంటూ తెలంగాణ స్ఫూర్తిని అంది పుచ్చుకుంటూ మొత్తం 25 మెట్రో స్టేషన్లలో కొత్తగా రూపొందించిన 'తెలంగాణ తల్లి' చిత్రాలను ఏర్పాటు చేసినట్టు హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ప్రజాపాలన విజయోత్సవాలను హైదరాబాద్ మెట్రో స్టేషన్ల పరిధిలో జోరుగా నిర్వహిస్తున్నామని చెప్పారు. మెట్రో రైల్ రెండవ దశ ముఖ్య అంశాలను తెలియజేసేలా స్టేషన్ల కాన్‌కోర్స్, ప్లాట్‌ఫామ్‌లపైన స్టాండ్‌లను ఏర్పాటు చేశామని, ప్రధాన మార్గాల్లో మెట్రో పిల్లర్లకు హోర్డింగ్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సంవత్సరం కాలంలో ప్రభుత్వ విజయాలను, మెట్రో సాధిస్తున్న ప్రగతిని వివరించామని వెల్లడించారు. అందమైన విద్యుద్దీపాల అలంకరణతో ముఖ్యమైన మెట్రో మార్గాలు ప్రజలను విశేషంగా అలరిస్తున్నాయి. కాంగ్రెస్ ఏడాది పాలన విజయాలను ఘనంగా ప్రతిబింబించేలా హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ, నేను సైతం అంటూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటోంది.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
12 పేజీలు వెల : 6.50
నవతెలంగాణ
సోమవారం 09-12-2024 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 290 Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar



వైభవంగా ప్రజాపాలన ఏడాది విజయోత్సవాల వేడుకలు

ఎయిర్ షో..అదరహో

ఆకట్టుకున్న వాయుసేన విన్యాసాలు

- రాహుల్ సిప్లిగంజ్ ధూంధాం
- స్వయంగా వీక్షించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు
- ఆసక్తిగా తిలకించిన వీక్షకులు
- కట్టిపడేసిన సాంస్కృతిక కళా ప్రదర్శనలు
- ఉర్రూతలూగించిన బతుకమ్మ పాటలు..కోలాటాలు
- ట్యాంక్‌బండ్‌పై సండే సందడే సందడి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్
ఇసుకేస్తే రాలనంత జనంతో ఆదివారం సంధ్యాసమయంలో ట్యాంక్‌బండ్ కిటకిటలాడిపోయింది. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏడాది పాలన విజయోత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా ఇండియన్ ఫోర్స్ ఆధ్వర్యంలో అజయ్ నేతృత్వంలో 9 సూర్యకిరణ్ విమానాలతో నిర్వహించిన ఎయిర్‌షో అదరహో అనిపించింది. ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద వాయుసేన విన్యాసాల కార్యక్రమాన్ని, భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డు వద్ద ఉన్న హెచ్ఎండీఏ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. ట్యాంక్‌బండ్‌పై వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సందర్శించారు. పిల్లాపాపలు..చిన్నాపెద్దా..అనే తేడా లేకుండా వైమానిక దళాలు ప్రదర్శించిన విన్యాసాలను ఆసక్తిగా తిలకించారు. విమానాలు తమ సమీపానికి వచ్చిన ప్రతిసారీ కేరింతలు కొడుతూ ఎంజాయ్ చేశారు. తమ సెల్‌ఫోన్లలో బంధించారు. వాయుసేన విమానాల ప్రదర్శనతో వీక్షకులు కుటుంబ సమేతంగా సెల్ఫీలు తీసుకోవడం కనిపించింది. ఎయిర్‌షోలో విమానాలు 360 డిగ్రీల ...11లో

అధ్యక్షా..!

నేటి నుంచి అసెంబ్లీ

ఒక్కరోజే..మళ్లీ 16 నుంచి కొనసాగింపు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో
రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని అసెంబ్లీ సమావేశాలను ప్రారంభించి, యూపీఏ చైర్‌పర్సన్‌గా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చినందుకు ధన్యవాద తీర్మానంపై చర్చించి, సంతాప తీర్మానాల అనంతరం సభను మళ్లీ ఈనెల 16వ తేదీకి వాయిదా వేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. సోమవారమే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. శాసనసభ స్పీకర్, శాసనమండలి చైర్మెన్లతో పాటు మంత్రులంతా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. దాదాపు లక్షమంది మహిళలను తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తరలించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే అన్ని జిల్లాల కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు టార్గెట్లు విధించినట్టు సమాచారం. దీనితో ఆదివారం నుంచే సచివాలయం, ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్ పరిసరాల్లో జనసమ్మర్థం పెరిగింది. ఇక్కడ నిర్వహించిన వాయుసేన విమాన విన్యాసాలకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అన్ని ప్రభుత్వ శాఖలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో అట్టహాసంగా నిర్వహించిన ప్రజాపాలన వార్షికోత్సవ వేడుకల్లో అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులంతా బిజీగా ఉన్నారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు జనసమీకరణ సహా అనేక బాధ్యతలు వారిపై ఉన్నాయనీ, అందువల్ల సోమవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభించి, వారం తర్వాత తిరిగి కొనసాగించాలని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆదివారం అసెంబ్లీ కార్యాలయంలో సమావేశమై నిర్ణయించినట్టు సమాచారం. గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రజాప్రతినిధుల ప్రశ్నలకు రాతపూర్వకంగా సమాధానాలు ఇవ్వాలని స్పీకర్ ప్రసాదరావు ఆదేశించారు. అయితే ప్రజాపాలన విజయోత్సవాల్లో ప్రభుత్వ యంత్రాంగం మొత్తం తలమునకలై ఉండటంతో ఆ పనులు పూర్తికాలేదని తెలిసింది. ఈ వారం రోజుల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలన్నింటికీ రాతపూర్వక సమాధానాలు ఇచ్చాకే, తిరిగి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ వారం రోజుల్లోనే సీఎం సహా కొందరు మంత్రులు ఢిల్లీకి వెళ్లాల్సి ఉందనీ, మంత్రివర్గ విస్తరణతో పాటు కేంద్రం నుంచి రావల్సిన నిధుల విషయంలో అధికారుల్ని కలిసిరావాల్సి ఉన్నట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యుత్ కమిషన్ నివేదికపై కూడా అసెంబ్లీలో చర్చించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ నేపథ్యంలో దాన్ని అధ్యయనం చేయాల్సి ఉంది. రైతు భరోసాకు సంబంధించిన విధివిధానాలపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ...10లో

కొత్త రెవెన్యూ చట్టంపై అసెంబ్లీలో బిల్లు

- ధరణి కోసం కొత్త యాప్
- ఈనెల ఒకటి నుంచి ఎన్ఐసీకి పోర్టల్ నిర్వహణ బాధ్యతలు
- గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తాం
- రోల్ మోడల్‌గా ఆర్వోఆర్ చట్టం
- విలేకర్ల సమావేశంలో మంత్రి పొంగులేటి

2లో..

అసెంబ్లీ సమావేశాలకు మూడంచెల బందోబస్తు

- రెండువేల మంది పోలీసులతో సెక్యూరిటీ
- బందోబస్తును సమీక్షించిన సెంట్రల్ జోన్ డీసీపీ

11లో..

నిలదీద్దాం

కాంగ్రెస్ మ్యానిఫెస్టో ఆధారంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం

- ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో బీఆర్ఎస్ఎల్పీ భేటీ
- అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ దిశానిర్దేశం
- హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- కాంగ్రెస్ ఏడాది పాలనపై హరీశ్‌రావు, కేటీఆర్ విమర్శలు



నవతెలంగాణ-మర్కుక్
కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గట్టిగా నిలదీయాలని మాజీ సీఎం, ప్రతిపక్ష నేత కేసీఆర్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహాలను వారికి సూచించారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో ఆధారంగా వైఫల్యాలను ఎండగట్టాలని తెలిపారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి.. పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్చటం మూర్ఖత్వమేననీ, ప్రభుత్వాలు చేయాల్సిన పనులు ఇవేనా..? ఇలా మార్పులు చేసుకుంటూ పోతే ఎలా..? అని చెప్పారు.

ఏడాది కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలతోపాటు హైడ్రా, లగచర్ల ఘటనలపై కూడా ప్రశ్నించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, పద్మారావు గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్ రెడ్డి, మాగంటి గోపీనాథ్, గంగుల కమలాకర్, చింతా ప్రభాకర్, సుధీర్ రెడ్డి, అనిల్ జాదవ్, పాడి కౌశిక్‌రెడ్డి, మాణిక్‌రావు, వివేక్ మందా గౌడ్, బండారు లక్ష్మారెడ్డితో పాటు ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, సుంకరి రాజు, షేర్ సుభాష్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, వంటేరు యాదవ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, మధుసూదనా చారి, మహమూద్ అలీ, రమణ, దేశపతి శ్రీనివాస్, మధుసూదన్ టాటా, వాణి దేవి, రమణరెడ్డి తదితరులున్నారు.

ప్రజా సమస్యలపై అసెంబ్లీలో పోరాడుతాం : ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కేటీఆర్

ప్రజా సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో గళం విప్పి పోరాడుతామనీ, ప్రజలకు అండగా ఉంటామని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కేటీఆర్ తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం దిశా నిర్దేశం చేసిన అనంతరం విలేకరులతో హరీశ్‌రావు, కేటీఆర్ వేర్వేరుగా మాట్లాడారు. ఆరు గ్యారంటీల అమలుకు మొదటి శాసనసభలో చట్టబద్ధత తెస్తామని హామీనిచ్చినా అమలు చేయలేదన్నారు. ఇలాంటి ఎన్నో హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. ఫార్మాసిటీ పేరుతో లగచర్లలో గిరిజనుల భూములను అక్రమంగా లాక్కొని వారిపై కేసులు పెట్టి జైలుకు పంపిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా రెండు పంటలకు ఇవ్వడంలో విఫలమయ్యారని తెలిపారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ నిరంతరం గళం విప్పి పోరాటాలు చేస్తున్నదన్నారు. దళిత బంధు, బీసీ బంధు, గిరిజ బంధు వాటిపై ...11లో



రైతులపై మళ్లీ జులుం

శంభు సరిహద్దులో బాష్పవాయుగోళాల ప్రయోగం

- ఢిల్లీ సరిహద్దులో ముండ్ల కంచెలు, రోడ్లపై మేకులు, ఇనుప బారికేడ్లు
- యూపీ జైళ్లలోనే రైతుల నిరాహార దీక్ష
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్

తమ సమస్యలను వినిపించటానికి బయలుదేరిన రైతుల్ని మోడీ సర్కార్ ఢిల్లీలో అడుగుపెట్టనీయటంలేదు. బీజేపీ పాలిత ప్రభుత్వాలు అన్నదాతల్ని అడ్డుకుంటున్నాయి. ఢిల్లీలో శాంతి భద్రతలు కేంద్రం చేతిలో ఉండటంతో కేంద్ర సర్కారు మరింతగా రెచ్చిపోతోంది. ఇటు శంభు సరిహద్దులోనూ, అటు యూపీలోనూ అన్నదాతలపై పాలకుల అరాచకం అస్సలు ఆగటంలేదు. తాజాగా ఆదివారం శంభు సరిహద్దు వద్దకు చేరిన రైతులపై హర్యానా సర్కార్ బరితెగించింది. ఢిల్లీ వైపు వెళ్లనీయకుండా బాష్పవాయుగోళాలను ప్రయోగించింది. ఢిల్లీలో అడుగడుగునా ముండ్ల కంచెలు, రోడ్లపై మేకులు, బాడీకేడ్లతో అడ్డుకున్నది.

న్యూఢిల్లీ : కేంద్రం చర్చలకు సిద్ధపడకపోవడంతో తిరిగి ప్రారంభించిన పంజాబ్ రైతుల ఢిల్లీ మార్చ్‌ను హర్యానా పోలీసులు శంభు సరిహద్దు వద్ద మరోసారి అడ్డుకున్నారు. ఫిబ్రవరి నుంచి కాంక్రీట్ కంచె వేసి, కేంద్ర బలగాలను ...11లో

ఏడాది పాలనంతా ఎడతెగని వంచనే


- ప్రజాస్వామ్యం అపహాస్యం
- భావప్రకటనా స్వేచ్ఛకు భంగం
- నిరసన తెలిపే హక్కే లేకుండా పోయింది : బీఆర్ఎస్ చార్జిషీట్‌ను విడుదల చేసిన హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
రేవంత్ సర్కార్ ఏడాది పాలనంతా ఎడతెగని వంచనేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఈ కాలంలో ప్రజాస్వామ్యం అపహాస్యానికి గురైందనీ, భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం వాటిల్లిందని వాపోయారు. నిరసన తెలిపే హక్కే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు 'కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన చార్జిషీట్'ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రేవంత్ సర్కార్ లోపాలను ...11లో

మాపై చార్జిషీట్ కాదు

- ప్రజలు మిమ్మల్నే డిశ్చార్జి చేశారు : బీఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి సెటైర్లు
- కేసీఆర్‌దే తుగ్లక్ పాలనంటూ ఎద్దేవా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
'మాపై చార్జిషీట్ విడుదల చేయటం కాదు.. ఆస్పత్రి నుంచి పేషెంట్‌ను పంపినట్టు, ప్రజలే మిమ్మల్ని, మీ పాలనను డిశ్చార్జి చేసి పంపారు...' అని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి... బీఆర్ఎస్ నేతలనుద్దేశించి సెటైర్లు విసిరారు. ఆదివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే రాంచంద్రనాయక్‌తో కలిసి పొంగులేటి మాట్లాడారు. రేవంత్ ఏడాది పాలనపై మాజీ మంత్రి హరీశ్‌రావు చార్జిషీట్‌ను విడుదల చేశారనే విషయాన్నిఈ సందర్భంగా విలేకరులు ప్రస్తావించగా... పొంగులేటి ఘాటుగా స్పందించారు. 'పోలీసులను పార్టీ కార్యకర్తలుగా వాడుకోవడం, ప్రతిపక్షాల ...11లో

ఈవీఎంలపై విశ్వాసం లేదు

ఎన్నికల ప్రక్రియపై ఓటర్లలో అనుమానాలు :శరద్ పవార్



ముంబయి: మహారాష్ట్ర లో మహాయుతి ప్రభుత్వం కొలువుదీరిన విషయం తెలిసిందే. ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ(ఎంవీఏ) సభ్యులు ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో జరిగిన ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ వ్యాఖ్యానించారు. షోలాపూర్ ...11లో

సిరియాలో తిరుగుబాటు

దేశం విడిచి పారిపోయిన అధ్యక్షుడు అసద్

- అధికారం మాదేనన్న తిరుగుబాటుదారులు
- తాజా పరిణామంపై మిశ్రమ స్పందన



డమాస్కస్: సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్ పదవీచ్యుతులయ్యారు. అమెరికా మద్దతు కలిగిన సిరియన్ ఫ్రీ ఆర్మీ' దళాల తిరుగుబాటుదారులు ఆదివారం ఉదయం రాజధాని డమాస్కస్‌ను ఆక్రమించుకోవడంతో సిరియా తిరుగుబాటుదారుల వశమైంది. అధ్యక్షుడు అసద్ దేశం విడిచి విమానంలో అజ్ఞాత ప్రదేశానికి వెళ్లిపోయారని సీనియర్ సైనిక అధికారి ఒకరు తెలిపారు. దీంతో 24 ఏళ్ల అసద్ పాలనకు తెరపడిందని ఆర్మీ కమాండ్ అధికారులు చెప్పారు. హయత్ తెహ్రీర్ అల్-షామ్ (హెచ్‌టిఎస్), ఫ్రీ సిరియన్ ఆర్మీ (ఎఫ్ఎస్ఎ), ఇతర స్థానిక మిలీషియా గ్రూపులతో కూడిన కూటమి వారం రోజుల తిరుగుబాటులో కీలకమైన నగరాలను ఒకటి తరువాత ఒకటి ఆక్రమిస్తూ చివరి దుర్గమైన డమాస్కస్‌ను స్వాధీనం చేసుకోవడంతో అసద్ ప్రభుత్వం పతనమైంది. తిరుగుబాటు నాయకుడు అబూ మహ్మద్ అల్ జొలాని నేతృత్వంలోని హయత్ తెహ్రీర్ అల్ షామ్ (హెచ్‌టిఎస్) ఒక ప్రకటన చేస్తూ 'ఈ రోజుతో ఒక చీకటి శకం ముగిసింది. కొత్త శకానికి నాంది పలుకుతున్నాం' అని పేర్కొంది. సిరియాలో చోటుచేసుకున్న ఈ నాటకీయ పరిణామాలపై రష్యా, ఇరాన్, ఇరాక్ తదితర పశ్చిమాసియా దేశాలు దిగ్భ్రాంతి వ్యక్తం చేయగా, అమెరికా, ఫ్రాన్స్, ఇజ్రాయిల్ తదితర దేశాలు దీనిని ...11లో

ప్రభుత్వాధికారులకు ఆమ్యామ్యాలు

66 శాతం వ్యాపార సంస్థలు వెల్లడి

- అన్ని విభాగాల్లో అదే పరిస్థితి
- లోకల్ సర్కిల్స్ నివేదిక
- మేధావులు, సామాజికవేత్తల ఆందోళన



న్యూఢిల్లీ : భారత్‌ను అవినీతి మహమ్మారి ఎన్నో ఏండ్ల నుంచి పట్టి పీడిస్తున్నది. ప్రభుత్వాలు మారినా.. ఈ జాఢ్యం మాత్రం వదలటం లేదు. ప్రభుత్వాధికారులు తమ బాధ్యతలను విస్మరించి.. ధనార్జనే ధ్యేయంగా పని చేస్తుండటంతో ఆమ్యామ్యాలకు అడ్డుకట్ట పడటం లేదు. ప్రభుత్వ విభాగాలకు చెందిన పలు విభాగాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నది. పని అక్రమమైనా, సక్రమమైనా.. అధికారుల చేతులు తడపనిదే పని కావటం లేదు. ఇప్పుడు, దేశంలోని వ్యాపార సంస్థలూ ఇవే పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. గత పన్నెండు నెలల్లో తాము లంచాలిచ్చినట్టు దాదాపు 66 శాతం సంస్థలు చెప్పాయి. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ 'లోకల్‌సర్కిల్స్' నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. ఇందులో భాగంగా, ఈ ఏడాది మే 22 నుంచి నవంబర్ 30 మధ్య దేశంలోని 159 జిల్లాల్లో సర్వే నిర్వహించి 18వేల స్పందనలను తీసుకున్నారు.

ఈ సర్వే సమాచారం ప్రకారం.. ప్రక్రియ వేగవంతం కోసం 54 శాతం సంస్థలు బలవంతంగా, 46 శాతం సంస్థలు స్వచ్ఛందంగా లంచాలు చెల్లించాయి. అనేక వ్యాపారాలు అనామకంగా ఉన్నందున అనుమతి లేదా సమ్మతి ప్రక్రియను వేగవంతం చేయటానికి ప్రభుత్వ శాఖలను కావాలనుకున్నపుడు లంచాలు జీవన విధానంగా మిగిలిపోతాయి. అథారిటీ లైసెన్స్ పొందాలన్నా లేదా ఆస్తి విషయాలకు సంబంధించి ఏదైనా విషయంలోనైనా ఇది కనిపిస్తుంది. గత 12 నెలల్లో 66 శాతం వ్యాపారాలు ముడుపులు ముట్టజెప్పాయి. తాము ఎలాంటి లంచం చెల్లించకుండానే పని చేయించుకోగలిగామని 16 శాతం వ్యాపారసంస్థలు వెల్లడించాయి. తమకు అలా చేసే అవసరమే రాలేదని 19 శాతం వివరించాయి. అనుమతులు, సరఫరాదారు అర్హతలు, ఫైల్‌లు, ఆర్డర్‌లు, చెల్లింపులు సాధారణంగా నిలిపివేయబడిన వంటి విషయాల్లో ప్రభుత్వ ఏజెన్సీలతో వ్యవహరించేటపుడు ఈ రకమైన లంచం దోపిడీకి సమానమని సామాజికవేత్తలు అంటున్నారు. చాలా ప్రదేశాల్లో కంప్యూటరీకరణ జరిగినప్పటికీ 'వ్యాపార ముడుపులు' కొనసాగుతున్నాయి.

అవినీతిని తగ్గించటానికి ప్రభుత్వం ఈప్రొక్యూర్‌మెంట్ వంటి పద్ధతులను తీసుకొచ్చినా.. సప్లయర్ క్వాలిఫికేషన్, బిడ్ మ్యానిప్యులేషన్, సర్టిఫికెట్, పేమెంట్ పూర్తికి సంబంధించిన విషయాల్లో ఇంకా అవినీతి కనబడుతున్నది. 75 శాతం ఆమ్యామ్యాలు న్యాయ, మెట్రాలజీ, ఫుడ్, డ్రగ్, ఆరోగ్యం వంటి విభాగాల అధికారులకు వెళ్లాయి. అలాగే, జీఎస్టీ అధికారులు, కాలుష్య నియంత్రణ విభాగం, మునిసిపల్ కార్పొరేషన్, విద్యుత్ విభాగాల్లో లంచాలు చెల్లించినట్టు సంస్థలు తెలిపాయి. అనేక సంస్థలు.. విధానాలు, విధానాల పరంగా కనీస స్థాయిని నిర్వహించటం ద్వారా ఎలాంటి నియంత్రణ పరిశీలనా, శిక్షా చర్యలూ ...10లో

వర్తన ఆరవ సమావేశం

సాహిత్యరంగంలో నవీన ధోరణులు పాదుకొల్పాలన్న లక్ష్యంతో ఏర్పాటయిన వర్తన సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆరవ సమావేశం ఈ నెల 12 గురువారం సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరుగుతుంది. ఈ సమావేశంలో 'తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణం - ఆవశ్యకత - ఆచరణ' అనే అంశంపై సుంకిరెడ్డి నారాయణ రెడ్డి ప్రసంగిస్తారు. ఈ సమావేశానికి గుడిపాటి అధ్యక్షత వహిస్తారు. ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్ సమన్వ యకర్తగా వ్యవహరిస్తారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు అందరూ ఆహ్వానితులే.

సాహితీ వార్తలు

'ఎదురుచూపులు' కవితాసంకలనం ఆవిష్కరణ


కొసరాజు సామ్రాజ్యం సంపాదకత్వంలో ప్రచురించబడిన 'ఎదురుచూపులు' కవితాసంకలనం డిసెంబర్ 11,2024న హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గానసభ కళామారుతి కళావేదికపై సాహితీవేత్త డా॥వోలేటి పార్వతీశం ఆవిష్కరిస్తారు. ఈ సభకు నేటినిజం సంపాదకులు బైసదేవదాసు అధ్యక్షత వహించగా, డా॥వై.రామకృష్ణారావు, గుడిబండి వెంకటరెడ్డి, డా॥పులివర్తి కృష్ణమూర్తి, పొత్తూరి సుబ్బారావు, పెద్దూరి వెంకటదాసు, కొసరాజు రాజేంద్రప్రసాద్, పొత్తూరి జయలక్ష్మి అతిథులుగా పాల్గొంటారు. ఈ సందర్భంగా సాహితీకిరణం సౌజన్యంతో 'కన్నవారి కలలు-పిల్లల బాధ్యతలు' అనే అంశంపై నిర్వహించిన కవితలపోటీ విజేతలకు బహుమతి ప్రదానం కావించబడుతుంది.

పరిశీలనాత్మక కథలు బల్కావ్

చూసే సినిమాకు చదివే కథకు ఎంతో వ్యత్యాసం ఉంటుంది. సినిమా ఏ దృశ్యాన్ని చూపుతుందో మెదడు దానినే నిక్షిప్తం చేసుకుంటుంది. అదే ఏదైనా కథ చదువుతున్నప్పుడు ఊహకు రెక్కలు వస్తాయి. ఆకాశంలో విహరిస్తాము. ఏ ఒక్క ఆలోచనకు సరిహద్దులంటూ ఉండవు. అదే కదా కథ గొప్పతనం. అందుకే పేదరాశి పెద్దమ్మ కథల నుంచి ఇప్పటికీ కథ అంటే చెవి కోసుకొని వినాలనుకుంటారు. చదవాలనుకుంటారు. అందుకే కథలు ఇప్పటికీ పచ్చగా మనగలుగుతున్నాయి.

ఊహకు అంతం లేనట్లే, శ్రీ ఊహ కలానికి అందని సబ్జెక్టు లేదేమో అనిపిస్తుంది ఈ కథలు చదువుతున్నప్పుడు. ఒక కథా ప్రపంచాన్ని సృష్టించేటప్పుడు ఆ ప్రపంచం ఎంతైనా విస్తరించి ఉండొచ్చు. పంచభూతాలను ఏకం చేస్తూ ఏ అంశాన్నైనా ఎంపిక చేసుకోవచ్చు అది రచయితకుండే స్వేచ్ఛ. సౌలభ్యం. ఈ కథా సృజనలో శ్రీ ఊహ తనకున్న వెసులుబాటును చక్కగా వినియోగించు కున్నారనిపిస్తుంది. తాను ఊహించిన ప్రపంచానికి వాస్తవిక రంగులద్దారు.

ఇటీవలే ఇసుక అద్దం పేరుతో సరికొత్త కథలను తనదైన శైలిలో పరిచయం చేసారామె. ఆ కథలు పాఠకుల ఆదరణ చూరగొన్నాయి. తదుపరి పుస్తకం బల్కావ్ లోనూ వైవిధ్యమైన కథలను అందుబాటులోకి తెచ్చారు. బల్కావ్ అంటే బాల్కనీ. ఈ కథలను ఏ చాయ్ తాగుతూనో, ప్రకృతిని ఆస్వాదిస్తూనో ఒక్కో కథను చక్కగా ముగించవచ్చు. ముగించిన తరువాత కూడా కథావరణంలోకి చొచ్చుకొని పోయిన మనం అంత తొందరగా బయటకు రాలేము. ఆ బస్తీ గల్లీల్లోనో, ఆ రోడ్డెలపైనో కథల్లో తారసపడిన మనుషులను వెతుక్కుంటాం.



బల్కావ్‌లో పది కథలు ఉన్నాయి. పది కథలద్వారా పది ప్రపంచాలు పరిచయం అవుతాయి. ఒక కథ అకస్మాత్తుగా పాతబస్తీలో పరిచయమైతే మరో కథ ఏ వర్జీనియాలోనో మొదలవొచ్చు. పదింటికీ పది ప్రాంతీయ నేపథ్యాలు ఉన్నాయి. పది జీవన వేదనలు ఉన్నాయి. కథల కోసం ఎంపిక చేసుకున్న వస్తువులు కేవలం తన మస్తిష్కంలో పుట్టిన ఊహా నేపథ్యాలు మాత్రమే కావు. తనకు తెలిసిన చిన్న సంగతికి తనకేమాత్రం తెలియని అతిపెద్ద చరిత్రను వెతికి, పరిశోధించి కథలను పరిపుష్టం చేసిన శ్రమ కథలు. ఈ కథలను పరిశోధన పరిశీలన కలగలుపుగా చెప్పవచ్చు. ఈ ప్రక్రియ తనకు గొప్ప అనుభూతినిచ్చిందని ఒకచోట తన సంతృప్తి వెలిబుచ్చారు రచయిత్రి.

కథలను కథలుగానే చూడకుండా అందులోనే భాష కూడా ప్రత్యేకంగా నిలిచిందని చెప్పవచ్చు. అలాగే మనదైన ఈ భాషను ఆస్వాదించవచ్చు. గోవాలో ప్రారంభమయ్యే కథ కావచ్చు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నేపథ్యంలో జరిగే ఒక ధూల్పేట కుర్రాడు జీవనాన్వేషణ కావచ్చు. ప్రతి దాంట్లోనూ పొరలు పొరలుగా విడివడుతూ కథకు కొత్తదారులు మన ఊహ లోకంలోనే తెరుచుకుంటాయి. ఈ కథలన్నీ మనం చదువుతూ ఎంతవరకు ఊహించగలమో అంతటి ఊహకు అవకాశం ఉన్న కథలు.

సాధారణంగా ట్రావెలాగ్ అనగానే తాము వెళుతున్న లేదా తమ సందర్శించిన ప్రాంతాల చరిత్రను వాటిని సందర్శించిన అనుభూతులను పంచుకుంటూ ఉంటారు. శ్రీ ఊహ వీటికి తన మనసును జోడించారు. అందుకే ప్రతి కథలోనూ జీవన లాలస కనబడుతుంది. ఒక కొత్త ఆశను జోడించుకున్న ప్రేమైక కథలయ్యాయి. ప్రతి మనసు పడే సంఘర్షణకు అద్దంపట్టే కథలూ అయ్యాయి. ఒంటరిగా, స్వేచ్ఛగా ఒక ప్రాంతాన్ని సందర్శించినప్పుడు మనకు తెలియకుండానే సెల్ఫ్ రిఫ్లెక్షన్ ఏ రకంగా ఉంటుందో అనుభవ పూర్వకంగా చెప్తారు రచయిత్రి. తాను వెళ్లిన ప్రతి ఊరు ఒక కొత్త కథాస్థలే తనకు. తాను కలిసిన ప్రతి మనిషీ ఆమెకో హ్యూమన్ లైబ్రరీయే. తన వెతుకులాట అంతా కూడా వివిధ ప్రాంతాల్లోని మనుషులంతా ఒక్కటేనని, వారంతా సమానమైన జీవన వేదనలే అనుభవిస్తున్న వారని చెబుతారం. స్థలం, కట్టుబొట్టుల్లో మాత్రమే మార్పు ఉంటుంది అంటారు.

ఈ ప్రయాణాన్నంతటినీ తను 'ఒక సోల్ లిబరేటింగ్ ఎక్స్పీరియన్స్'గా చెప్పుకున్నారు. ఇది మాత్రమే కాదు విజయవాడలో ఆదిలాబాద్, వరంగల్, ఢిల్లీ, కోకాపేట్, బందర్ సీంద్రి తదితర ప్రాంతాల్లోనూ తాను స్వేచ్ఛగా సందర్శించి, తనకు కావలసిన సమాచారాన్ని సేకరించి దానికున్న ఆథెంటిసిటీని పరిశీలించి మరీ కథలుగా రూపుదిద్దిన ఈ ప్రయత్నానికి రచయిత్రికి ప్రత్యేక అభినందనలు. పుస్తకము చదువుతున్నంతసేపూ ప్రతి కథకు ఒక్కొక్క ప్రాంతాన్ని మనం సందర్శిస్తూ వెళ్ళిపోతూ ఉంటాము. ఆ కథలో మనము ఇమిడిపోయి ఆ ప్రాంతాల్లో ఆ పాతబస్తీ గల్లీలో మనము ఒక స్కూటీ వేసుకునో బైక్ లోనూ తిరుగుతూ అక్కడి ప్రజలను గమనిస్తూ ఉంటాం. ఇవన్నీ కూడా మనం సాధించుకున్న అనుభవాలే సాధిస్తేనే తప్ప తెలుసుకోలేని అనుభూతులు ఇక్కడ మరొక అంశాన్ని కూడా జోడించదలిచాను మహిళలు.. అందునా రచయిత్రులు ఏ బాదరబందీ లేకుండా వివిధ ప్రాంతాలను స్వేచ్ఛగా సందర్శించగలిగితే ఇటువంటి చక్కటి కథలు మరిన్ని వస్తాయని ఆశిస్తున్నాను.

- నస్రీన్ ఖాన్
writernasreen@gmail.com

రెక్కల కష్టం

రాళ్లపొలంలో నాగలికట్టి
సాలుకిరువాలుగా దున్నుతున్న
రైతన్న సేద్యంమీద
ఎన్ని జీవజాతుల భవిత దాగుందో!..

రోడ్డు పక్కన పండ్ల బండి
పెట్టుకుంది ఓ అక్క
అమ్ముడుపోనీ పండ్లవైపు చూస్తున్నప్పుడు
ఆ కళ్లలో ఎన్ని ఆకలి కావ్యాలో
లిఖించబడ్డాయో..

నెత్తిమీద కూరగాయల
గంప మోస్తున్న ఆమెపై
ఎంత మంది సన్నపిల్లల డొక్కలు
ఆధారపడ్డయో..

సంతలో పాత చీరల మూట అమ్ముడుబోతేనే
సాయబు ఆకలి తీరుతది లేదంటే
ఆ చీరలే ఉరితాళ్ళుగా మారుతాయోనని
ఆ సంతలో ఎన్ని దుఃఖపువాగులు పారెనో..

ప్రభుత్వ కొలువుకోసం
గ్రంథాలయాలలో అర్ధరాత్రి దాకా
చదివే నిరుద్యోగి ఉద్యోగంపై
ఏ తల్లిదండ్రుల
కలలపంటలు దాగున్నాయో..

వరి కోతకు వంగి వంగి లేసి చూస్తూ
బొబ్బలుపోయిన అమ్మ రెక్కలపై
ఏ బిడ్డ బంగారు భవిష్యత్తు దాయబడిందో..!

బస్తాలమీద బస్తాలు మోసి
దేహంపై చెమట నది పారిస్తున్న నడుములపై
ఏ కన్న కొడుకు బత్కు
రూపుదిద్దుకుంటుందో..!

పేదలకు రెక్కలే ఆస్తులు
ఆ రెక్కలమీదనే బత్కుదెరువుకు
పునాదులు తవ్వుకుంటారు..


-అవనిశ్రీ,
9985419424.

14న 'జస్ట్ ఎ హౌజ్ వైఫ్' పుస్తకావిష్కరణ

ఈ నెల 14 న రవీంద్రభారతి మినీ కాన్ఫరెన్సు హాల్లో కుందుర్తి కవిత 'జస్ట్ ఎ హౌజ్ వైఫ్', ఫ్రీవర్స్ ఫ్రంట్ వాట్సాప్ సమూహం పోటీ కవితల సంకలనం 'ఆనవాళ్ళు' ఆవిష్కరణ ఉంటాయి. సభలో శివారెడ్డి, శిఖామణి, శీలా సుభద్రాదేవి, అనిల్ డ్యానీ, శ్రీరామ్, సమత తదితరులు పాల్గొంటున్నారు.

ప్రజలకు చేరాల్సిన కథలు 'చారల పిల్లి'

చారల పిల్లి పుస్తకంలో వేంపలందీశీఅవగ్లె షరీఫ్ రాసినవి కథలుగా బయటికి కనిపిస్తున్నా వాటిలో అంతర్లీనంగా ఒక వాస్తవికత, దానితో అనుసంధానించి ఒక అనుభవం, దాన్నుంచి సమాజానికి ఒక సందేశం, ఓ హెచ్చరిక, ఓ సూచన దాగి ఉన్నాయి. అవన్నీ అవగాహన చేసుకున్నప్పుడే ఆయన కథల తాలూకు పూర్తి ప్రయోజనం నెరవేరినట్టు. పుస్తకంలో అన్ని కథలూ బావున్నా ప్రధానంగా "సైకిలు చక్రాలు', 'చారలపిల్లి', "పత్తి గింజలు" అనే మూడు కథల గురించి మాట్లాడుతాను. వీటి గురించే ఎందుకు ప్రస్తావించాలనుకుంటున్నాను అంటే ఈ మూడు కథలను ఒక అంతస్సూత్రం బంధిస్తూ కనిపిస్తుంది కాబట్టి. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాల్లో ఏదో ఒక కారణంగా యుద్ధవాతావరణం నెలకొని ఉంది. అది ప్రచ్ఛన్న యుద్ధం కావచ్చు, ప్రత్యక్ష యుద్ధం కావచ్చు. మనదేశంలో కూడా కంటికి కనిపించని యుద్ధం (రెండు మతాల మధ్య) జరుగుతోంది. దేశంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ ఇలా ఎన్నో మతాల వారున్నా ముఖ్యంగా హిందూ - ముస్లిముల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొని ఉంది. కారణాలు ఏవైనా కానీ పరాకాష్టకు చేరుతున్న ఈ ఘర్షణ వాతావరణానికి పునాదులు ఎలా పడతాయి? అవి తిరగకూడని మలుపులు (ఉగ్రవాదం వంటి) ఎలా తిరుగుతున్నాయి? వాటికి అసలు



పరిష్కారం సాధ్యమా? వంటి విషయాలు ఈ కథల్లో అంతస్సూత్రంగా కనిపిస్తాయి. నేరుగా మీదేసుకుని చెప్పకుండా రచయిత కథను చెబుతూ మనకు అనేక విషయాలు బోధపరుస్తాడు. ఇక్కడ ఇతను చూపిన నైపుణ్యం ఇప్పటి కథకుల్లో అరుదైందిగా భావించాలి. 'పత్తిగింజలు' కథలో (ఘర్షణ వాతావరణానికి పునాదులు), చారలపిల్లిలో(తిరగకూడని మలుపులు), 'సైకిలు చక్రాలు లో ఈ సమస్యలకి పరిష్కారాలు కనిపిస్తాయి. మతోన్మాదం ఇప్పుడు దేశాన్ని పట్టిపీడిస్తోంది. అది ఏ మతానికి చెందినదైనా కావొచ్చు. దీని వల్ల ఎన్నో దారుణ మారణకాండలు జరుగుతున్నాయి. సమాజంలో వ్యక్తుల మధ్య వైషమ్యాలు లేకపోయినా, కొన్ని స్వార్థశక్తులు తమ ప్రయోజనాలకోసం సాగించే క్రీడలో సమాజం బలి అవుతోంది. దిక్కుతోచని స్థితిలో ఆక్రోశిస్తోంది. కురుక్షేత్ర సంగ్రామ యుద్ధంలో కర్తవ్య విమూఢుడైన అర్జునుడిలా ఆక్రోసిస్తున్న సమాజానికి, ఈ మూడు కథలు షరీఫ్ చేసిన గీతోపదేశాలు. ఈ కథలను పూర్తిగా చెబితే పాఠకులకు అందే అనుభూతి తగ్గిపోతుంది. అందుకే కథల కన్నా వాటిల్లోని సారం మీదే మాట్లాడాను. సమాజానికి ఈ కథల అవసరం ఉంది. వీటిని అర్థం చేసుకుని ముందుకు సాగితే, ఏ కుటిల శక్తులు మనుష్యుల మధ్య అంతరాలు సృష్టించలేవు. రచయిత నర్మగర్భంగా చెప్పిన ఈ అంశాలు ప్రజల మధ్యకు తీసుకు వెళ్లేందుకు విజ్ఞులు, మేధావులు కృషిచేస్తే బావుంటుంది. ఈ రచన విస్తృతంగా ప్రజలను చేరాలి.

- కె. లక్ష్మి
78935 19128

కనిపించని కుశల ప్రశ్నలు

పెనకలో దోపిన పాత కాయితం ఒకటి
కుంభ నిద్ర నుండి తెలివికున్నదేమో
పరాకులో నేల మీద పడి చిట్లిపోయింది
విరిగిపోయిన అక్షరాలు కొన్ని
పాలిపోయిన అక్షరాలు ఇంకొన్ని
కొన ఊపిరితో ఉన్నవి మరికొన్ని
అన్నిటికీ అన్ని కొట్టుమిట్టాడుతున్నవే
రూటం మాత్రం పదిలంగానే ఉంది

చానడు మాటకలుపులతో ఉన్న
ముందు జమనా ఉత్తరం ముక్క
బంధువులందరినీ పేరుపేరునా పలకరిస్తూ
ఆత్మీయత, అనుబంధాల కుశల ప్రశ్నలతో
ప్రేమానురాగాలకు రుజువుగా
ఎలాగోలా మిగిలిపోయిన కులాసాల ముక్క
చివరిలో.. మీ యోగక్షేమాల కొరకు
వేయి కళ్ళతో ఎదురుచూస్తుంటాం!

చదువుతున్నప్పుడు మైమరచిపోయి
సెల్‌ఫోన్‌తో మమతానురాగాలు తరిగి
బంధాల మధ్య కనిపించని కుశల ప్రశ్నలతో
పానుగొట్టుకున్నదేదో కళ్ళంట పూసింది
ఏకరవు పెట్టి పదే పదే మోగుతున్న
సెల్‌ఫోన్‌తో తెములుకొని తీరా చూస్తే
రానొచ్చిందొక్కటీ ఉత్తరం లాంటిది లేదు
అన్నీ, పైసల పత్రాకుల పరుగూ నడకలే!

- వినోద్ కుత్తుం, 9634314502

కులకష్పే

మంద వెట్టి శెండ్లల్లా వడకుంటా
సుట్టు జాలనో తడకలో కట్టినట్లు
మనం అక్షరాల వైపు పోకుంటా
కాళ్ళకు సూట్టుకున్న కులకష్పేను
పాతాళానికి దిగ్గొట్టెందుకు
క్రాంతి కొయ్యల జాడ దొరుకుతదేమో లెంకలే

పాల్మర్వని పిల్లలు
తల్లేంబడి వడకుంటా గూద్కా గప్పినట్టు
బడిబాట పట్టకుంట
మనల్ని నిర్బంధించిన కులకష్పే
గప్పను ఎత్తెందుకు
హైడ్రలెమన్న ఇటుబందుకు
అస్తున్నయేమో సూడలే

మేత కోసం మందను మన్నెం తోలినట్టు
కులకష్పేను ఏ గుట్టకన్న గెద్మి
మనల పుస్తకాలు పట్టిపిచ్చేందుకు
సుట్టు ఏడెడు పద్నాలుగు ఊర్ల అవుతలన్న
మాయల మరాఠీ పాణం చిలుకలున్నట్టు
సూది మొనంత అవకాశం ఉన్నదేమో అడిగి రావలే


మంద ఆకలి దిర్స తుమ్మకాయ దులిపినట్టో
యాపమండ నరికినట్టో
అడుపులకు జోగు దొలుతున్న కులకష్పే
అంటును నరికి పలక బలపల సద్ది గట్టే
గొడ్డలసుంటి గట్టి సుట్టమేవరన్న
మనకున్నరేమో ఆలోచన జేయ్యలే

గొవర్ధన గిరిని మొసినట్టు
2020 విజన్ దాటేసి అచ్చిన
నిరక్షరాస్యతను భుజాల మీద ఎత్తుకుని
మొస్తున్న
జాతి కులకష్పేను దించి
అక్షరాలతో 2050 వైపుకు నడిపించే
అల్లా ఉద్దీన్ అద్భుత దీపం
ఎమన్నా ఉన్నదేమో కనుగొనలే

అక్కడిక్కడ దేవులడుతు ఎతుకుడు బంజేసి
ఇంకా కులకష్పేనే బతుకుదెరువు
జేసుకొని బతుకుమని
కుల పథకాలు పెడుతున్న
పాలకుల కుతికే విస్కలా
అప్పుడే సుద్దముక్క మన చేతిలోకచ్చి
విద్యతో విలువైన ఆయుధంగా తయారవుతం

- జి.యం.నాగేష్ యాదవ్
9494893625

ఊరి తలపోత, యాదుల నెమరేత



రెండోగుండె లాంటిది గతం ..అది లోలోపల లోలకంలా కొట్టుకుంటుంది... అందరి మానసిక స్థితీ అంతోఇంతో అంతే కానీకొందరు మాత్రమే మనసు అనే స్టెత్ తో దాని వేగాన్ని కనిపెట్టగలరు. గతంలో ఏముంటుంది ఏమున్నా ఉండకపోయినా కోల్పోయినతనం ఉంటుంది కోల్పోయిన బాల్యం, స్నేహాలు, అనుబంధాలు ఆప్యాయతలు, ఇవి అందరిజీవితాల్లోనూ ఉంటాయి. కానీ సొంతఊరినే కోల్పోతే ఉనికినేకోల్పోవటం అది ఆఊరందరికీ ఊరంతటి విషాదం. ఇది చెల్లాచెదురైన జీవితాలకోసం గాలింపు , మొన్నల్లో మాయమైన మనుషులకై వెతుకులాట.. స్నేహాలు, ఆప్యాయతల్ని కోల్పోయిన ఒక పసివాడి పరితాపం.. సింగరేణి ఇనుపకాళ్ల కిందనలిగిన అల్లీపూలకు కు ఊరిచెరువు రాసుకున్న ఎలిజీ..

అందరికీ నోరున్నా కొందరు మాత్రమే పాడగలరు.. అందుకే ఊరందరి కంఠాల్ని తన గొంతులో కూర్చుకొని ఆ బ్లాక్ అండ్ వైట్ గురుతుల్ని మన కళ్లముందు రంగుల్లో నిలిపే యత్నమే ఈ పుస్తకం.. కవి, కథకుడు, ఆక్టివిస్ట్ నరేష్ కుమార్ సూఫీ వెలువరించిన 'మెమొరీస్ ఆఫ్ మంగలి పల్లె' పుస్తకం నిండా గుండెను తడిచేసే అనేక యాదుల మనాదులు. గుల్ దస్తా లాంటి ఈ పుస్తకానికి అరుణాంక్ లత రాసిన ముందుమాట కథల ప్రత్యేకత ఏమిటో తెలియజేస్తుంది.

ఇసుక తింటూ బొగ్గు విసర్జిస్తూ లోలోపల కుములుతున్న కుప్ప కూలుతున్న అండర్ మైనింగ్ కాదు.. ఇది ఊరిని ఉమ్మడి సంస్కృతిని, చెరువుని చెట్టుచేమని నోరుతెరిచి మింగిన ఓపెన్ కాస్ట్..

చెట్టును నరికేశాక పిట్టలదైన్యం ఈ పుస్తకంలోని కథనాల సారాంశం. మరో తావుకు ఎగరలేక గొడు కూలిన చోట ఉండలేక గుండె తండ్లాట. అక్కడ మాయం చేయబడ్డది భౌతికంగా ఊరినే కాదు పల్లె అనుబంధాలను. ఆప్యాయతలను తవ్విన ఆ శిథిలాలనిండా గతం తాలూకు అస్థి పంజరాలు. చుట్టూ పరిచిన ఎత్తు గుట్టల్లాంటి మట్టిదిబ్బలు గతం సమాధులు. ఖమ్మంలోని ఎన్ ఎస్ పీ క్యాంపు క్వార్టర్స్ కూల్చివేసి స్థానికులను నిర్వాసితులను చేసిన సందర్భంలో ఉప్పొంగిన కన్నీళ్ళు, వియోగాలు, చెల్లా చెదురైన స్నేహాలు, బంధుత్వాలు మరింత భారంగా మారిన బడుగు బలహీనుల బ్రతుకులు స్వయంగా చూసినవాడ్ని..శిథిలాల్లో మొలిచిన అక్షరాలపేరుతో కన్నీళ్ళకు కవిత్వం కట్టిన కవుల్లో నేనూ ఒకడ్ని.. ఒక ప్రాంతాన్ని ధ్వంసం చేస్తేనే అంత విషాదం విస్ఫోటనమైతే ఇక ఊరికి ఊరినే ఊడ్చేస్తే మరెంత ఉత్పాతమో... మీఎది మీదే మాది మాదే అన్న వేర్పాటు వాదం నేపథ్యంలో, తెలంగాణలో కథ ఉందా లేదా, కవిత్వం ఉందాలేదా అన్న చర్చల సందర్భంలో వెలువడిన నిఖార్సు తెలంగాణ సమాధానం.


కంచర్ల శ్రీనివాస్
9640311380

తెలంగాణదే సంస్కృతి సౌరభం.. అందులో నల్ల వజ్రాల గని సింగరేణిది మరింత వత్తైన నిశానీ.. సింగరేణి ఫ్లేవర్ తో వొచ్చిన ఈ కథలు నల్లబొగ్గు పెళ్ళలంత అందంగా, ఎర్ర నిప్పుకణికలంత భావసాంద్రంగా ఉన్నాయి.. రోజూ ఉదయాన్నే ఇళ్ల ముందు వెలిగే బొగ్గు పొయ్యిలు, ఆవాసన సింగరేణి అస్థిత్వాన్ని పట్టిచూపుతుంది. 7వ తారీకు జీతాలు ఆ హడావుడి ఆ పండుగ ఆ దావత్ లు, ఆప్రభావంతో వెలిగే వ్యాపారాలు కోల్ బెల్ట్ నల్లమట్టిలో విరిసే రంగు సింగిడి ప్రత్యేకత. కొత్తగూడెం, ఇల్లెందు, 8 ఇంక్ లైన్, వెంకటేష్ ఖని బొగ్గుబాయి ముంగిళ్ళలో గడిపిన నా.. నాన్ సింగరేణి బాల్యానికి ఆదృశ్యాలు పరిచితమే.

ఈ పుస్తకంలో ఇరవైఒక్క కథలున్నాయి కథలన్నీ రచయిత పాయింట్ ఆఫ్ వ్యూలో సాగుతాయి.. పుస్తకానికి ఎంచుకున్న ముఖ చిత్రమే గాఢమైన భావనను కలిగి ఉంది.. ఎడారి లాంటి ఊరినుంచి తన తల్లితో కలిసి నడుస్తున్న పిల్లవాడి దుఖపువెక్కిళ్ళకు చిత్రరూపం. విచ్ఛిన్నమైన ఉమ్మడి సంస్కృతికి దృశ్యరూపం ఈ కథలు. విధ్వంసానికి గురికాబడ్డ పల్లె తనానికి దర్పణాలు.

తెలంగాణ మాండలిక మాధుర్యం ఈ కథలకు ఆయువుపట్టు.. గుండెను కదిలించే మనస్సును చెమ్మబరిచే అంశాలను వస్తువులుగా ఎంచుకోవటంతోపాటు రచయిత తనదైన శైళిలో చెక్కిన శిల్పం మరో ఆకర్షణ. గతంఉన్న ప్రతివారికీ కనెక్ట్ అయ్యే కథలివి..ఇవి ఉబుసుపోని ముచ్చట్లు కావు దశాబ్దాలుగా మోస్తున్న గుండెనుండి దించుకున్న ఆవేదనా భారాలు.

ఈతరహా తలపోత కథలు తెలుగు సాహిత్యానికి కొత్తేం కాదు గతంలో నామిని, ఖదీర్ బాబు అనేకమంది తమ అస్థిత్వ యాదులను తలపోతలను కథలుగా పరిచారు. ఆ కథలు ఎంతటి విశిష్ట స్థానాన్ని పొందాయో ఈకథలూ వాటికి తక్కువ కాకుండా ఉన్నాయి. పల్లె మంత్రసానులు, వీధి బళ్ళు, గ్రామీణ ఫొటోగ్రాఫర్లు, మెకానిక్‌లు, పంచరు దుకాణాలు, టైలరింగ్ షాపులు, చిల్లర కొట్లు, కాకా హొటళ్లు, ఇట్లా ఎన్నో చేతివృత్తులు చిరు వ్యాపారాలు కళ్లముందు మెదులుతాయి.

అగ్రవర్ణాల అహంకారాలకు గురైన కొన్ని కులాల దైన్యం ఈకథల్లో ఉంది.. ఆనాటి ఆవేదనకు ఇప్పటి అక్షర రూపం.. అమానుషం మరిచిపోలేదన్న సాక్ష్యం.. వేటికవే విభిన్నతను కలిగిఉన్న ఈకథలను అన్నీ చదివి తీరాల్సిందే ప్రత్యేకంగా ఒకటో రెండో కథలను పరిచయం చేయటంకన్నా అన్ని కథలతో స్నేహం చేయాలి.. అనపపూల వాసన, మా ఊరిసమ్మక్క జాతర, మొంబత్తీల పండుగ, మావాడ చెట్ల తీర్థాలు, అల్లీపూలు, పోశమ్మ శిలుకలు ఔసులోళ్ళ రమేష్, మా అమ్మ మంత్ర సాని, గంగ నీళ్ల తొవ్వ, నారాయణ సావుకారి, పాటల దావత్, జమాల్ ఓటల్ కథల శీర్షికలన్నిటిలో తెలంగాణ పరిమళం...కథలు చదివాక అనేక పాత్రలు మనకళ్లల్లో చిరస్థాయిగా మిగులుతాయి. ■



వంటావార్పు కార్యక్రమాన్ని జయప్రదం చేయండి : సీఐటీయు

నవతెలంగాణ-వైరాటౌన్

డిసెంబర్ 16, 17 తేదీల్లో జరిగే మధ్యాహ్నం భోజన వర్కర్స్ కలెక్టరేట్ ముందు వంటావార్పు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటీయు జిల్లా నాయకులు తోట నాగేశ్వరరావు, వైరా పట్టణ కన్వీనర్ అనుమోలు రామారావు కోరారు. ఆదివారం మధ్యాహ్నం భోజనం వర్కర్స్ వైరా పట్టణ, రూరల్ కమిటీల సమావేశం స్థానిక బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో పరస రూప అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తోట నాగేశ్వరరావు, అనుమోలు రామారావు మాట్లాడుతూ మండలంలోని మధ్యాహ్న భోజన వర్కర్స్ అందరూ గ్రామాలలో కిరాణా షాపులు వద్ద అప్పులు చేసి పిల్లలందరికీ నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారని అన్నారు. కానీ మధ్యాహ్నం భోజనం వర్కర్స్‌కు పాఠశాలలు ప్రారంభించి ఆరు నెలలు ముగిసినా ప్రభుత్వం బిల్లులు చెల్లించడంలో నిర్లక్ష్యం వహించిందన్నారు. కేవలం రెండు నెలల వేతనాలు మాత్రమే అందించారని, ఇక బిల్లులు మాత్రం ఎవరికీ ఎన్ని నెలలు వచ్చినవి అనేది ఎలాంటి స్పష్టత లేదని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న సమయంలో ప్రతిరోజు రెండు రకాల కూరలు చేయాలనడం సిగ్గుచేటు అని విమర్శించారు. ప్రభుత్వమే నిత్యావసర సరుకులతో పాటు కోడిగుడ్లు అందించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం పదివేల రూపాయల వేతనం వెంటనే ఇవ్వాలని, సబ్సిడీకి గ్యాస్ అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించి ప్రమాద బీమా, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మధ్యాహ్న భోజనం వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని, లేనిచో అన్ని పాఠశాలలో మధ్యాహ్న భోజన వర్కర్స్ వంటను బహిష్కరించి ఆందోళన చేస్తారని అన్నారు. డిసెంబర్ 16, 17 తేదీల్లో కలెక్టరేట్ కార్యాలయాల ముందు జరిగే వంటావార్పును మధ్యాహ్న భోజనం కార్మికులందరూ జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం వర్కర్స్ ప్రమీల, మంగమ్మ, హుస్సేన్ బి.కృష్ణవేణి, కరుణ, పుష్పవతి పాల్గొన్నారు.



మంచిని అనుసరిద్దాం - చెడుపై పోరాడుదాం

- సనాతనధర్మంపై సెమినార్‌లో సీపీఐ(ఎం) జిల్లా విద్యా విభాగం సభ్యులు పల్లా కొండలరావు

నవతెలంగాణ - బోనకల్

ఏది సనాతనమో తేల్చితే మంచిని అనుసరించడానికి, చెడుపై పోరాడడానికి ప్రజలకు అవకాశం ఉంటుందని సీపీఐ(ఎం) రాజకీయ విద్యా విభాగం సభ్యులు, పల్లె ప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు అన్నారు. స్థానిక వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సనాతనధర్మం అనే అంశంపై ఆదివారం సెమినార్ నిర్వహించారు. స్టడీ సర్కిల్ కన్వీనర్ తెల్లాకుల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ సనాతనం ముసుగులో మనుధర్మాన్ని రాజ్యాంగంగా తీసుకురావాలనే కుట్రలు భారతీయ సమాజానికి అత్యంత ప్రమాదకరమైన అంశంగా ప్రజలు గుర్తించాలన్నారు. ప్రజలకు తమ ఇష్టం వచ్చిన మతవిశ్వాసాలను పాటించే హక్కు మన రాజ్యాంగం కల్పించిందన్నారు. దేశంలో కార్పొరేట్ సంస్థలు ప్రకృతి వనరులను విధ్వంసం చేస్తుంటే పాలకులు వారికి కొమ్ము కాస్తూ, ప్రజలను మూఢత్వం వైపు చూసేలా చేస్తున్నారన్నారు. దీనివల్ల దోపిడీ కొనసాగుతుందని, సమాజంలో విద్వేషాలు పెరిగితే పాలకులకు, దోపిడీదారులకే ప్రయోజనమన్నారు. సెమినార్‌లో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, మధిర డివిజన్ నాయకులు పాపినేని రామనర్సయ్య, మండల కార్యదర్శి కిలారు సురేష్, బంధం శ్రీనివాసరావు, మర్రి తిరుపతిరావు, తుళ్ళూరు రమేష్, గుగులోతు నరేష్, బోయినపల్లి కొండ, కొండేటి అప్పారావు, రచ్చా శివ, మచ్చ గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



త్రివేణి విద్యార్థులకు మోటివేషన్‌లు, సన్మానాలు

నవతెలంగాణ-ఖమ్మం

2023-24 విద్యా సంవత్సరంలో త్రివేణి పాఠశాల నుండి 10/10 జీపీఏ సాధించిన విద్యార్థిని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఆదివారం త్రివేణి యాజమాన్యం సన్మానం చేశారు. త్రివేణి పాఠశాలలోని సత్తుపల్లి ఖమ్మం బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థిని విద్యార్థులను సన్మానించారు ఈ సందర్భంగా త్రివేణి పాఠశాలల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ త్రివేణి విద్యార్థులు కేవలం చదువులోనే కాదు సద్గుణాలలోనూ అందరికంటే ముందుంటారని, నిత్యం తమ నైపుణ్యాలను పెంచుకోవడం కోసం ప్రయత్నం చేయడానికి త్రివేణి ఎల్లప్పుడూ అనుకూలమైన అవకాశాలను కలిగిస్తుందని అన్నారు. కార్యక్రమంలో సన్మాన గ్రహీతలైన విద్యార్థుల తల్లిదండ్రులు త్రివేణి పాఠశాల తమకు ఒక మైలురాయి వంటిదని, త్రివేణి పాఠశాలలో చదివించడం ఎంతో గర్వకారణం అని తెలియజేశారు. అనంతరం ప్రముఖ సైకాలజిస్ట్ మోటివేషనల్ స్పీకర్ కార్పొరేట్ ట్రైనర్ డాక్టర్ వంగిపురపు శ్రీనాథ చార్యులు మాట్లాడుతూ మనిషికి లేదా విద్యార్థికి తన మీద నమ్మకం ఉండాలని ఆత్మవిశ్వాసంతో పని చేస్తే విజయాన్ని సాధించవచ్చని నమ్మకూడని విషయాల పట్ల లేదా అనవసరమైన విషయాల పట్ల విద్యార్థులు నమ్మకాన్ని కలిగి ఉంటే జీవితాలు ఏమి సాధించలేరని విద్యార్థులు ఎల్లప్పుడు తమను తాము ఉద్ధరించుకోవడం కోసం తమలో ఉన్న నైపుణ్యాలను శక్తిని గుర్తించుకుంటూ వాటిని అభివృద్ధి పరచుకోవాలని సూచించారు. అంతేకాకుండా రానున్నది పరీక్షలు కాలం ఈ సమయంలో విద్యార్థులు ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత అలవాటులను తమ లక్ష్యానికి అనుగుణంగా మార్చుకుంటూ తమను తాను సరిదిద్దుకుంటూ పరీక్షలకు సన్నద్ధం కావాలని, నమ్మకాన్ని ఎప్పుడు కోల్పోవద్దని ఎవరి మీద వాళ్ళకి నమ్మకం ఉంటే వాళ్ళు కచ్చితంగా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. కార్యక్రమంలో త్రివేణి పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, ఖమ్మం త్రివేణి పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, సత్తుపల్లి త్రివేణి పాఠశాల ప్రిన్సిపాల్ సరిత, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ, మైసమ్మ బోనాల జాతర

నవతెలంగాణ-ముదిగొండ



మండలపరిధిలో పమ్మి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ, ముత్యాలమ్మ, బంగారు మైసమ్మ దేవాలయాలు ప్రారంభించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా మొదటి వార్షికోత్సవ బోనాల జాతర ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు, చిన్నారులు, భక్తులు ఇంటికొక బోనమెత్తి ఆటపాటలతో, ముత్యాలమ్మ మైసమ్మ దేవాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి దేవాలయాలలో జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ముత్తారం దేవాలయం పూజారి బోర్రా వాసుదేవాచార్యులు, గ్రామ మాజీ సర్పంచ్ కొండమీద సువార్తరఘుపతి, గ్రామ మాజీ ఎంపీటీసీ కోయ రమేష్, గ్రామ మాజీ ఉపసర్పంచ్ వడ్డే మాధవరావు, గ్రామ పెద్దలు ఏలూరి హనుమంతరావు, రాయబారపు పెద్ద ఉపేందర్, రాయబారపు శ్రీను, రమేష్, తాళ్లూరి మల్లయ్య, టీఎస్ కళ్యాణ్, చింతకింది నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

నవతెలంగాణ-వైరాటౌన్

ఐద్వా వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పెరిగిన వస్తువు ధరలు తగ్గించాలని రేచర్ల బజార్, బోడేపూడి కాలనీలో సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఐద్వా వైరా పట్టణ కార్యదర్శి తోట కృష్ణవేణి మాట్లా డుతూ కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాల విధానాల వలన నిత్యావసర వస్తువుల రేట్లు రోజురోజుకు విపరీతంగా పెరుగుతున్నాయని, పెరిగిన ధరలను తక్షణమే నియంత్రించాలి, రేషన్ షాపుల ద్వారా పేదలందరికీ కేరళ తరహాలో 17 రకాల నిత్యవసర వస్తువులను అందించాలని అన్నారు. కార్యక్రమంలో మాదినేనీ రజిని, మాడపాటి సుజాత, మాడపాటి రమాదేవి, మనీ, కే.భానుమతి, పువ్వాడ సరోజినీ, కట్ట ఆశాబేబీ, తాటి కృష్ణకుమారి, చావా కళావతి తదితరులు పాల్గొన్నారు.



ఏడాదిలోనే రూ.300 కోట్ల అభివృద్ధి

- వాటిలో అంతర్గత రహదారులకు రూ.100కోట్లు
- వసతిగృహాల నిర్మాణాలలకు రూ.120కోట్లు
- నిరుద్యోగ యువతకు ఉపాధిగా మారనున్న ఫుడ్‌పార్కు
- సింగరేణి ప్రభావిత ప్రాంతాల సమస్యలకు ఇక చెల్లుచీటి
- యేడాదిలో సాధించిన అభివృద్ధిపై 'నవతెలంగాణ'తో ముచ్చటించిన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్



నవతెలంగాణ-సత్తుపల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక యేడాది కాలంలోనే నియోజకవర్గ వ్యాప్తంగా సుమారుగా రూ.300కోట్ల మేర అభివృద్ధి జరిగిందని సత్తుపల్లి తొలి మహిళా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా గెలిచాక ఈ యేడాది కాలంలో సాధించిన అభివృద్ధి, విజయాలు, ప్రజా సమస్యలకు పరిష్కారాలు తదిత రాంశాలపై ఎమ్మెల్యే రాగమయి దయానంద్ 'నవతెలంగాణ' ప్రతినిధితో ముచ్చటించారు. ఈ యేడాది కాలంలో పైన తెలిపిన నిధుల నుంచి రూ. 100కోట్ల వరకు సత్తుపల్లి మున్సిపాలిటీతో సహా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. దశాబ్దాల తరబడి శిథిలమైన హాస్టళ్ల భవనాల్లో ఉంటూ విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థుల సౌకర్యార్థం రూ.120 కోట్లతో కొత్తగా వసతిగృహాల నిర్మాణాలను చేపట్టామన్నారు. ఈ ప్రాంత బాలికల నర్సింగ్ విద్యకోసం రూ. 18కోట్లతో నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు శ్రీకారం, రూ. 40కోట్లతో సత్తుపల్లిలోని వెంగళరావునగర్ నుంచి కిష్టారం వరకు డివైడర్‌తో సహా నాలుగు వరసల రహదారి ఏర్పాటుతో నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అంతేగాక సిద్దారం రోడ్డు స్టార్టింగ్ నుంచి గౌరిగూడెం మూలమలుపు (కొత్తూరు రోడ్డు) వరకు సుమారు రూ.7కోట్లకు పైగా నిధులతో డివైడర్‌తో పాటు సెంట్రల్ లైటింగ్‌తో రహదారిని ఆధునీరించనున్నట్లు ఎమ్మెల్యే రాగమయి దయానంద్ చెప్పారు.

సత్తుపల్లి ప్రాంత యువతకు ఉపాధిగా మారనున్న 'మెగా ఫుడ్‌పార్కు

సత్తుపల్లి మండలం బుగ్గపాడులో టీజీఐఐసీ ఆధ్వర్యంలో 2008లో శంకుస్థాపన జరిగి గత పాలకుల నిర్లక్ష్యానికి గురై పిచ్చిమొక్కలతో నిండిపోయిన ఫుడ్‌పార్కు రూపురేఖలు మార్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రోత్సాహంతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిల సహకారంతో ఫుడ్‌పార్కును ఈనెల 5న ప్రారంభించుకోవడం జరిగిందని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ తెలిపారు. ఫుడ్‌పార్కును ప్రారంభించుకోవడం ద్వారా ప్రభుత్వ సహకారంతో ఫుడ్‌పార్కుకు ఎక్కువ పరిశ్రమలు వచ్చేలా కృషి జరుగుతుందన్నారు. ఫుడ్‌పార్కుకు ఆశించిన స్థాయిలో పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు సుమారుగా 20వేలకు పైగా ఉద్యోగావకాశాలు దొరుకుతాయన్నారు. అంతేగాక ఈ ప్రాంత వ్యవసాయ కూలీలకు, రోజువారీ పనులకు వెళ్లే వారికి సైతం కూలిపనులు పుష్కలంగా యేడాది పొడవునా ఉంటాయన్నారు.

సింగరేణి ప్రభావిత ప్రాంతాల ప్రజల సమస్యలకు ఇక చెక్

2005లో సత్తుపల్లిలో సింగరేణి ఉపరితల (ఓపెన్‌కాస్ట్) గనులు ప్రారంభమైన నాటినుంచి ప్రభావిత ప్రాంతాల ప్రజలు పడుతున్న వెతలు అంతాఇంతా కాదని గత 19యేండ్లకు పైగా వారి వెతలను ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి వారు బొగ్గు వెలికితీత కోసం ఉపయోగించే బాంబ్ పేలుళ్ల మోతాదుకు మించి ఉండటంతో అతి సమీపంలో ఉన్న వెంగళరావునగర్ మొదలుకొని ఎన్టీఆర్‌నగర్ వరకు ఆయా ప్రాంతాల నివాస గృహాలు పగుళ్లువారడం, స్లాబు పెచ్చులు రాలిపడటం జరుగుతూ వస్తోందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు పడుతున్న సమస్యలు, ఇబ్బందులకు ఇక చెక్ పెట్టనున్నామన్నారు. అసెంబ్లీ వేదికగా సింగరేణి ప్రభావిత ప్రాంతాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి స్పందించారన్నారు. ఈ నేపథ్యంలోనే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారన్నారు. ప్రజల నివాసాలను, వారి ఇబ్బందులను ప్రత్యక్షంగా చూడటం జరిగిందన్నారు. వెంటనే స్పందించి అప్పటికప్పుడే దెబ్బతిన్న ఇండ్ల నిర్మాణాలను టాలాటోలీగా కాకుండా నాణ్యతతో చేపట్టాలని అక్కడికక్కడే డిప్యూటీ సీఎం సింగరేణి అధికారులకు ఆదేశాలు ఇచ్చారన్నారు. ఇదేగాక కిష్టారం అంబేద్కర్‌నగర్ వాసులకు సమీపంలోని సిలో బంకర్ వల్ల వస్తున్న ఇబ్బందులకు పరిష్కారం చూపడం జరిగిందన్నారు.



ఎమ్మెల్యే రాగమయి దయానంద్ కుటుంబ నేపథ్యం ఇలా...

సామాజికసేవ, వైద్యసేవలు అందించే డాక్టర్ రాగమయి దయానంద్ అనుకోకుండా 2023 నవంబరులో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్టుపై పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. సేవలు చేయడం ఆమెకు కొత్తేమి కాదు. ఇంకా చెప్పాలంటే ఆమె కుటుంబమంతా సేవకులే అని చెప్పాలి. ఆమె మామ కృష్ణమూర్తి స్వాతంత్ర్య సమర యోధులు, ప్రముఖ వైద్యులు, 5 దశాబ్దాల కిందటే వైద్యపరంగా సేవలందించారు. పేదవర్గాల స్థితిగతుల బట్టి అసలు ఫీజులే తీసుకొనేవారు కాదని అప్పట్లో చెప్పుకుంటుండేవారు. సత్తుపల్లి మండలం కాకర్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్థలం కూడా కృష్ణమూర్తే దానం చేశారట. ఇక ఆమె అత్తగారు ఆరోగ్యమ్మ సామాజిక సేవకురాలు. ఆమె నిత్యం ఏదోఒక సేవా కార్యక్రమం చేపట్టకుండా ఉండేవారు కాదు. భర్త దయానంద్ విషయానికొస్తే ఆయన చేతికి ఎముక ఉండదంటారు. ఎవరన్నా సాయం అడిగితే లేదనే మాట ఆయన నోటివెంట వచ్చిన దాఖాలు మచ్చుకు కూడా కానరావు. ఆయన తల్లిదండ్రులను మించిన దయార్ద్ర హృదయుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన గురించి చెప్పాలంటే ఇంకా ఎవరి గురించి చెప్పడానికి పేజీలుండవు. ఎమ్మెల్యే రాగమయి దయానంద్ దంపతులకు నలుగురూ ఆడసంతానమే. పెద్ద కుమార్తె అరుదైన వ్యాధికి గురై మరణించింది. రెండో కూతురు ఎంబీబీఎస్ పూర్తిచేయగా తరువాత జన్మించిన ఇద్దరి కవలలు ప్రస్తుతం నీట్ కోచింగ్‌లో ఉన్నారని ఎమ్మెల్యే చెప్పారు.

పోరాటాలే ఎజెండా..

సీపీఐ (ఎం) ఖమ్మం డివిజన్ నూతన కార్యదర్శి వై. విక్రమ్

- కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ అధిక స్థానాలు గెలిచేలా ప్రణాళిక
- పార్టీ డివిజన్ కమిటీల పునరుద్ధరణ

నవతెలంగాణ -ఖమ్మం



పోరాటాలే ఏజెండాగా పార్టీని ముందుకు నడుపుతామని సీపీఐ (ఎం) ఖమ్మం డివిజన్ నూతన కార్యదర్శి వై.విక్రమ్ స్పష్టం చేశారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ అధిక స్థానాలు గెలిచేలా ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. 2016లో బీఆర్ఎస్ ప్రభుత్వం పదింటిని 33 జిల్లాలుగా విభజించడంతో రద్దయిన డివిజన్ కమిటీలను తిరిగి పునరుద్ధరించారు. ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన డివిజన్ 18వ మహాసభల్లో విక్రమ్ డివిజన్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ జబ్బార్, దొంగల తిరుపతిరావు, ఎస్ నవీన్ రెడ్డి, నాగసులోచన అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.సాయిబాబు, పోతినేని సుదర్శన్ ప్రసంగించారు. పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పలు తీర్మానాలను ప్రవేశపెట్టగా సభ వాటిని ఏకగ్రీవంగా ఆమోదించింది. మహాసభల ప్రారంభోత్సవానికి ముందు చర్చి కాంపౌండ్ నుంచి బోనకల్ రోడ్డులోని సెయింట్ మేరీస్ పాఠశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎరుపు రంగు చీరలు ధరించి మహిళలు కోలాట నృత్యాలు చేస్తూ సాగించిన ప్రదర్శన ఆకట్టుకుంది. పార్టీ సీనియర్ నాయకులు బండారు యాకయ్య పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అధ్యక్షవర్గం మహాసభను కొనసాగించింది. యర్రా శ్రీనివాసరావు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. 25 మందితో ఖమ్మం డివిజన్ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యదర్శిగా వై.విక్రమ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఖమ్మం మాజీ ఎమ్మెల్యే తమ్మినేని వీరభద్రం, నాయకులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, యర్రా శ్రీకాంత్ సూచనలు, సలహాల మేరకు పార్టీని ముందుకు నడిపించేలా 25 మందితో ఏర్పడిన డివిజన్ కమిటీ కృషి చేస్తుందని వై.విక్రమ్ అన్నారు.

విద్యార్థి దశ నుంచి ఉద్యమ పంథానే..!

విద్యార్థి దశ నుంచి విక్రమ్ ఉద్యమ పంథాలోనే సాగారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థి సమస్యలపై పోరాడేందుకు ఎస్ఎఫ్ఐను వేదికగా చేసుకున్నారు. ఇంటర్మీడియట్ ఖమ్మంలోని సిద్ధారెడ్డి కాలేజీలో చేరి ఎస్ఎఫ్ఐకి కళాశాల ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ఖమ్మంటౌన్ ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడుగానూ పని చేశారు. 2000 సంవత్సరంలో సీపీఐ (ఎం) సభ్యునిగా సభ్యత్వం తీసుకున్న విక్రమ్, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాటాలనే మార్గంగా ఎంచుకున్నారు. 2002లో రౌడీషీట్ ఓపెన్ చేసి ఆనాటి ప్రభుత్వం నిర్బంధాలకు గురిచేసింది. 2002 నుంచి డీవైఎఫ్ఐ టౌన్ అధ్యక్షుడుగా, టౌన్ కార్యదర్శిగా పనిచేశారు. ఈ సమయంలో పేదలకు ఇళ్లస్థలాల కోసం ఖమ్మం నగరంలో సీపీఐ (ఎం) నిర్వహించిన ఆమరణ నిరాహార దీక్షలో నాయకులు యర్రా శ్రీకాంత్‌తో పాటు విక్రమ్ సైతం భాగమయ్యారు. 2005లో సీపీఐ(ఎం) టూ టౌన్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. నాటి నుండి 10 ఏళ్ల పాటు ఆ బాధ్యతల్లో కొనసాగారు. నగరంలో పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారు. తెలుగుదేశం ప్రభుత్వానికి వ్యతిరేకంగా అఖిలపక్షాల ఆధ్వర్యంలో 2000లో చేపట్టిన విద్యుత్ ఉద్యమంలో ఎస్ఎఫ్ఐ నాయకునిగా విక్రమ్ భాగస్వాముల య్యారు. నాటి ప్రభుత్వ దమనకాండలో భాగంగా మయూరి సెంటర్‌లో జరిగిన పోలీస్ లాఠీచార్జీలో రైల్వే ఓవర్ బ్రిడ్జిపై నుండి పడటంతో విక్రమ్‌కు గాయాలయ్యాయి. అదే సమయంలో విద్యుత్ పోరాట యోధుడు సత్తెనపల్లి రామకృష్ణ మృతితో ఖమ్మంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల్లో పలువురు ఎస్ఎఫ్ఐ నాయకులపై అక్రమ కేసులు నమోదయ్యాయి.

దీనిలో భాగంగా పలువురు ఎస్ఎఫ్ఐ, సీపీఐ(ఎం) నాయకులను వరంగల్ సెంట్రల్ జైలుకు తరలించారు. 2014లో జరిగిన భూ పోరాటంలో భాగంగా మరో రెండు సార్లు విక్రమ్ జైలు జీవితం గడిపారు. ప్రస్తుతం సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా ఉన్న ఆయన బీజేపీ అనుబంధ సంఘాలు ప్రజల ఆహారపు అలవాట్లపై సాగిస్తున్న ప్రచారాన్ని నిరసిస్తూ ఖమ్మంలో నిర్వహించిన పెద్దకూర పండుగలో విక్రమ్ భాగస్వాములయ్యారు అనే పేరుతో స్వగ్రామం బోనకల్ మండలం రావినూతలలోని ఆయన ఇంటిపై దాడులకు యత్నించిన సందర్భాలూ ఉన్నాయి. ఖమ్మం పాత బస్టాండ్, రైతుబజార్ ఎత్తివేయడం, కొత్త బస్టాండ్ నిర్మాణంలో చోటు చేసుకున్న అవినీతిపై ప్రశ్నించాడనే కారణంతో విక్రంపై కేసులు నమోదయ్యాయి. ఇలా మొత్తంగా విక్రమ్‌పై 14 కేసులు నమోదయ్యాయి. 2002లో ఖమ్మం నగరంలో ప్రకృతి ఆహారపు అలవాట్లపై మంతెన సత్యనారాయణరాజు ద్వారా అవగాహన సదస్సులు నిర్వహించారు. ఇవే కాక బ్లడ్ డొనేషన్ క్యాంపులు, 2017 నుంచి బోడెపూడి విజ్ఞాన కేంద్రంతో కలిసి ప్రతి నెల మొదటి శనివారం వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. దీనిలో దీర్ఘకాలిక వ్యాధి బాధితులు సుమారు 700 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. వీటన్నింటిలోనూ విక్రమ్ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం పార్టీ సోషల్ మీడియా బాధ్యతలు కూడా పర్యవేక్షిస్తున్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన

త్వరలో పోరాట కార్యాచరణ

పెన్షనర్ల సదస్సులో రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రబాబు

నవతెలంగాణ-ఖమ్మం



అపరిష్కృతంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించక పోతే ఆందోళన బాట పట్టక తప్పదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అర్వివి రాజేంద్రబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల-సమస్యల పరిష్కారం పట్ల నాన్చివేత ధోరణిని అవలంభిస్తుందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ల సదస్సు ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య -అధ్యక్షతన జరిగిన సభలో రాజేంద్రబాబు మాట్లాడుతూ పెన్షనర్లకు సంబంధించి నాలుగు విడతల డిఏ పెండింగ్లో ఉందని సత్వరం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాలకులు నగదు రహిత వైద్యం గురించి పదే పదే చెబుతున్నప్పటికీ అమలు కావడం లేదని, వృద్ధాప్యంలో అనారోగ్య పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో నగదు రహిత వైద్యం అందక పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాజేంద్రబాబు తెలిపారు. తక్షణం పెన్షనర్లకు అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందేవిధంగా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఇటీవల కాలంలో పదవి విరమణ పొందిన ఉద్యోగులకు అందాల్సిన పెన్షనర్ల బెనిఫిట్లు అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని మార్చిలో పదవి విరమణ పొందిన వారికి సైతం ఇప్పటి వరకు బెనిఫిట్సన్ను ప్రభుత్వం అందించడం లేదని పదవి విరమణ పొందిన వెంటనే ఆర్థిక ఇతర విషయాలను అమలయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని రాజేంద్రబాబు డిమాండ్ చేశారు. పిఆర్సి అమలులో సైతం జాప్యం జరుగుతుందని ప్రస్తుత ముఖ్యమంత్రి పిఆర్సిపై ఇచ్చిన హామీని నిలబెట్టుకునే విధంగా సత్వరం ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోరారు. పై డిమాండ్ల సాధనకు తెలంగాణ రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో త్వరలో ఆందోళనబాట పడతామని, ఇందుకు తగిన కార్యాచరణ రూపొందించుకున్నట్లు తెలిపారు. ఇతర సంఘాలను కలుపుకుని జేఏసీగా ఏర్పడడం జరిగిందని, ఉమ్మడి ఎజెండాతో జాయింట్ యాక్షన్ కమిటీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పోరాడుతుందన్నారు. సదస్సుకు ముందు మహాత్మగాంధీ, బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు-పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సదస్సులో పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవి నర్సింగరావు, సీనియర్ ఉపాధ్యక్షులు వి.రాంమనోహర్, దేశ్ పాండే, వి.మనోహర్రాజు, నాగిరెడ్డి, కొల్లికొండ శరత్ బాబు, కె.సుధీర్ బాబు, అంజయ్య, సూర్యనారాయణ, ఆళ్ల రామారావు, నర్సయ్య కె.కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, రవికుమార్, -భాస్కరాచారి, శరత్బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమయ్యే కమ్యూనిస్టులను ఆదరించండి

- ఈనెల 18, 19 తేదీల్లో సీపీఐ(ఎం) జిల్లా మహాసభలు
- పార్టీ పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు

నవతెలంగాణ-సత్తుపల్లి



నిత్యం ప్రజలతో మమేకమై ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా పోరాడుతున్న కమ్యూనిస్టులను ఆదరించాలని సీపీఐ(ఎం) సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు కోరారు. కమ్యూనిజం కనుమరుగైతే బడుగు, బలహీన వర్గాలతో పాటు కార్మిక, కర్షకులు శ్రమదోపిడీకి గురయ్యే ప్రమాదం ఉందని సర్వేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రశ్నించే గొంతుక లేనప్పుడు పెత్తందారీ వ్యవస్థ బలోపేతమై రాజ్యమేలుతుందన్నారు. ఇప్పటికే దేశంలో మతోన్మాదం పెట్రేగి అన్య మతస్తులను అణగదొక్కే పనిలో ఉందన్నారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో జరిగే పరిస్థితి ఇదేనన్నారు. ఏ దేశంలోనైతే మతాధిక్యతను ప్రదర్శిస్తారో అక్కడ పర మతస్తుల జీవన స్థితిగతులు ప్రమాదంలో పడతాయని బంగ్లాదేశ్ పరిస్థితిని ఉదహరించారు. మనదేశం విషయానికొస్తే ప్రజావ్యతిరేక పాలన సాగుతోందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి పరిష్కరించకపోగా మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందాన భారాలు మోపుతూ, కార్పొరేట్ శక్తులను ప్రోత్సహించడానికి రాయితీలు ఇస్తూ ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని విమర్శించారు.

సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ఈనెల 18, 19 తేదీల్లో సత్తుపల్లిలో జరిగే సీపీఐ(ఎం) 22వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పట్టణ కార్యదర్శి సర్వేశ్వరరావు కోరారు. ఈ మహాసభల్లో రాష్ట్ర, జాతీయ నాయకులు పాల్గొంటారని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ రాజకీయ విశ్లేషణలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజల సమస్యలు తదితరాంశాలపై వక్తలు తమ ప్రసంగాల ద్వారా ప్రజలకు వివరిస్తారన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సుమారుగా 500మందికి పైగా పార్టీకి చెందిన డెలిగేట్స్ హాజరవుతున్నారన్నారు. మహాసభల విజయవంతానికి పార్టీ శ్రేణులు, సానుభూతి పరులు, మేథావులు, విద్యార్థులు, కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని సభలను విజయవంతం చేయాలని సర్వేశ్వరరావు కోరారు.

పెంట్యాల లక్ష్మీ నారాయణకు సీపీఐ(ఎం) నివాళి

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని గోవిందాపురం (ఎల్) గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పెంట్యాల లక్ష్మీనారాయణ చిత్రపటానికి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, బివికే చైర్మన్ ఎనిగండ్ల శ్రీనివాస రావు, మండల కమిటీ సభ్యులు కానంగులు చంద్రయ్య, జొన్నలగడ్డ సునీత, పసుపులేటి నరేష్, లక్ష్మీపురం సొసైటీ అధ్యక్షులు మాదినేని వీరభద్రరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. లక్ష్మీ నారాయణ దశదినకర్మ ఆదివారం గోవిందాపురం గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా పొన్నం వెంకటేశ్వర రావు మాట్లాడుతూ లక్ష్మీ నారాయణ గోవిందాపురం ఎల్ గ్రామంలో సీపీఐ(ఎం) అభివృద్ధికి ఎంతో కృషి చేశాడన్నారు. సీపీఐ(ఎం) నిర్వహించే ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొనేవాడు అన్నారు. ఈ కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ చిత్రపటానికి పార్టీ నాయకులు ఏడునూతల లక్ష్మీనారాయణ, ఉమ్మినేని రవి, నల్లమోతు వాణి, చేబ్రోలు రవి తదితరులు ఉన్నారు.



నవతెలంగాణ
6
ఖమ్మం
సోమవారం డిసెంబర్09, 2024 www.navatelangana.com

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



మండల పరిధిలోని తెల్దారుపల్లి గ్రామం వద్ద గల ఎన్నెస్పీ కాలువలో గుర్తు తెలియని మృతదేహం ఆదివారం లభ్యమైంది. సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి మృతదేహం ఎన్నెస్పీ కాలువలో కొట్టుకువచ్చి తెల్దారుపల్లి గ్రామం వద్ద గల కాల్వలో ఆగింది. దీన్ని గమనించిన స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ పోలీసులు అన్నం శ్రీనివాసరావు బృందం సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్‌పెక్టర్ రాజు తెలిపారు. మృతదేహం ఆచూకీ ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇన్స్‌పెక్టర్ కోరారు.

అన్నదానాన్ని ప్రారంభించిన ఎస్సై కొండలరావు

నవతెలంగాణ-తల్లాడ



ఇరుముడి కార్యక్రమాన్ని పురస్కరించుకొని మహా అన్నదాన కార్యక్రమం తల్లాడ ఫ్రూట్ ఛాంబర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ అన్నదార కార్యక్రమాన్ని ఎస్సై బి.కొండలరావు ప్రారంభించారు. కోలాటంతో మహిళా సోదరీమణులు శబరిమల వెళ్లే అయ్యప్ప స్వాములను ఘనంగా మేళతాళాలతో సాగనంపారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు ఎల్లప్రోలు లాలయ్య, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, ధూపాటి భద్రరాజు, మొక్క బసవయ్య,,పెరిక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'చేపలమడుగు అర్జున్‌కు సన్మానం'

నవతెలంగాణ-తల్లాడ



మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామా నికి చెందిన చేపలమడుగు అర్జున్ జైల్ వార్డెన్‌గా ఎంపికయ్యారు. ఆర్‌సి యం చర్చ్ సహాయ గురువు మనోజ్ ఆదివారం ఘనంగా అర్జున్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యంతో జైలు వార్డెన్ ఉద్యోగం సాధించిన అర్జున్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. చేపల మడుగు దేవదానం, తిరుపతమ్మ, కూలి పనులకు వెళ్తూ అర్జున్‌ను చదివించారని, తల్లిదండ్రుల నమ్మకాన్ని, శ్రమను దృష్టిలో ఉంచుకొని అర్జున్ ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర అప్ప, జోజి, రామారావు, నరసింహారావు, రఘు తదితరులు పాల్గొన్నారు.

తన్నీరు రామారావు నేత్ర దానం

నవతెలంగాణ-బోనకల్



మండల పరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన తన్నీరు రామారావు నేత్రాలను కుటుంబ సభ్యులు ఆదివారం ఖమ్మం నేత్రనిధికి దానం చేశారు. ఖమ్మం నేత్ర నిధి వైద్యులు రామారావు కళ్ళను చొప్పకటపాలెం వచ్చి తీసుకెళ్లారు. కళ్ళను దానం చేసిన రామారావు కుటుంబ సభ్యులకు ఖమ్మం నేత్రనిధి వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

- 10 వ తరగతి విద్యార్థులకు అల్పాహారం

నవతెలంగాణ-ఎర్రుపాలెం



1965-66 వ సంవత్సరంలో పదవ తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. మండల కేంద్రంలో గల ఎర్రు పాలెం జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పదవ తర గతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు కలుసుకొని క్షేమమాచారాలు తెలుసుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువులను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుత సంవత్సరం 10వ తరగతి చదువుతున్న పాఠశాల విద్యార్థులకు ప్రతి సంవత్సరం వలే ఈ సంవత్సరం కూడా అల్పాహారాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరెడ్డి, చలపతిరావు, కృష్ణారావు, వెంకటేశ్వరరావు, చంద్రశేఖరరావు, లక్ష్మీనారాయణ, నాగేశ్వరి, తారామోహన్, అన్నపూర్ణ, రామారావు, వీర రాఘవరెడ్డి, వెంకటరావు, పిచ్చియ్య చంద్రమౌలేశ్వరరా వు, మస్తాన్, నాగేశ్వరరావు, మాధవి, రికిత పాల్గొన్నారు.



వాకింగ్, యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

నవతెలంగాణ-కల్లూరు

ప్రతి మనిషి క్రమశిక్షణతో ఉదయాన్నే వాకింగ్ యోగా చేస్తే చిన్న చిన్న వ్యాధుల నుండి తప్పించుకోవటానికి ఆరోగ్యంగా జీవించటానికి ఎంతో దోహదపడుతుందని కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ సివిల్ ఇంజనీర్ కొడాలి రఘునాథ బాబు అన్నారు. ఆదివారం కల్లూరు వాకింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి రఘునాథ్ బాబు చేతుల మీదగా మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రఘునాథ్ బాబు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన టిప్స్ ప్రతి ఒక్కరూ ఏదో ఒక రూపంలో వాకింగ్ యోగా, సైక్లింగ్ రూపంలో సాధన చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. శరీరానికి సరిపోయే నీరు తీసుకుంటూ, మితాహారం తినకుండా, సూర్యోదయం సూర్యాస్తమయానికి మధ్యనే భోజనం చేయాలన్నారు. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన కమిటీ వారికి ఆరోగ్య ప్రదాతలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉదయం పూట పురుషులకి, మహిళలకి వాకింగ్ పోటీలు నిర్వహించి మూడు టీమ్‌ల విజేతలకి బహుమతి ప్రదానం చేశారు. మహిళా విజేతలుగా నిలిచిన వారిలో మొదటి బహుమతి ధనలక్ష్మి, రెండవ బహుమతి గంపల పద్మ, మూడో బహుమతి కొడిశాన శ్రీవాణి, 50 సంవత్సరాల లోపు పురుషుల వాకింగ్ పోటీలో విజేతలుగా నిలిచిన వారిలో మొదటి బహుమతి వరకా రామారావు, రెండో బహుమతి బానోతు శ్రీను, మూడో బహుమతి ఉబ్బన నాగేశ్వరరావు గెలుపొందారు. 50 సంవత్సరాలు పైబడిన వారిలో మొదటి బహుమతి కాటినేని శ్రీనివాస్, రెండో బహుమతి గంపల శ్రీను, మూడో బహుమతి ఇమ్మడి చిన్న వీరభద్రం, పప్పుల రత్నాకర్ సంయుక్తంగా గెలిచారు. వీటితోపాటు ఉదయం పూట రాగి జావా అమృతాహారంగా రుచిగా చేయించి అందించి, మధ్యాహ్నం విందు భోజనం అందించి, ఎక్కువమంది పాల్గొనేలా ప్రోత్సహించారు. తర్వాత వాకింగ్ గ్రౌండ్ డెవలప్మెంట్, మెయింటెనెన్స్ కోసం ప్రతి ఒక్కరూ నెలకి 100 రూపాయలు చొప్పున కమిటీలో ఉన్న సభ్యులందరూ చెల్లించే విధంగా తీర్మానించారు. వాకింగ్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

మానసిక వికలాంగుడు మృతి

- అనుమానంతో బావుసింగ్ కుటుంబంపై దాడి

నవతెలంగాణ-కారేపల్లి

మండలంలోని మాణిక్యారం రూప్లాతండాలో శనివారం మానసిక వికలాంగుడైన భూక్యా హరిదాస్(42) మృతి చెందాడు. హరిదాస్ మృతికి అదే గ్రామానికి చెందిన బావుసింగ్ కారణమంటూ అతనిపై మృతుని సోదరుడు సక్రు ఆదివారం దాడి చేశారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. భూక్యా హరిదాస్ మానసికంగా వికలాంగుడు కావటంతో గ్రామం చుట్టు పోలాలు, చేనుల వద్దకు తిరిగివస్తుంటాడు. ఇటీవల మృతుడు హరిదాస్‌ను తమ పత్తి చేనులో పత్తి తీశామని బావుసింగ్ బెదిరించాడు. ఈ క్రమంలో వికలాంగుడైన భూక్యా హరిదాస్ రూప్లాతండా చెరువు సమీపంలో మృతి చెందాడు. అవివాహితుడైన అతనిని కుటుంబికులు పూడ్చి పెట్టారు. హరిదాస్ మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్న క్రమంలో తమ సోదరుడిని బావుసింగ్ కొట్టి చంపాడని ఆరోపిస్తూ భూక్య సక్రు ఆదివారం అనుమానితుడైన బావుసింగ్ ఇంటిపై దాడి చేశారు. భూక్యా హరిదాస్ మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ సోదరుడు సక్రు కారేపల్లి పోలీసులకు పిర్యాదు చేశాడు. దీనిపై కారేపల్లి ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడాదిలో రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి పనులు

- ప్రజల అండదండలే మాకు శ్రీరామ రక్ష
- నవతెలంగాణతో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ముఖాముఖి

నవతెలంగాణ-వైరా



కాంగ్రెస్ సంవత్సర పాలనలో రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అన్నారు. ప్రజలు తెలంగాణ రాష్ట్రంలో మరలా ఇందిరమ్మ రాజ్యం కావాలని కోరుకుని మాకు అఖండ విజయం చేకూర్చారని వారికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరం పూర్తి చేసుకుని ప్రజా పాలన విజయోత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా నవతెలంగాణ దినపత్రికతో రాందాస్ నాయక్ ముఖాముఖి.

వైరా ఒక గిరిజన నియోజక వర్గం. పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నదని, అందుకు సాగునీరు ప్రధానం అయినందున రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి వల్ల సుమారు 125 కోట్ల వ్యయంతో సీతారామ ప్రాజెక్టు కాలువ నీటిని తొలిసారి వైరా నియోజక వర్గానికే తీసుకు వచ్చినట్లు తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను వైరా నియోజక వర్గానికి సాధించినట్లు తెలిపారు. వైరా ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ఆధునీకీకరణకు నిధులు మంజూరు కాగా పనులు చేయించుటకు టెండర్లు పూర్తి అయినట్లు తెలిపారు. నియోజక వర్గ కేంద్రం వైరాలో 100 పడకల ఆసుపత్రి మంజూరు, అందుకు సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించటం పూర్తి అయ్యింది అన్నారు. నియోజక వర్గంలో కారేపల్లి, జూలూరుపాడు, ఏన్కూర్ మండలాల పూర్తిగా గిరిజన మండలాలని గతంలో పోడు భూముల రైతుల పై కేసులు, జైళ్ళు ఉండేవని, మా పాలనలో గిరిజన పోడు రైతులకు సుమారు 5 వందల మోటార్లు అందజేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. నియోజక వర్గ గ్రామాలలో అంతర్గత రోడ్లకు సిసి రోడ్లు మంజూరు చేసి శంకుస్థాపనలు చేస్తున్నామని తెలిపారు. మా ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత ప్రయాణం, గృహజ్యోతి పథకంలో ఉచిత కరెంటు, సబ్సిడీ గ్యాస్ ఇస్తున్నామని అన్నారు. అలాగే గత పదేళ్లుగా ఎదురు చూస్తున్న రుణమాఫీని ప్రతిష్ఠాత్మకంగా వేల కోట్ల రూపాయలను మాఫీ చేశామన్నారు. నియోజక వర్గ రైతులకు కూడా వందల కోట్ల రూపాయల ప్రయోజనం చేకూరిందన్నారు. గత పదేళ్లలో ఎన్నడూ లేనంత వరి పంట పండి దేశంలో తెలంగాణ ముం దున్నట్లుగానే మన నియోజక వర్గంలో కూడా వరి పంట విస్తారంగా పండిందన్నారు. ప్రభుత్వం ముందుగా ప్రకటించినట్లు సాన్నరకం ధాన్యం క్వింటాలుకు 500 బోనస్ ధాన్యం కాటా వేసిన మూడవ రోజు ధాన్యం రేటుతో పాటు ఇస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం ధర తక్కువ, తేమ, తారం పేరుతో క్వింటాల్‌కు 5 నుండి 10 కేజీల ధాన్యం కాజేసారని ఇప్పుడు రైతులకు తరుగు, తారం బాధలు లేవని, ఇవన్నీ లెక్కగడితే సుమారు వెయ్యి రూపాయలు అదనం ఇస్తున్నామన్నారు. దేశంలో తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే రైతులకు ఇంతటి ప్రయోజనం కలిగిస్తోందన్నారు. జనవరి నుండి రేషన్ కార్డులు, పింఛన్లు ఇస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తమ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నట్లు వివరించారు. నియోజక వర్గానికి మొదటి దశలో 3500 ఇళ్లు మంజూరు వస్తాయని, రాష్ట్ర ప్రభుత్వ మార్గ నిర్దేశం ప్రకారం ముందుగా అత్యంత నిరుపేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేస్తారని తెలిపారు. అధికార యంత్రాంగం ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా అన్ని విషయాలను క్రోడీకరించి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేస్తారని, మాకు ఇంకా నాలుగేళ్ల పాలనా సమయం ఉందని పేదలందరికీ న్యాయం చేస్తామన్నారు. రుణ మాఫీ చేసి, ధాన్యానికి బోనస్ ఇస్తున్నందున రైతులెవరూ ఇప్పుడు రైతు బంధు, రైతు భరోసా గురించి పట్టించుకోవటం లేదని చలోక్తిగా చెప్పారు. త్వరలో ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా కూడా ఇస్తుందని వివరించారు. మండలంలో లావు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా పెంచినట్లు తెలిపారు. గొల్లపూడిలో లావు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. తమ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చుటకు కృషి చేస్తుందని అన్నారు. ప్రభుత్వాన్ని పని గట్టుకుని విమర్శించే పార్టీల నోరు మూయించే విధంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, మంత్రులు కృషి చేస్తున్నారని, ఎమ్మెల్యేగా తాను అన్ని పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

విద్యారంగ బలోపేతానికి సహకారం అందించాలి

- యూటీఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి బండి నరసింహారావు

నవతెలంగాణ-వేంసూరు



విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు నూతనంగా విధులకు వచ్చిన ఉపాధ్యాయులు తమ వంతు సహకారం అందించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బండి నరసింహారావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంఘం 11వ మండల మహాసభలో ఆయన మాట్లాడుతూ నూతనంగా నియమించబడిన ఉపాధ్యాయులకు సలహాలు సూచనలు అందజేస్తూ సర్వీసులు కష్టపడి పని చేయాలని, అప్పుడే గుర్తింపు లభిస్తుందని అన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంలో ఉపాధ్యాయుల నియమకాలు వేగవంతంగా జరగటం మంచి పరిణామాలు.. అదేవిధంగా దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు కృషి చేస్తామని, నిత్యం ఉపాధ్యాయ సమస్యలపై పోరాడే అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి అవకాశం ఇచ్చి చట్టసభలకు పంపించాలని కోరారు. డిసెంబర్ 14, 15 తేదీలలో సత్తుపల్లిలో నిర్వహిస్తున్న జిల్లా మహాసభలతో పాటు 28 నుండి 30 వరకు నల్గొండలో నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మండల శాఖ అధ్యక్షుడు జి.చంద్రశేఖర్ అధ్యక్షులు నిర్వహించిన మండల మహాసభలో సీనియర్ నాయకులు జెండాను ఆవిష్కరించారు. ఈ మహాసభలకు సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఆరవపల్లి జగన్మోహన్‌రావు, గోపాలరావు, జిల్లా కార్యదర్శులు జీఎస్ఆర్ రమేష్, నిర్మల కుమారి, ఎస్కే.నాగూర్ వల్లి, సిహెచ్.సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.ఈశ్వరచారితో పాటు సత్తుపల్లి పెనుబల్లి మండల బాధ్యులు కే.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, సీపీఐ(ఎం) నాయకులు మోరంపూడి వెంకటేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, భాస్కరరావు, రామశేష రాధాకృష్ణ, ప్రసన్నకుమార్, నరేష్, కిషోర్, సలీం, సత్యవాణి, కవిత, హైమావతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అవసరాల మేరకే సంక్షేమం, అభివృద్ధి పథకాలు

- సంక్రాంతి తర్వాత రైతు భరోసా
- రూ.2.50 కోట్లతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- ఎమ్మెల్యే మట్టా రాగమయ దయానంద్

నవతెలంగాణ-కల్లూరు



ప్రజలకు ఏది ముఖ్య అవసరం అవి గుర్తించి సంక్షేమ, అభివృద్ధి, కార్యక్రమాలు చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వంగా రూపొందించుకుందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజా విజయోత్సవలో భాగంగా ఆదివారం రూ.2.50 కోట్లతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కొర్లగూడెం గ్రామంలో కమ్యూనిటీ హాలు ప్రారంభించి, సిసి రోడ్లకు శంకుస్థాపన, పేరువంచ గ్రామంలో కమ్యూనిటీ హాల్ ప్రారంభించి, సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కల్లూరులో నిర్మించిన పల్లె దవాఖానాలు ఏ బీలను ప్రారంభించారు. పలు సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయ దయానంద్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటి కూడా విస్మరించదని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేక ఇచ్చిన హామీలను ఒకటి రెండు ఎనక ముందు అయినా మొత్తం ప్రభుత్వం అమలు చేస్తుందని, ఎలాంటి నిస్సందేశం లేదని అన్నారు. రైతులకు రైతు భరోసా ఎలా అమలు చేయాలనేదే ఇంకా ఒక కొలిక్కి రాకపోవడం ఆలస్యమైందన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో విధి విధానాలను నిర్ణయించి సంక్రాంతి తర్వాత రైతు భరోసా రైతు ఖాతాలో జమవుతుందని దీంట్లో ఎలాంటి సందేహం వల్లదని స్పష్టం చేశారు. మీరు గత పార్లమెంటు అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన సహకారంతోనే జిల్లాలోని ముగ్గురు మంత్రులు సహాయ సహకారాలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మెన్ భాగం నీరజా ప్రభాకర్, కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ సిడిసి చైర్మెన్ కస్తాల నరేంద్ర, ఎఎంసి వైస్ చైర్మెన్ కోటేశ్వరరావు, పంచాయతీరాజ్ డిఇ కడారి వెంకటేశ్వరరావు, ఏఈ రాజా, ఎండిఓ డి.చంద్రశేఖర్, సీనియర్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, అంకిరెడ్డి సత్య నారాయణరెడ్డి, భాగం ప్రభాకర్ చౌదరి, లక్కినేని కృష్ణ, కేసర మోహన్‌రెడ్డి, బత్తుల రాము, ఏనుగు సత్యంబాబు, ఆలకుంట నరసింహారావు, మట్టా రామకృష్ణ, తక్కెళ్ళపాటి దుర్గాప్రసాద్, మచ్చ వెంకటేశ్వరరావు, పరిమి భరత్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

నెల నెలా వైద్య శిబిరం విజయవంతం

- 200 మంది రోగులకు వైద్య సేవలు

నవతెలంగాణ-నేలకొండపల్లి



సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధర్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయంలో జరిగిన 24 వ నెల నెలా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరంలో 200 మంది రోగులకు డాక్టర్లు వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరంలో షుగర్, బీపీ, ఇతర సాధారణ జబ్బులకు డాక్టర్లు పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. నెలకు సరిపడా మందులను కేవలం 100 రూపాయలకే అందించారు. ఈ వైద్య శిబిరం డాక్టర్ కొల్లి అనుదీప్ ఎంబిబిఎస్, ఎండి (జనరల్ మెడిసిన్) 95 మంది రోగులకు బిపి, షుగర్ తో పాటు ఇతర సాధారణ జబ్బులకు వైద్య సేవలు అందించారు. మరో 105 మందికి ఖమ్మం శరత్ మాక్స్ విజన్ వారిచే కంటి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావు మాట్లాడుతూ వైద్య శిబిరానికి ప్రతి నెల ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందన్నారు. సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై పోరాటాలకే పరిమితం కాకుండా సేవా కార్యక్రమాలను కూడా మరింత విస్తృతంగా చేపట్టాలనే లక్ష్యంతో ప్రతి నెల వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో వీటికి అనుబంధంగా మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. వైద్య సేవలు అందించిన డాక్టర్ కొల్లి అనుదీప్ కు, దాతలు, సిబ్బంది, వాలంటీర్లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రతి నెల రెండవ ఆదివారం షుగర్ బిపి జనరల్ వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ప్రజలకు బీపీ చెకప్, మాత్రలు వేసుకునే విధానంలో సేవలందించిన గ్రామీణ వైద్యులు బండారుపల్లి నాగేశ్వరరావు, బండి పుష్పలత, ఎస్‌కే. తానీషా, ప్రభుత్వాసుపత్రి ల్యాబ్ టెక్నీషియన్ ఈగ అనిల్ కుమార్ వసుంధర ఒకేషనల్ విద్యార్థులకు, ఎన్టీఆర్ ఫౌండేషన్ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ఫౌండేషన్ కార్యదర్శి కెవి. రామిరెడ్డి, సభ్యులు గుడవర్తి నాగేశ్వరరావు, కట్టెకోల వెంకటేశ్వర్లు, పగిడికత్తుల నాగేశ్వరరావు, దండా సూర్యనారాయణ, చెరువు నరసింహారావు, కొంగర నారాయణరావు, పాలడుగు పూర్ణచంద్ర ప్రసాద్, వల్లంచెట్ల భాస్కరరావు, ఏలూరి కోదండ రామారావు, ఎస్‌కె.జమాల్ పాషా, షేక్ అబ్దుల్ రహీం, మంకెనపల్లి నరసింహారావు, ఎస్కే.అబ్దుల్, డి.నాగేశ్వరరావు, ఎస్.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) మధిర డివిజన్ నూతన కమిటీలోకి ముదిగొండ నుండి ఐదుగురు

నవతెలంగాణ-ముదిగొండ







సిపిఐ(ఎం) మధిర డివిజన్ నూతన కమిటీలోకి ముదిగొండ మండలం నుండి అయిదుగురు పార్టీ సభ్యులు ఎన్నికయ్యారు. సిపిఐ(ఎం) మధిర డివిజన్ 19వ మహాసభ మధిర మండలం మల్లారంలో అట్టహాసంగా శనివారం జరిగిన విషయము విధితమే. ఈ మహాసభలో పార్టీ మధిర డివిజన్ కమిటీ కార్యదర్శిగా చింతకాని మండల తిమ్మినేనిపాలెంకు చెందిన మడుపల్లి గోపాలరావును నూతన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. డివిజన్ కమిటీ సభ్యులుగా సిపిఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తంతోపాటు, కోలేటి ఉపేందర్ (చిరుమర్రి), టీఎస్ కళ్యాణ్ (పమ్మి), వేల్పుల భద్రయ్య (సువర్ణాపురం), పయ్యావుల ప్రభావతి(గోకినేపల్లి)లు ఎన్నికయ్యారు. పార్టీ మధిర డివిజన్ కమిటీలోకి నూతనంగా ఎన్నికైన ఐదుగురు సభ్యులను మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



గరికపాటి సోదరులకు పలువురి పరామర్శ

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

ప్రముఖ వ్యాపారవేత్తలు గరికపాటి వెంకట్రావు, ఆంజనేయ ప్రసాద్‌ల తండ్రి రాఘవయ్య నవంబర్ 28వ తేదీన మృతి చెందారు. రాఘవయ్య దశదినకర్మ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గరికపాటి సోదరులను సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పరామర్శించారు. ఈ సందర్భంగా రాఘవయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా నాయకులు బండి రమేష్, పొన్నం వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి ఉరడీ సుదర్శన్‌రెడ్డి, తోట పెద్ద వెంకటరెడ్డి, జక్కంపూడి కృష్ణ, మంత్రి తుమ్మల సతీమణి భ్రమరాంబ, కుమారుడు యుగంధర్, మాజీ డీసీసీబీ చైర్మెన్ కూరాకుల నాగభూషణం, టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్‌బాబు, బాలసాని లక్ష్మీనారాయణ, మేయర్ పూనకొల్లు నీరజ, కార్పొరేటర్లు చావా నారాయణరావు, రాపర్తి శరత్‌కుమార్, బాలగంగాధర్ తిలక్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, వర్తక సంఘం అధ్యక్షుడు రామారావు తదితరులు నివాళులర్పించారు.

'అభివృద్ధి పథంలో నడిపింది ఎవరో ప్రజలకు తెలుసు'

- కాంగ్రెస్‌కు బీఆర్ఎస్‌ను విమర్శించే అర్హత లేదు

నవతెలంగాణ-పెనుబల్లి



మూడు పర్యాయాలుగా సత్తుపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత సండ్ర వెంకట వీరయ్య దేనని బీఆర్ఎస్ మండల నాయకులు పేర్కొన్నారు. ఆదివారం బీఆర్ఎస్ మండల నాయకులు వంగా గిరిజాపతి గృహంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ..నూతనంగా వచ్చిన శాసనసభ్యులు మాత్రమే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అభివృద్ధి చేయలేదంటూ కాంగ్రెస్ నాయకుల విమర్శలు అర్థరహితమని అన్నారు. పెనుబల్లి మండలంలోని అన్ని పల్లెలకు సీసీ దారులతోపాటు పెనుబల్లి 100 పడకల హాస్పిటల్ నిర్మించడంలోనూ, నూతన గ్రామపంచాయతీ బిల్డింగ్ నిర్మాణాలు, రైతు వేదికలు సంపూర్ణంగా అభివృద్ధి చేసిన ఘనత సండ్ర వెంకట వీరయ్యకి దక్కుతుందన్నారు. సండ్రా చేసిన అభివృద్ధి పనులపై తాము బహిరంగ చర్చలకు సిద్ధమని కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు కనగాల వెంకట్రావు, కొప్పుల గోవిందరావు, మందడపు అశోక్, భూక్య తావు నాయక్, మల్లెల శీను, బెల్లంకొండ చలపతి, చెక్కిలాల లక్ష్మణరావు, తోట వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.



మారెమ్మతల్లి మూడో వార్షికోత్సవ బ్రోచర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కల్లూరు

పట్టణ పరిధిలోని ఎన్నెస్పీ క్రాస్ రోడ్ వద్ద శ్రీ మారెమ్మ దేవాలయం నిర్మించి మూడు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఈనెల 20వ తేదీ నుండి 23 వరకు వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ చేతుల మీదుగా బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఎమ్మెల్యేలను కోరారు. మూడు రోజులు పాటు జరిగే ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు నాగమల్లేశ్వరరావు, ఎక్సైజ్ సీఐ రాధమ్మ కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కోలాట కళాకారులకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-పెనుబల్లి

మండలంలోని రామచంద్రరావు బంజర్ కోలాట కళాకారులకి ప్రోత్సాహకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రూ.50వేలు ఆర్థిక సాయం ఆదివారం అందచేశారు. కాంగ్రెస్ మండల నాయకులు అలుగోజు చిన్న నరసింహస్వామి, సోమరాజు సీతారామరాజు, స్థానిక బీరప్ప ఆధ్వర్యంలో రామచంద్రరావు బంజర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన కోలాట బృందంకు అయ్యే ఖర్చుల నిమిత్తం ఇచ్చినట్లు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | డిసెంబర్ 09, 2024 | www.navatelangana.com



ఘనంగా మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

నవతెలంగాణ-దమ్మపేట



దమ్మపేట మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హాజరైన ఈ కార్యక్రమంలో చైర్మెన్‌గా వాసం రాణి, వైస్ చైర్మెన్‌గా కణితి సత్యనారాయణతో పాటు నూతనంగా నియమితులైన డైరెక్టర్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముందుగా నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా నూతనంగా ఎన్నికైనవారు వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అందరినీ సమిష్టిగా కలుపుకుపోతూ రైతులకు అసౌకర్యం లేకుండా సదుపాయాలు కల్పించి వారి మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెట్ కమిటీ అధికారి నరేందర్, దమ్మపేట మార్కెట్ కమిటీ కార్యదర్శి రాములు నాయక్, మార్కెట్ కమిటీ సిబ్బంది, ఐదు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా రథోత్సవం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాయి మాలదారులచే రథోత్సవం శ్రీ సాయిబాబా మందిరంలో ఆదివారం కన్నుల పండగల వైభవంగా సాయినామస్మరణంతో సాగింది. బాబా ఆలయం నుండి ఊరేగింపుగా బాణసంచాతో గోదావరికి బాబా వారి ఉత్సవమూర్తిని తీసుకువెళ్లి గోదావరిలో చక్రస్నానం, అభిషేకం చేయించి మరల ఆలయానికి తీసుకువచ్చారు. బాబా మాల ధరించిన భక్తులు భక్తిశ్రద్ధలతో సాయి నామ జపం చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం కార్తీకమాసం అనంతరం సాయిబాబా మాల వేసుకునే భక్తుల ప్రత్యేక ఊరేగింపు వంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం అన్నదానంతో పాటు మాల ధరించిన బాబా భక్తులకు నిత్య అన్నదాన అవకాశాన్ని కూడా కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు తుమ్మలపల్లి సత్యనారాయణ మూర్తి, ఉపాధ్యక్షులు మాగంటి శ్రీనివాస వరప్రసాద్, కోశాధికారి కుంచాల రమేష్ సభ్యులు అబ్బినేని శ్రీనివాసరావు, గొర్ల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

- పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- చిన్నపిల్లల వైద్య నిపుణులు ఎస్ఎన్ రాజు, పి.రాజశేఖర్

నవతెలంగాణ-దుమ్ముగూడెం



పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చిన్నపిల్లల వైద్య నిపుణులు ఎస్‌న్‌రాజు, పి.రాజ శేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని శ్రీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన చిన్నపిల్లల ఉచిత మెగా వైద్య విజయ వంతం అయింది. భద్రాచలం పట్టణానికి చెందిన స్వాతి పిల్లల హాస్పిటల్ వారి సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఈ శిబిరాన్ని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ చైతన్య డాక్టర్ ఎస్ఎన్ రాజు, డాక్టర్ పి.రాజశేఖర్‌లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ మారుమూల గ్రామంలో చిన్నపిల్లల కోసం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో భద్రాచల పట్టణానికి చెందిన స్వాతి పిల్లల హాస్పిటల్ ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పి.రాజశేఖర్, యూఎస్ఏకు చెందిన నియోనోటాలజిస్ట్ డాక్టర్ ఎస్ ఎన్ రాజులు నవజాత శిశువుల నుండి 14 సంవత్సరాల వయసులోపు ఉన్న 150 మంది పిల్లలను పరీక్షించి రూ.80 వేల విలువగల మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ తల సేమియా, సికిల్ సెల్ అనీమియా వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్య శిబిరాన్ని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం గ్రామస్తులు డాక్టర్ పి.రాజశేఖర్, డాక్టర్ ఎస్ ఎన్ రాజును శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిలకర నాగరాజు, కొప్పుల మురళి, జిలకర చంటి, కంచర్ల నాగరాజు, జుజ్జూరి జయసింహ, కమల రాజశేఖర్, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.



కొండయ్యకు ఘన సత్కారం

నవతెలంగాణ-ములకలపల్లి

ఏపీజీవీబీలో గత 20 ఏళ్లుగా దినసరి వేతనంపై పనిచేసిన అలుగుల కొండయ్య బ్యాంకు యాజమాన్యం రెగ్యులర్ చేస్తూ జగన్నాథపురం ఏపీజీవీబీకి బదిలీ చేశారు. కొండయ్యను బ్యాంకు అధికారులు రెగ్యులర్ చేయడం పట్ల మున్నూరు కాపుసంఘం మండల గౌరవ అధ్యక్షుడు పువ్వాల మంగపతి, మండల అధ్యక్షుడు మేకల వెంకటేశ్వర్లు, మండల కోశాధికారి అయితా శేషగిరిరావు, గ్రామకమిటీ అధ్యక్షులు బగ్గారపు సత్యనారాయణ, గ్రామకమిటీ ప్రధాన కార్యదర్శి మిరియాల అవినాష్, మాజీ ఉపసర్పంచ్ శెనగపాటి అంజి, పువ్వాళ్ల కొండలరావు, శెనగపాటి రవి, పుష్పాల హనుమంతరావు, ముదిగొండ శ్రీనివాసరావు, మిరియాల వెంకన్న, మేడిశెట్టి సూరయ్య, శెనగపాటి సీతారాములు, శెనగపాటి సుదర్శన్, పసుపులేటి శ్రీనివాసరావులు శాలువాతో కొండయ్య దంపతులను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్నూరుకాపు సంఘం బాధ్యులు పాల్గొన్నారు.



వైభవంగా కోదండరామాలయ భూమిపూజ

నవతెలంగాణ-దమ్మపేట

మండల పరిధిలోని గండుగులపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ కోదండ రామాలయ భూమిపూజ మహెూత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కాగా ఈ భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొని పూజలు చేశారు. కాగా ఎమ్మెల్యే జారెను శాలువాలతో ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్, ఎర్రా వసంతరావు, కోటగిరి బుజ్జిబాబు, తుమ్మల శేషుబాబు, మడకం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల పిరికిపంద చర్య

- అమాయక ఆదివాసీ మహిళ గొంతుకోసి హత్య



నవతెలంగాణ-చర్ల

బీజాపూర్ జిల్లా లోడెడ్ గ్రామ పటేల్‌పర నివాసీ యలం సుక్ర (40), భర్త యాలం రామయ్య ఈ మెను శనివారం మావోయిస్టులు కిడ్నాప్ చేసి, లోడేడ్ నుండి 03 కి.మీ దూరంలో ఉన్న బడే పహాడ్ అడవుల్లోకి తీసుకెళ్లి, గొంతుకోసి హత్య చేశారు. ఈ సంఘటన ఉదయం 9.30 గంటలకు జరిగింది. నిషేధిత సీపీఐ మావోయిస్టు సంస్థ మద్దెడు ఏరియా కమిటీ జారీ చేసిన కరపత్రాన్ని అక్కడికక్కడే స్వాధీనం చేసుకున్నారు. 18/11/2024న గ్రేహౌండ్‌తో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులు తమ కదలికల గురించి పోలీసులకు నిరంతరం సమాచారం ఇవ్వడం వల్ల ఏడుగురు మావోయిస్టులు మరణించారని అందులో పేర్కొన్నారు. మృతుడిని పోలీస్ ఇన్‌ఫార్మర్ అని ఆరోపించి హత్య చేసామని మావోయిస్టులు కరపత్రంలో వెల్లడించారు. సమాచారం మేరకు పోలీస్ స్టేషన్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఇతర చట్టపరమైన చర్యలు చేపడుతున్నామని మావోయిస్టులు ఆ లేకలో పేర్కొన్నారు.

నూతన విద్యా విధానం రద్దు చేయాలి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి
- పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలి
- యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి
- కొత్తగూడెంలో ఘనంగా యూటీఎఫ్ జిల్లా మహాసభ
- పట్టణంలో భారీ దర్శన, బైక్ ర్యాలీ



మాట్లాడుతున్న నర్సిరెడ్డి



నవతెలంగాణ-కొత్తగూడెం

నూతన విద్యా విధానం రద్దు చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐదవ మహాసభలు స్థానిక కొత్తగూడెం క్లబ్ నందు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలలో జిల్లా నలుమూలల నుండి పెద్దఎత్తున ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు హాజరయ్యారు. సభలకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగువెల్లి నర్సిరెడ్డి హాజరయ్యారు. పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీ కొత్తగూడెం క్లబ్ నుండి మొదలయింది. పోస్ట్ ఆఫీస్ సెంటర్ సర్కిల్ మీదుగా, బస్టాండ్, రైల్వే స్టేషన్, పాత డిపో నుండి తిరిగి కొత్తగూడెం క్లబ్‌కు చేరుకుంది. ర్యాలీకి ముందు వరుసలో జిల్లా ప్రధాన, అధ్యక్ష కార్యదర్శులు బి.కిషోర్ సింగ్, ఎన్.కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి రాజు, జిల్లా కార్యదర్శులు, మహిళా నాయకులు ఉన్నారు.

పతాక ఆవిష్కరణలు

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ఐదవ మహాసభల సందర్భంగా కొత్తగూడెం క్లబ్‌లో తొలుతా పతాకావిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా కార్యదర్శులు వివిధ మండలాల నుంచి వచ్చిన టీఎస్ యూటీఎఫ్ నాయకులు మహిళా కార్యకర్తలు ఉన్నారు. పతాకావిష్కరణలో ఎస్‌టీఎఫ్ఐ పతాకాన్ని జి.వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. జాతీయ పతాకాన్ని టీఎస్ యూటీఎఫ్ సీనియర్ నాయకులు బి.జానకిరాములు ఆవిష్కరించారు. యూటీఎఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు కె.రాంబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నినాదాలతో ఉద్యమ గీతాలతో ప్రాంగణం కళకళలాడింది. అనంతరం జరిగిన ప్రారంభ సభ జరిగింది.

ప్రారంభ సభ జిల్లా అధ్యక్షులు బి.కిషోర్ సింగ్ అధ్యక్షతన జరిగింది. ఈ ప్రారంభ సభలో పాల్గొన్న అలుగువెల్లి నర్సిరెడ్డి, డీసీఎంఎస్ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ నూతన విద్య విధానం ఎన్ఈపీ-2020ని రద్దు చేయాలని కోరారు. నూతన విద్యా విధానం వలన కనీస సౌకర్యాలు లేనీ అంగన్వాడీ కేంద్రాలలో నర్సరీ, రెండు తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి వచ్చిందని, దీని వలన ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే పరిస్థితి వస్తుందని హెచరించారు. నష్టదాయకమైన ఎన్ఈపీ 2020లో మార్పులైనా చేయాలి, లేదా రద్దయిన చేయాలని డిమాండ్ చేశారు.

అనంతరం యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్నటు వంటి డీఏలను చెల్లించాలని, ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం బేసిక్ పే ఇవ్వాలని, 317 జీవో వలన స్థానికత కోల్పోయిన ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తరువాత డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాల శ్రీనివాసరావు రావు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లిక్కి బాలరాజులు సంఘీభావ సందేశాలు అందించారు. ఈ మహాసభలో రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు బి.మురళీ మోహన్, వి.వరలక్ష్మి, జిల్లా కోశాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, (ఎస్.వి) జిల్లా కార్యదర్శిలు ఎం.వెంకటేశ్వర్లు, ఎం.పద్మారాణి, డి.తావూరియా, డి.శ్రీనివాస్, పి.జయ రాజు, రమేష్, గంగాధర్, రాము, హతిరం, కృష్ణారావు, జిల్లాలోని అన్ని మండలాల ప్రధాన బాధ్యులు, యూటీఎఫ్ సీనియర్ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చావా రవి

వనజీవి జాకారం పాఠశాలకు రావాలి

- షేక్ మహమూద్ పాషా

నవతెలంగాణ-ఆళ్ళపల్లి





వనజీవి రామయ్య జాకారం పాఠశాలకు రావాలని ఆహ్వానించినట్లు ఆ పాఠశాల హెచ్ఎం షేక్ మహమూద్ పాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కై డబ్ల్యూఈఓ తెలంగాణ స్టేట్ గ్రీన్ రేంజర్ కో ఆర్డినేటర్ ఎస్ఎం పాషా ఏక భుక్త(ఒంటి పూట) మండల దీక్ష ఆదివారం నుండి ప్రారంభమైన సందర్భంగా పద్మశ్రీ వనజీవి రామయ్యను ఖమ్మంలో వారి నివాసంలో కలిసినట్లు తెలిపారు. ముందుగా రామయ్యను మర్యాదపూర్వకంగా సన్మానించి, వారిని కుశల ప్రశ్నలు అడిగి తెలుసుకున్నానని చెప్పారు. రామయ్యను పాఠశాలకు రావాలని కోరానని, దానికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. తాను చేస్తున్న దీక్ష గురించి వనజీవి రామయ్యకు చెప్పి, వారి ఆశీస్సులు తీసుకున్నట్లు పేర్కొన్నారు. గడిచిన రెండు సంవత్సరాలుగా తాను చేసిన దీక్షలు, మొక్కలు నాటడం, భద్రాచలం అడవుల్లో విత్తనాలు చల్లడం, తదితర కార్యక్రమాలను వనజీవికి వివరించానన్నారు. అనంతరం మిర్యాలగూడ, వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన ప్రకృతి ప్రేమికులు ప్రకాష్ (వరంగల్), సంపత్ (ఖమ్మం), సందీప్, శ్రీనివాస్, కిరణ్, షేక్ రూహిధ్, సాయినాథ్ , సైదులు, పవన్, విష్ణు, రాజ, మనీ, వి.పవన్, తదితరులను కలిసి, వారిని సన్మానించడం జరిగిందని పాషా పేర్కొన్నారు.

ప్రసాదం తయారీ నాణ్యతలో రాజీ పడొద్దు

- రామయ్యను దర్శించుకున్న ఎండోమెంట్ కమిషనర్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్





దక్షిణ అయోధ్యగా విరుజల్లుతున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో భక్తులకు యాత్రికులకు అందించే లడ్డు పులిహార తయారీలో కచ్చితంగా నాణ్యతలు పాటించాలని ప్రసాదాలు తయారీలో ఎటువంటి నిర్లక్ష్యం వహించిన సహించేది లేదని తెలంగాణ రాష్ట్ర ఎండోమెంట్ కమిషనర్ శ్రీధర్ స్పష్టం చేశారు. ఆదివారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయమే రామయ్య దర్శనార్థం ఆలయానికి వచ్చిన శ్రీధర్‌కి అధికారులు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా ఎండోమెంట్ కమిషనర్ మూల మూర్తుల ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీ తయారమ్మ సన్నిధిలో ఎండోమెంట్ కమిషనర్‌కి అర్చక స్వాములు శాస్త్రనామ గోత్రనామ పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను ఆలయ అర్చకులు అందించారు. అనంతరం ఈవో రమాదేవి, రవీంద్రనాథ్‌తో కలిసి లడ్డు పులిహార ప్రసాదం తయారీ కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రసాదం నిధులతో నిర్మిస్తున్న కాటేజీలను సందర్శించి కాటేజ్ నిర్మాణంలో నాణ్యతకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించే మిధున స్టేడియాని పరిశీలించిన ఎండోమెంట్ కమిషనర్ రానున్న ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలపై అధికారులను ఆరా తీశారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుండి వచ్చే భక్తులకు వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహించద్దని సూచించారు. దేవస్థానానికి అత్యంత ప్రాధాన్యత గల లడ్డు పులిహార తయారులో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు.

రామయ్య దర్శనానికి పోటెత్తిన భక్తజనం

ఆదివారం సెలవు దినం కావడంతో రాష్ట్ర నలుమూల నుండి భద్రాద్రి రామయ్య దర్శనానికి భక్తులు పోటెత్తారు. స్వామివారి నిత్యా కళ్యాణ మహెూత్సవంలో సైతం దంపతులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా రామయ్య దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. రామయ్య దర్శనానికి వచ్చిన భక్తులందరికీ స్వామివారి తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాద అవకాశాన్ని కూడా ఆలయ అధికారులు కల్పించగా ఫోరంకి వాస్తవ్యులు శ్రీహరి వంశీ స్వామి వారి అన్నదానానికి రెండు లక్షల రూపాయలను విరాళంగా చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రవణ్ కుమార్, భవాని, రామకృష్ణతో పాటు ఆలయ సిబ్బంది వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు ఏమీ ఇవ్వలేదు...

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలతోనే గెలిచా

- పథకాలు అమలు చేశాం
- ఏడాదిలో రూ.185 కోట్ల అభివృద్ధి పనులు
- మౌలిక వసతుల కల్పనకు మరింత కృషి
- సమస్యలు అసెంబ్లీ దృష్టికి తీసుకు వస్తా

నవతెలంగాణతో ఎమ్మెల్యే కోరం కనకయ్య



నవతెలంగాణ-ఇల్లందు

గత ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలకు హామీలు ఏమీ ఇవ్వలేదని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలతోనే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచానని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బొగ్గుట్ట ప్యాసింజర్ రైలు పునరుద్ధరణ హామీ ఇవ్వలేదని అది తన పరిధిలో లేదన్నారు. జిల్లాకు చెందిన రాజ్యసభ, లోక్ సభ సభ్యులకు సమస్య వివరించి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటానన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో నియోజవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలు, ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి పై నవతెలంగాణ ఫోన్‌లో ఎమ్మెల్యేని సంప్రదించగా స్పందించారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అమలు చేశామని, ఎంతోమంది పేదలు, నిరుపేదలు, సామాన్య కుటుంబాల వారు లబ్ధి పొందారని అన్నారు. ముఖ్యంగా మహిళలందరికీ రాష్ట్రమంతటా ఎక్కడికి ప్రయాణించాలన్న ఉచిత బస్సు పథకం ఏడాదిగా విజయవంతంగా కొనసాగుతోందన్నారు. అల్పాదాయ కుటుంబాలకు గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల లోపు విద్యుత్ ఉచితంగా ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500కే వంటగ్యాస్ అందిస్తున్నామన్నారు. రూ.రెండు లక్షల లోపు రైతులకు పంట రుణమాఫీ చేశామని సాంకేతిక కారణాలతో కొందరికి రాకపోవచ్చు వాటిని ప్రభుత్వం సరి చేస్తోందన్నారు. సన్నరకం వడ్లు పండించి ప్రభుత్వానికి విక్రయించిన రైతులకు వారి బ్యాంకుల ఖాతాలో క్వింటాలుకు రూ.500 జమ చేశామన్నారు. గత ప్రభుత్వం రూ.లక్షల కోట్లు అప్పు చేయగా వీటికి గాను గత పది నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.50వేల కోట్లు వడ్డీలు కట్టిందన్నారు. 55,143 ఉద్యోగాలు ఇచ్చామన్నారు. దీంతో రైతులు, పేదలు, మధ్య తరగతి కుటుంబాలు, గిరిజనులు, మహిళలు నిరుద్యోగులు సంతోషంగా ఉన్నారని తెలిపారు.

ఏడాదిలో రూ.185 కోట్ల అభివృద్ధి పనులు
మౌలిక వసతుల కల్పనకు మరింత కృషి
సమస్యలు అసెంబ్లీ దృష్టికి తీసుకు వస్తా

నియోజవర్గం కేంద్రంలోని పలు సమస్యలను నేటి నుండి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో మంత్రుల దృష్టికి తీసుకువచ్చి తీసుకువచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కొమరారం బోడు కొత్త మండలాలుగా చేయాలని, ఇల్లందులో ప్రభుత్వ వైద్యశాలను వంద పడకలుగా తీర్చిదిద్దడానికి నిధులు మంజూరు, పోస్టుల భర్తీ, సమీకృత గురుకుల పాఠశాల, కేంద్ర ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన కేంద్రీయ విద్యాలయంతోపాటుగా ప్రభుత్వ ఐటిఐ, పాలిటెక్నిక్ ఇల్లందులో ఏర్పాటు చేయాలని మంత్రుల దృష్టికి తీసుకువస్తానన్నారు. ఇల్లందు బస్ డిపోకు 20 కొత్త బస్సులు మంజూరు కోసం రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి, ఆర్టీసీ చైర్మెన్‌లను కలవనున్నట్లు తెలిపారు. ఏడాది పాలనలో నియోజకవర్గంలో రూ.185 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. ఇల్లందు, టేకులపల్లి, గార్ల, బయ్యారం, కామేపెల్లి మండలాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీలు, బ్రిడ్జిలు, పంచాయతీల నుండి గ్రామాలకు రహదారుల నిర్మాణం జరుగుతోందన్నారు. నియోజవర్గంలో మౌలిక వసతులకు మరింత కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు.



మంత్రిని కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-చంద్రుగొండ

మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాస గృహం వద్ద కలిసి మండలంలోని పలు సమస్యలపై వినతి పత్రం అందించారు. మా మండలం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం ఇందిరమ్మ ఇల్లును ఎక్కువ సంఖ్యలో కేటాయించాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అతి త్వరలోనే మండలాని సందర్శించి సమస్యలను పరిష్కరిస్తానని బెండలపాడు గ్రామంలో ఉన్న బ్యాంబో క్లస్టర్‌ను కూడా సందర్శిస్తానని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో కూడా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మాలోత్ బోజ్య నాయక్, సారేపల్లి శేఖర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దిశా కమిటీ సభ్యులు బొర్రా సురేష్, నియోజకవర్గ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఫజల్ బక్షి, ధరావత్ రామారావు, బానోతు రాములు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో కొత్తగూడెంకి 4 పతకాలు

- సత్తా చాటిన కొత్తగూడెం స్విమ్మర్స్

నవతెలంగాణ-కొత్తగూడెం



తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో కొత్తగూడెం విద్యార్థులు ప్రతిభ చాటారు. శని, ఆదివారాల్లో భూపాలపల్లి జిల్లాలో నిర్వహించిన ఈత పోటీల్లో కొత్తగూడెం నవభారత్ పాఠశాలకు చెందిన కొట్టె సాయి శ్రీ వాత్సవ్‌కు బ్యాక్ స్ట్రోక్ 200 మీటర్ల, బ్రెస్ట్ స్ట్రోక్ 200 మీటర్‌ల విభాగంలో 2 కాంస్య పతకాలు, బండారి నాగ చైతన్య బటర్ ఫ్లయ్ 200 మీటర్ల విభాగంలో ఒక కాంస్య పతకం సాధించారు.

సెయింట్ జోసెఫ్ పాఠశాలకు చెందిన చత్రపతి నాథ్‌కు బటర్ ఫ్లయ్ విభాగంలో 200 మీటర్స్ పోటీలో రజత పతకం సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను నవభారత్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎంవీఎస్ రెడ్డి, సెయింట్ జోసెఫ్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్ రెడ్డి, సిఈఆర్ క్లబ్ స్విమ్మింగ్ పూల్ కోచులు హనుమంత రాజు, శామ్యూల్, సంధ్య, రాంబాబు సామంత్‌లు విద్యార్థులను అభినందించారు.

సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా వెంకటరత్నం



నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాడుతూ పేద ప్రజల కోసం, పోడు భూములు హక్కు పాత్రల కోసం మండలంలో ఎన్నో పోరాటం చేసి వారికి అండగా వుంటున్న జంగిలి వెంకటరత్నం మండలంలో జరిగిన మూడవ మండల మహాసభలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. ఈ మహాసభకు జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్, జిల్లా కార్యవర్గ సభ్యులు లిక్కి బాలరాజు హాజరు అయి వారి సమక్షంలో మహాసభను నిర్వహించి కార్యదర్శిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్, బాలరాజు మాట్లాడుతూ మండలంలో ఎక్కడ సమస్య ఉన్నా సీపీఐ(ఎం) ఉందన్నారు. సమస్యలు పరిష్కారం కోసం గత కొన్ని సంవత్సరాల నుండి పోరాటాలు చేస్తూ మళ్ళీ నూతనంగా వెంకటరత్నం ఎన్నిక కావడం చాల సంతోషం అని అన్నారు. అదేవిధంగా వెంకటరత్నం మాట్లాడుతూ పార్టీ పిలుపు మేరకు ఎక్కడ సమస్య వున్న వారికి అందుబాటులో ఉంటూ పెద ప్రజలు కోసం పోరాటం సాగిస్తానని ఇదే పోరాటాన్ని రానున్న కాలంలో కూడా కొనసాగిస్తాను అని అన్నారు. ఎన్నికైన మండల కార్యదర్శికి పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నూతన మండల కమిటీ మడవి నాగరాజు, నూనె కోటయ్య, లింగనబోయిన వెంకటేశ్వర్లు, తాటి సూర్యం, ఎకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలోని పలు పంచాయతీలలో ఎమ్మెల్యే కోరం కనకయ్య విస్తృతంగా పర్యటించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ముత్యాలంపాడు గ్రామంలో తన గురువు ఎండి గాలీబ్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రామచంద్రునిపేట గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేశెట్టి ఖాదర్ బాబు ఇంటి వద్ద తేనీటి విందు స్వీకరించారు. అదే గ్రామంలో మాజీ సర్పంచ్ ఈసాల దేవయ్య సతీమణి పెద్దకర్మ హాజరై కుటుంబాన్ని పరామర్శించారు. మొక్కంపాడు గ్రామంలో సైడ్ కాల్వలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోరం సురేందర్, మండల అధ్యక్షులు దేవా నాయక్, ఏఈ .నవీన్, మాజీ ఎంపీపీ బానోత్ మౌనిక, శంకర్ నాయక్, నాయకులు ఈది గణేష్, మధు రెడ్డి, అన్నారపు రవికుమార్, సతీష్, మోకాళ్ళ పోశాలు, ఇస్లావత్ రెడ్యానాయక్, సర్దార్, లక్ష్మయ్య బండ్ల రజిని, శ్రీను, రావూరి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

నవతెలంగాణ-టేకులపల్లి

సమగ్ర శిక్షా ఉద్యోగులు గత మూడు రోజులుగా కలెక్టరేట్ వద్ద గల ధర్నా చౌక్‌లో చేస్తున్న రిలే నిరసన దీక్షలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్ (టేకులపల్లి) పాల్గొని వారికి మద్దతు, సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, సమగ్ర శిక్షా అభియాన్‌లో చాలా సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీసును, రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు వెంటనే క్రమబద్ధీకరించి, మాట నిలుపుకోవాలన్నారు. ఈ దీక్షా శిబిరంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బి.ప్రసాద్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు వి.సరియా, ఎస్ఎస్సి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు మోహన్ భూక్య, ప్రధాన కార్యదర్శి చందు భట్టు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సిద్దు, ముఖ్య సలహాదారు వనమా సురేష్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

దాతలు సాయం అందించండి

- కాలేయ వ్యాధితో నిరుపేద వివాహిత మహిళ
- సుమారు రూ.40 లక్షల అవసరం అంటున్న వైద్యులు
- బ్యూటిఫుల్ లైఫ్ అసోసియేషన్ చిరు సాయం



నవతెలంగాణ-దుమ్ముగూడెం

దాతలు సాయం అందించండి అంటూ ఆ పేద కుటుంబం సాయం చేసే చేతుల కోసం ఎదురుచూస్తోంది. రెక్కాడితే కానీ డొక్కాడని తాము అంత డబ్బులు వెచ్చించి వైద్యం ఎలా అందించాలి దేవుడా అంటూ వేడుకుంటున్నారు. ఆ కుటుంబ దీన గాథ తెలిసిందే తడవుగా బ్యూటీ లైఫ్ అసోసియేషన్ చిరు సాయం అందించి అండగా నిలిచింది. మండలంలోని పెద్ద ఆర్లగూడెం గ్రామానికి చెందిన కొర్స జోగయ్య భార్య కొర్స భద్రమ్మ (55) గత కొంతకాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. గమనించిన కుటుంబ సభ్యులు వైద్యుడిని సంప్రదించగా వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి లివర్ సంబంధిత వ్యాధిగా నిర్ధారించారు. భద్రమ్మకు కంపెన్సేటెడ్ లివర్ లిమోసిస్, మైల్డ్ అనేమియా, హైపోకలేమియా, కామెర్లు ఉండటం వల్ల లివర్ నీరుతో ఉబ్బి పోతుంది. ప్రతి 15 రోజులకు ఒకసారి సుమారు రూ.10 వేల ఇంజెక్షన్ వేయించుకోవాలి. మందులతో పూర్తిగా నయం కాదు కనుక తప్పనిసరిగా శస్త్ర చికిత్స విధానంతో కాలేయ మార్పిడి చేయాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచించారు. దీనికి గాను 40 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని తెలిపారు. దీంతో ఆ పేద కుటుంబం దిక్కుతోచని స్థితిలో దాతల చేయూత కోసం ఎదురు చూస్తూ సాయం కోసం స్థానికంగా ఉన్న బ్యూటిఫుల్ లైఫ్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ వారిని సాయం కోరారు. స్పందించిన నిర్వాహకులు వెంటనే వారింటికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పి వైద్య ఖర్చుల నిమిత్తం గౌరవ సభ్యులందరి తరపున ఒక రూ.2 వేలు చిరుసాయంగా అందించి అండగా నిలిచారు. బిఎల్ఏ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామల రవివర్మ మాట్లాడుతూ... మాకున్న ఆర్థిక సామార్థ్యాన్ని బట్టి మా బిఎల్ఏ గౌరవ సభ్యులందరి ఆర్థిక సహకారంతో ఈ చిరు సాయం అందించామని చిరు సాయం వారికి ఏమాత్రం సరిపోదు కనుక దాతల సహకారంతో పెద్ద మొత్తంలో సాయం అందించడానికి బాధిత కుటుంబానికి మేము అండగా నిలబడ్డాము. మాతో పాటు మానవత్వం గల దాతలు కూడా సహకరిస్తే భద్రమ్మ ప్రాణాలను కాపాడగలము అని అన్నారు. మానవత్వంతో తలో ఒక్క రూపాయి సాయం చేసిన వారికి ఎంతో గొప్ప మేలు చేస్తుంది అని ఈ సందర్భంగా దాతలకు పిలుపునిచ్చారు. ఈ సేవా కార్యక్రమంలో బిఎల్ఏ కార్యనిర్వాహక సభ్యులు కొర్స నర్సింహారావు(మాజీ ఉపసర్పంచ్), శ్యామల ప్రమీల, శివ వెంకటేష్, సుమంత్, బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రమణ తదితరులు పాల్గొన్నారు. సాయం చేయదలచిన దాతలు ఫోన్ పే, గూగుల్ పే నెం:9390918358 (శ్యామల రవివర్మ బిఎల్ఏ వ్యవస్థాపక అధ్యక్షుడు) అందజేయాలన్నారు.

మండలంలో ఎమ్మెల్యే జారే పర్యటన

- సెంట్రల్ లైటింగ్ పనుల పరిశీలన
- నూతన మసీద్ ప్రారంభోత్సవం



నవతెలంగాణ-దమ్మపేట

అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ ఆదివారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ఈక్రమంలలో మండల కేంద్రం దమ్మపేటలో జరుగుతున్న సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తిచేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అనంతరం మారగాని రమేష్-విశాలి దంపతుల కమార్తె మొదటి పుట్టినరోజు వేడుకకు హాజరైన జారె చిన్నారి పూర్ణికి శాన్విని ఆశీర్వదించారు. అనంతరం ముష్టిబండ గ్రామంలో నూతనంగా నిర్మించిన మసీద్‌ను ముస్లిం సోదరులతో కలిసి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సహజ వనరులతో ఇండ్ల నిర్మాణం సౌకర్యవంతం, సులభతరం

- మట్టి ఇటుకల తయారీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

మన గ్రామంలో దొరికే సహజ వనరులతో మట్టి, సున్నం, సిమెంటు కలిపి తయారుచేసిన ఇటుకలతో మనకు కావలసిన హంగులతో ఇంటిని మొదలుకొని వివిధ కట్టడాలు నిర్మించుకొని గాలి వెలుతురు సక్రమంగా వచ్చే విధంగా ఏర్పాటు చేసుకుంటే ఆర్థికంగా అభివృద్ధి చెందడమే కాక తక్కువ పెట్టుబడితో అందమైన నివాస గృహాలు కట్టుకోవచ్చని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఆదివారం ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీలో మట్టితో సాంప్రదాయ కట్టడాలు గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ఖర్చుతో పర్యావరణానికి అనుకూలంగా మంచి మన్నిక కలిగిన నిర్మాణాల కోసం తయారు చేస్తున్న మట్టి ఇటుకులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆదివాసీ గిరిజన గ్రామాలలో ఇంటి నిర్మాణాలు కూడా పాతకాలపు కట్టడాలు తక్కువ పెట్టుబడితో పర్యావరణానికి హాని కలిగించకుండా మట్టితో అందమైన నివాస గృహాలు నిర్మించుకొని జీవనాధారం సాగిస్తే ఎటువంటి అనారోగ్యాలు దరిచేరకుండా ఆరోగ్యంగా పది కాలాలపాటు జీవించవచ్చని అన్నారు. మట్టితో తయారుచేసిన ఇండ్లు టాయిలెట్లు బాత్రూములు, అంగన్వాడి సెంటర్లు ప్రతిదీ మనకు ఇష్టమైన పద్ధతిలో నిర్మించుకోవచ్చని వీటి నిర్మాణానికి అంత ఖర్చు కాదని సహజంగా ప్రతి గ్రామంలో చెరువులు, వాగులు పరిసరాలలో రకరకాల రాళ్లు లభ్యమవుతాయని తెలిపారు. మన పంట పొలాల్లోనే మనకు కావలసినంత మట్టి దొరుకుతుందని ఇటికల తయారీకి 9 బొచ్చల మట్టి, ఒక బొచ్చే సిమెంటు, ఒక కేజీ తెల్ల సిమెంటును కలిపి కావలసిన సైజులో ఇటుకలు తయారు చేసుకొని వెదురు కర్రలతో మనకు కావలసిన రీతిలో అందమైన ఇంటి నిర్మాణాలు తక్కువ సమయంలో పూర్తి చేసుకోవచ్చని అన్నారు. మట్టి ఇటుకల తయారీ గురించి గతంలో కొంతమందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని శిక్షణ తీసుకున్న గిరిజనులు వారి వారి గ్రామాలలో అవగాహన కల్పించి మట్టి ఇటుకలు తయారు చేయడానికి ముందుకు వస్తున్నారని అన్నారు. స్వచ్ఛందంగా వారి వారి గ్రామాలలో మట్టి ఇటుకలు తయారు చేసుకుని జీవనోపాధి పెంపొందించుకోవడానికి ముందుకు వచ్చే గిరిజన నిరుద్యోగ యువకులకు ఇటుకలు తయారు చేసే యంత్రాన్ని అందించడానికి ప్రయత్నిస్తున్నామని ఆయన అన్నారు. మట్టితో తయారుచేసిన ఇండ్ల వల్ల అన్ని కాలాలలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉండి ఎటువంటి రుగ్మతలు దరిచేరకుండా మంచి ఆరోగ్యంగా జీవించవచ్చని అలాగే ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏమైనా ప్రమాదం సంభవించిన ఇటువంటి గృహాలలో నివసించే గిరిజనులకు ఎటువంటి ప్రాణ నష్టం అనేది జరగదని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాస్, ట్రైబల్ మ్యూజియం ఇన్‌చార్జి వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు తెలిపే గిరిజన మ్యూజియం

శ్రీ సీతారామచంద్రస్వామి దర్శనానికి దేశ విదేశాల నుండి భక్తులతో పాటు టూరిస్టులు అధికంగా వస్తుంటారని వారికి గిరిజన ఆచార వ్యవహారాలు సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా ట్రైబల్ మ్యూజియం, ఆదివాసి వంటకాల నిర్వహణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఆదివారం భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంను ఆయన సందర్శించి మ్యూజియంలో నిర్మాణం చేపడుతున్న గడ్డి ఇండ్లను, టూరిస్టులకు ఆదివాసీ వంటకాలు, కోయ కల్చర్కు సంబంధించిన వస్తువులు అందించే స్టాల్స్ నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మ్యూజియం సందర్శనకు వచ్చే పర్యాటకులకు ఆకర్షించే విధంగా ఏర్పాటు చేయాలని ముఖ్యంగా ట్రైబల్ కల్చర్ ఉట్టిపడేలా అన్ని హంగులతో తయారు చేయాలని అన్నారు. అలాగే బొజ్జిగుప్ప నారాయణపేట గ్రామాలలో ప్రతి పాతకాలం ఇంటికి సంస్కృతి, సాంప్రదాయాలు ఆచార వ్యవహారాలకు సంబంధించిన చిత్రాలు పెయింటింగ్ ద్వారా వేయించాలని గ్రామంలో ప్రవేశించగానే వెదురుతో తయారుచేసిన కోయకల్చర్ సంబంధించిన వస్తువులు పర్యాటకులకు కనిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డీఈ హరీష్, డీఎస్ఓ ప్రభాకర్ రావు, ఈవో శ్రీనివాస్, ఆర్ఐలు వెంకటేశ్వర్లు, నరసింహారావు, పంచాయతీ సెక్రటరీలు స్రవంతి, సురేందర్, ఏపీఎం హేమంత్‌ని, ఏపీఎం హెచ్ఆర్డి నాగేశ్వర రావు, శ్రవణ్ కుమార్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీని విమర్శించే అర్హత రేగాకు లేదు

- మీరు చేస్తే సంసారం...మేము చేస్తే వ్యభిచారమా
- మండల అధ్యక్షులు గొడిశాల రామనాథం



నవతెలంగాణ-పినపాక

కాంగ్రెస్ పార్టీ మోసాల పార్టీ అని, 12 మాసాలు అయినా హామీలు అమలు చేయట్లేదని మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు చేస్తున్న విమర్శలు అర్థరహితమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రామనాదం మండిపడ్డారు. ఆదివారం ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పార్టీ మార్పుల గురించి మాట్లాడే అర్హత రేగాకు లేదన్నారు. 2018లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నిన్ను గెలిపిస్తే మీరు మోసం చేసి బీఆర్ఎస్ పార్టీకి జంప్ అయింది మర్చిపోయారా అని ప్రశ్నించారు. మీరు చేసింది సంసారం మేం చేసింది వ్యభిచారమా.. మీరు కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే తిరిగి మీ ముఖం మీదనే నాలుగు వేలు చూస్తాయని గుర్తుంచుకోవాలన్నారు. ఎమ్మెల్యే పాయం చేసే అభివృద్ధిని చూసి ఓర్వలేక మాట్లాడుతున్నారని, పాయం అభివృద్ధి కార్యక్రమాల్లో దూసుకుపోతున్నారన్నారు. పినపాక నియోజకవర్గం గడ్డ కాంగ్రెస్ అడ్డా అని గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె మదర్ సాహెబ్, మాజీ పినపాక సర్పంచ్ గొగ్గల నాగేశ్వరరావు, తోలం అర్జున్, రామనాథం, మాడే పాపారావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పంట చేలల్లో దిష్టి బొమ్మలుగా దేవుళ్ళ ఫ్లెక్సీలు



నవతెలంగాణ-అశ్వారావుపేట

పుర్రెకో బుద్ధి-జిహ్వకో రుచి అంటే ఇదేనేమో ఈ బుద్ధి రుచులు సైతం కాలానుగుణంగా మారటం సహజం అని ఈ చిత్రాలను బట్టి రుజువు అవుతుంది.

పూర్వం రోజుల్లో నూతన భవనం నిర్మాణంలో, ఏపుగా పెరిగిన పంట పొలాల్లో అడ్డదిడ్డంగా కర్రలు కట్టి దానికి ఏదైనా ఎండు గడ్డి చుట్టి పాత వస్త్రాలు తొడిగి చూడటానికి ఎబ్బెట్టుగా వికారంగా తయారు చేసి ఇంటి ముందు, పొలాల దుగాలు పై ఏర్పాటు చేసేవారు. ఇంకొంచం నాగరికత అలవడి దశలో దిష్టి ఫొటోలు పెట్టేవారు. రాను రాను సాంకేతిక పరిజ్ఞానం పెరగటం, ఫ్లెక్సీలు అందుబాటులోకి రావడం, సినిమానే అన్నీ అయి సమాజాన్ని ప్రభావితం చేస్తున్న తరుణంలో అందమైన హీరోయిన్‌ల అర్ధనగ్న చిత్రాలతో ఫ్లెక్సీలు పెడుతున్నారు. టీవీల్లో సీరియల్ ప్రభావం కొనసాగుతున్న క్రమంలో అక్కడక్కడ "వంటలక్క" ఫ్లెక్సీలు సైతం దర్శనం ఇచ్చి వైరల్‌గా మారాయి. ప్రస్తుతం రాజకీయాల్లో మతం జొరబడి మత ప్రచారకులు, పీఠాధిపతులు కంటే మిన్నగా ఆయా పార్టీల నాయకులు వారానికొకక దేవుడిని ప్రచారం చేయడంతో దేవుడు దయ్యం రాజ్యం ఏలుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ దిష్టి నివారణకు ట్రెండ్‌కు అనుగుణంగా దేవుళ్ళు ఫ్లెక్సీలు నేడు వ్యవసాయ క్షేత్రాల్లో, నూతన భవనం సముదాయాలులో తిష్ట వేసాయి. ఇంతకీ ఈ చిత్రాలు ఎక్కడి వంటే అశ్వారావుపేట మండలం కేశప్పగూడెం పంచాయతీ పరిధిలోని ఆయిల్ ఫాం క్షేత్రాల్లో అంతర పంటగా వేరుశనగ సాగు చేస్తున్న క్షేత్రాల్లో ఆదివారం నవతెలంగాణ విలేకరి క్షేత్ర సందర్శనలో తన కెమెరాకు చిక్కినవి.

ఏడాదిలో అనేక అభివృద్ధి పనులు

నియోజకవర్గాన్ని చుట్టేస్తున్న మాస్ లీడర్

కార్యదీక్ష... పట్టుదల... ఉంటే ఏదైనా సాధించవచ్చు. సాధించి, ప్రజలను మెప్పించవచ్చు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని ఇదే తరహాలో ప్రజల వద్ద ఉంటూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు నియోజకవర్గ అభివృద్ధి కోసం అలుపెరుగక అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నారు. అధ్యక్ష అంటూ అసెంబ్లీలో తన గొంతు కార్మిక కర్షక వర్గం కోసం ప్రశ్నించిన కొత్తగూడెం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు.



- నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని
- ప్రభుత్వాన్ని మెప్పిస్తూ..నిధులు తెస్తూ

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తున్నాను... అంటూ పదవీ బాధ్యతలు చేపట్టి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సరిగ్గా నేటితో ఏడాది అనగా 365 రోజులు పూర్తయ్యాయి. ఈ ఏడాది కాలంలో ఆయన చెప్పిన మాటకు ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి వర్గ దృక్పధంతో పనిచేస్తున్నారు.

ఈ ఏడాది కాలంలో నియోజకవర్గంలో మారు మూల ప్రాంతాల ప్రజలకు ఏ విధంగా అభివృద్ధిని చేర వేయాలని ఆలోచిస్తూ అందుకు తగిన విధంగా పనిచేస్తున్నారు. నిత్యం నియోజకవర్గ ప్రజల మధ్యన ఉంటూ..సంక్షేమమే ధ్యేయంగా, ప్రభుత్వంతో పాటు పరిశ్రమల నుంచి ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి నిధులను రాబట్టి మరింత అభివృద్ధి చేస్తూ రాష్ట్రంలోనే కొత్తగూడెం నియోజకవర్గాన్ని నంబర్ వన్ స్థానంలో నిలబెట్టేందుకు నిరంతర చేస్తున్నారు.

కూనంనేని అంటే అభివృద్ధి... అభివృద్ధి అంటే కూనంనేని అనే విధంగా చేసి చూపించారు. నియోజకవర్గ శాసనసభ్యుడిగా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తి అయిన సందర్భంగా నవతెలంగాణ'లో ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాలు...

గతంలో ఏర్పాటుకు సర్వేలు నిర్వహించినప్పటికీ అది కార్యచరణకు నోచుకోలేదు. ఎలాగైనా కొత్తగూడెం పట్టణంలో విమానాశ్రయం ఏర్పాటు చేయరు అనే లక్ష్యంతో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఎయిర్ పోర్టు సౌకర్యం ఉండాలని కేంద్ర, రాష్ట్ర మంత్రులను కలసి విమానాశ్రయ ఏ ర్పాటుకై అహర్నిశలు కష్టపడుతున్నారు.



ఏడాదిలో అనేక అభివృద్ధి పనులు

కొత్తగూడెం బైపాస్ రోడ్ (రింగు రోడ్డు) నిర్మాణం కోసం రూ.450 కోట్లు. రామవరం బ్రిడ్జి మీద నుంచి బైపాస్ రోడ్డుకు కనెక్ట్ చేస్తూ ఆర్అండ్‌బీ ఫ్లై వోవర్ నిర్మాణం (సేతు బంధు స్కీం) కింద రూ.158 కోట్లు మంజూరు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు, పరిసర గ్రామాలను కలుపుతూ "కూడ" ఏర్పాటుకు విశేషం కృషి చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 177 జీవోను విడుదల చేసింది. కార్పొరేషన్ చేయాలని పట్టుదల అమితంగా ఉంది.

కిన్నెరసాని వంతెన నిర్మాణానికి రూ.25 కోట్లు

పాల్వంచ మండలంలోని గట్టాయిగూడెం గ్రామం నుంచి పినపాక పట్టినగర్ వరకు వయా సీతారాంపురం తండా, సూరారం తండా, ఉప్పుసాక తండా, జిన్నెలగూడెం తండాల మీదుగా బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు. నందాతండా నుంచి వికలాంగులకాలనీ వరకు ఎస్టీ ఎస్ఎఫ్ బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.4 కోట్లు మంజూరు.

జిల్లాలో గ్రంథాలయ భవనం

కొత్తగూడెం మునిసిపాలిటీకి డీఎంఎఫ్‌తో పాటు ఇతర నిధులు రూ.18 కోట్లు మంజూరు.

పాల్వంచ మున్సిపాలిటీకి డీఎంఎఫ్‌తో పాటు ఋఇతర నిధులు రూ.12 కోట్లు మంజూరు.

ప్రజారోగ్యంలో భాగంగా అమృత్ స్కీం కింద తాగునీటి సర ఫరా కోసం రూ.121 కోట్లు మంజూరు చేయించారు. పంచాయతీరాజ్ కింద సీఆర్ఆర్ రూ.16 కోట్లు, ఈజీఎస్ కింద రూ.0.62 కోట్లు, డీఎంఎఫ్ నిధులు రూ.2 కోట్లు, ఎంఆర్ఆర్ నిధులు రూ.12 కోట్లు, ఎస్టీ ఎస్టీఎఫ్ నిధులు రూ.16 కోట్లు, ఎస్సీ ఎస్సీఎఫ్ నిధులు రూ.10.80 కోట్లు నిధులు మంజూరు చేయించారు. సింగరేణి సీఎస్ఆర్ పాలసీ కింద రూ.2 కోట్లు మంజూరు చేయించారు. సింగభూపాలెం చెరువు, విద్యానగర్లోని చింతల చెరువు అభివృద్ధి, సుందరీకరణ కోసం రూ.9.50 కోట్లు మంజూరు. సీతారామా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకింద అధనంగా 25,409 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. అందుకు తగిన విధంగా డిజైన్‌ను మార్పించారు. ముర్రేడు వాగు రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం రూ.35 కోట్లు మంజూరు చేయించారు. పాల్వంచలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డయాలసిస్ యూనిట్లు, కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో మరో అదనపు డయాలసిస్ యూనిట్లు మంజూరు చేయించారు. పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్ గ్రేడ్ చేయించారు. కొత్తగూడెంలో ఈఎస్ఐఐ ఆస్పత్రి నిర్మాణానికి కృషి చేస్తున్నారు.

కొత్తగూడెంలో ప్రభుత్వ స్థలంలో ఆటోనగర్ నిర్మాణానికి కృషి చేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి కొత్తగూడెం పట్టణంలో పెండింగ్‌లో ఉన్న జీవో 76 ప్రకారం ఇంటి పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నారు. సింగరేణి సంస్థను పరి రక్షించుకుంటూ సంఘటిత, సంఘటితరంగా కార్మికుల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేస్తాం. వీటితో పాటు మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయంగా నిరంతరం పాటు పడుతున్నారు.

అసెంబ్లీలో పేదల పక్షాన గొంతుక....

ఈ నెల తొమ్మిది నుంచి జరబబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రస్తావిస్తానని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రూ.2 లక్షల లోపు రైతు రుణ మాఫీపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరతానని, అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ, సన్న బియ్యం పథకం ప్రస్తావిస్తానని, ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలపై ప్రస్తావిస్తానని తెలిపారు. ఇతర ప్రధాన అంశాలను వాయిదా తీర్మానం ప్రవేశపెట్టి ప్రశ్నించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ రంగం ప్రయివేటీకరణ కోసమే నూతన విద్యుత్ చట్టం

- ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ కోసం పోరాటమే మార్గం
- యూఈఈయూ జిల్లా మహాసభలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె. బ్రహ్మాచారి

నవతెలంగాణ-మణుగూరు





విద్యుత్ రంగం ప్రయివేటుపరం చేసి స్వదేశీ విదేశీ కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం కోసమే కేంద్రంలోనీ బీజేపీ ప్రభుత్వం 2019 నూతన విద్యుత్ చట్టాన్ని తీసుకొచ్చిందని ఈ చట్టానికి వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాలని, విద్యుత్ రంగ సంస్థల పరిరక్షణ కోసం సమస్యల ఉద్యమాలకు కార్మికుల సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బ్రహ్మాచారి పిలుపునిచ్చారు. ఆదివారం డివి గ్రాండ్ ఫంక్షన్ హాల్ (అమరవీరుల సమావేశ మందిరం) సీఐటీయూ అనుబంధ తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ యూఈఈయూ జిల్లా 4వ మహాసభలు యూనియన్ జిల్లా అధ్యక్షులు కొలగాని రమేష్, యూనియన్ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి పులి గణేష్ అధ్యక్షతన మణుగూరులో డివి రాయల్ ఫంక్షన్ హాల్ నందు జరిగాయి. ఈ మహాసభలను సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ప్రారంభించి మాట్లాడారు. దేశ ఉత్పత్తి రంగానికి ఆర్థిక వ్యవస్థకు విద్యుత్ రంగం ఇరుసు లాంటిదని పేర్కొన్నారు.

ప్రయివేట్, విదేశీ కంపెనీలకు ఈ రంగంలో భాగస్వామ్యం కల్పించడం అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. సోలార్ పవర్ ఉత్పత్తి పేరుతో బీజేపీ చేసిన విధానాలు కంపెనీకి లాభాలు చేకూర్చి పెడుతున్నాయని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రధాని కంపెనీలు లంచాలు ఇచ్చి అధిక రేట్లకు విద్యుత్తును అమ్మి ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నట్టు వెల్లడైందని, ఇటువంటి అవినీతి అక్రమాలకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని విమర్శించారు. విద్యుత్ రంగం ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని, అప్పుడు మాత్రమే ప్రజలకు నాణ్యమైన విద్యుత్తు తక్కువ ధరకు లభిస్తుందని సీఐటీయూ పేర్కొన్నది. విద్యుత్ సంస్థల ప్రయివేటుపరం అయితే కార్మిక హక్కులన్నీ కాలరాయపడతాయని పేర్కొన్నారు. 8 గంటల పని చట్టం ఉన్నప్పటికీ విద్యుత్ రంగంలో అనధికారికంగా పది నుంచి 12 గంటల శ్రమ దోపిడీ జరుగుతుందని, లేబర్ కోడ్ అమలయితే 12 గంటలు అనేది అధికారికంగా మారిపోతుందని, అప్పుడు మరింత ఎక్కువ గంటలు శ్రమ దోపిడీ జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలకు లాభాలు చేకూర్చేందుకే లేబర్ కోడులు తీసుకొచ్చారని, వీటి ఆమలను పోరాటాల ద్వారానే ప్రతిఘటించాలని కోరారు. మత భావాలను రెచ్చగొట్టడం ద్వారా ప్రజలను కార్మికులను చీల్చి కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తుందని సీఐటీయూ విమర్శించింది. కార్మిక వర్గం ఐక్యత కోసం ఐక్య పోరాటాల కోసం సీఐటీయూ అంకితభావంతో కృషి చేస్తుందని పోరాటాల ద్వారానే ప్రభుత్వ విధానాలను ప్రతికటించవచ్చని పేర్కొన్నారు. ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని, ఏపీఎస్ఈబి రూల్స్‌ను వర్తింపజేసి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నప్పుడే ప్రజా సంక్షేమం బలంగా అమలవుతుందని పేర్కొన్నారు.



కార్యదర్శి నివేదిక పెడుతున్న దృశ్యం

అనంతరం తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఎన్‌పీడీసీఎల్ కంపెనీ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ...విద్యుత్ రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ నాయకత్వంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. గృహ జ్యోతి వల్ల ఉపాధి కోల్పోయిన బిల్ కలెక్టర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అన్మాన్ వర్కర్లను ఆర్టిజన్ కార్మికులుగా కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ విద్యుత్ రంగా కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుల్లి వెంకటరాజు మాట్లాడుతూ... మూడు సంవత్సరాల కాలంలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన పోరాటాలు సాధించిన విజయాలను మహాసభలో వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కార్మికులకు ఇబ్బంది ఎదురైనా యూనియన్‌గా స్పందించి కార్మికులకు అండగా ఉంటున్నామని, అందువల్లనే యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ బలమైన శక్తిగా జిల్లాలో ఉందని గుర్తు చేశారు.

ముందుగా యూనియన్ జండాను యూనియన్ సీనియర్ నాయకులు దొంగల వెంకన్న ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులు కార్మిక పోరాటాలకు అండగా నిలిచిన భద్రాచలం మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య, తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి అమరజీవి ఎం.కిరణ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ మహాసభల్లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గద్దల శ్రీనివాస్, మండల నాయకులు సత్రంపల్లి సాంబశివరావు, తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కునురాజు శ్రీనివాస్, పదిలం శ్రీనివాస్, వర్మ, జి.వెంకన్న, సీతారాములు, కనుకు సత్యనారాయణ, బుడిగే రమేష్, మధు, జె.లీలావతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చౌక దుకాణాలను సమర్ధవంతంగా నిర్వహించాలి

- ఐద్వా మండల అధ్యక్షురాలు యలగం పార్వతి
- సిద్దారంలో ఐద్వా ఆధ్వర్యంలో సెమినార్

నవతెలంగాణ-సత్తుపల్లి

చౌక దుకాణాలను సమర్ధవంతంగా నిర్వహించాలని, తద్వారా పేద ప్రజలకు ఆహార భద్రతపై నమ్మకం కుదురుతుందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సత్తుపల్లి మండల అధ్యక్షురాలు యలగం పార్వతి స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని సిద్దారంలో ఐద్వా ఆధ్వర్యంలో సెమినార్‌ను నిర్వహించారు. ఈ సెమినార్‌లో పార్వతి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చౌక దుకాణాల ద్వారా ప్రజలకు 14 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలన్నారు. కేవలం బియ్యం వరకే చౌక దుకాణాలు పరిమితం కావడం పట్ల ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బహిరంగ మార్కెట్లో నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటి పేద, మధ్య తరగతి ప్రజల జీవనం భారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యావసరాలు బ్లాకు మార్కెట్‌కు తరలించడంపై వాటి ధరలు విపరీతంగా పెరిగేందుకు కారణమవుతోందన్నారు. బ్లాక్ మార్కెట్‌కు నిత్యావసరాలు తరలి వెళ్లకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని పార్వతి డిమాండ్ చేశారు. పేద వర్గాలకు తెల్ల రేషన్‌కార్డులు అందక 10యేండ్లకు పైగా నుంచి అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే అర్హులైన పేదలందరికి తెల్లకార్డులు అందించాలని డిమాండ్ చేశారు. నిత్యం ప్రజాపంపిణీ వ్యవస్థపై నిఘా పెంచడం ద్వారా ఆ వ్యవస్థ పటిష్టంగా మారుతుందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థపై సంతకాలు సేకరించి కలెక్టర్‌కు అందజేయనున్నట్లు పార్వతి తెలిపారు. ఈ సెమినార్‌లో ఐద్వా మండల కమిటీ బాధ్యులు వెంకటలక్ష్మి, సరోజన, లక్ష్మి కుమారి, రేణుక, సుజాత, పద్మ నాగమణి, రమాదేవి, రాములమ్మ నాగేంద్ర పాల్గొన్నారు.



ఒత్తిడికి గురైతే...! చెప్పుకుంటేనే ఉపశమనం...!!

- బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి
- కళాశాలలో టెలిమానస్ కార్యక్రమం

నవతెలంగాణ-సత్తుపల్లి

విద్యార్థినులు ఒత్తిడికి గురైన సందర్భాల్లో ఆ ఒత్తిడికి కారణమవుతున్న సమస్యలను తల్లిదండ్రులకు గాని, ఉపాధ్యాయులకు గాని, స్నేహితులకు చెప్పుకోవడం ద్వారా వారిలో ఏర్పడిన ఒత్తిడిభారం తగ్గి ఉపశమనం పొందే అవకాశం ఉంటుందని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.భాగ్యలక్ష్మి అన్నారు. కళాశాలలో గంగారం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వికాస్, డాక్టర్ ప్రసన్న ఆధ్వర్యంలో టెలిమానస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డాక్టర్ వికాస్ మాట్లాడుతూ విద్యార్థినులు ఒత్తిడికి లోనైనప్పుడు టోల్ ఫ్రీ నెంబరు 14416కు ఫోన్‌చేసి డాక్టర్ సలహాలు తీసుకొని ఒత్తిడి నుంచి బయట పడాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు లలితమ్మ, వనజరాణి, కల్పన. సత్యనారాయణ, కృష్ణవేణి, వెంకటేశ్వరరావు, జబీన, సంధ్యారాణి, ప్రియాంక, అజయ్, వెంకటేశ్వర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదు

ఖమ్మం నగర ఏసీపీ రమణమూర్తి

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలో అనుమతి లేకుండా ఎలాంటి సభలు, ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదని ఖమ్మం నగర ఏసీపీ రమణమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఖమ్మం నగరంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా అమలుల్లో ఉన్న సిటీ పోలీస్ యాక్ట్ ఆంక్షల నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని ఏసీపీ కోరారు. నిబంధనలు అతిక్రమించి ర్యాలీలు, ఊరేగింపులు, సభలు, సమావేశాలు నిర్వహిస్తే చట్టపరంగా సిటీ పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు .



స్తంభాద్రి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో స్తంభాద్రి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు, స్తంభాద్రి మెడికల్ అసోసియేషన్ ఫౌండర్ అండ్ ఛైర్మన్‌గా డాక్టర్ కుసుమరాజు రవి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ కే.నారాయణరావు జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ ఖమ్మం నగరంలోని ప్రయివేటు హాస్పిటల్ స్టాఫ్ అందరిని ఐక్యం చేసే పనిలో భాగంగా నిర్వహిస్తున్న క్రీడలు ఖమ్మం వైద్య రంగానికి మంచి పరిణామమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరింత ఐక్యతతో పనిచేసేందుకు స్తంభాద్రి మెడికల్ అసోసియేషన్‌కు ఖమ్మం ఐఎంఏ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. స్తంభాద్రి మెడికల్ అసోసియేషన్ ఫౌండర్ అండ్ ఛైర్మన్ డాక్టర్ కుసుమరాజు రవి కుమార్ మాట్లాడుతూ ప్రయివేట్ హాస్పిటల్‌లో పనిచేసే ప్రతి ఉద్యోగి అయమ్మ నుండి మొదలుకుని మేనేజర్ స్థాయి ఉద్యోగి వరకు ఐక్యమత్యమే లక్ష్యంగా ఈ అసోసియేషన్ ఏర్పడిందని అన్నారు. 2017లో ఏర్పడిన ఈ సంస్థ ఇప్పటి వరకు 5 దఫాలుగా క్రీడలు నిర్వహించుకుని 6వ దఫా ఇప్పుడు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ క్రీడలు నిర్వహించుటకు ఆర్థికంగా, హార్దికంగా సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపుతున్నామని అన్నారు. కార్యక్రమంలో ఖమ్మం ఐఎంఏ జనరల్ సెక్రటరీ డాక్టర్ జగదీష్, డాక్టర్ కూరపాటి ప్రదీప్, డాక్టర్ ఎం జీవి ప్రవీణ్, డాక్టర్ ఆర్. రవి కుమార్, డాక్టర్ జంగాల సునీల్ కుమార్, డాక్టర్ నందనందన్, డాక్టర్ గోపగాని సురేందర్, డాక్టర్ రాజ్ కుమార్, స్తంభాద్రి మెడికల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు జాగర్లమూడి ప్రసాద్, విష్ణు, నరేష్, గౌస్ పాషా, సాధిక్, హమీద్, అర్కా వెంకట్, వీర కుమార్, వెంకట్, శ్రావణ్, నరేష్, సుధీర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ...

రూ.6లక్షలు అపహరణ

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఓ ఇంట్లో చోరీ జరిగిన సంఘటనపై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది.రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మద్దులపల్లి పంచాయతీ పరిధిలోని మణికంఠ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న రోజా తన భర్త శబరిమల వెళ్లడంతో శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి పక్కనే ఉన్న తమ తల్లిగారింటికి వెళ్లింది.ఆదివారం ఉదయం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా సుమారు రూ.6 లక్షలు చోరీకి గురైనట్లు తెలిసింది. సంఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఇన్స్పెక్టర్ రాజు తెలిపారు.

'బెదిరింపు విధానాలను ఫారెస్ట్ అధికారులు మానుకోవాలి'

నవతెలంగాణ-బూర్గంపాడు

బెదిరింపు విధానాలను ఫారెస్ట్ అధికారులు మానుకోవాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు భీమ నాయక్ అన్నారు. మండలంలోని సారపాక మేజర్ గ్రామ పంచాయతీ భాస్కర్ నగర్ గ్రామంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం లంబాడి హక్కుల పోరాట సంఘం సంయుక్త సమావేశం భాస్కర్ నగర్‌లో ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశకి భీమ నాయక్ హాజరై మాట్లాడారు. భాస్కర్ నగర్‌లో ఎస్టీ లంబాడీలను ఫారెస్ట్ శాఖ వారు నానా ఇబ్బందులకు గురి చేస్తు న్నారని తెలిపారు. గత 30, 40 సంవత్సరాల నుండి పోడు సాగు చేసుకుంటుంటే వారిని ఫారెస్ట్ వారు భయభ్రాంతులకు గురి చేస్తూ వారిని బెదిరించి వారి అక్రమ కేసులు పెడుతూ పట్టా భూముల్లో మొక్కలు నాటి అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. వారికి పట్టాలు ఉన్న వారిని లంచాలు అడుగుతూ తున్నారని, వారి తరఫున మేము ఎలాంటి పోరాటానికైనా మేము లంబాడి హక్కుల తరఫున సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నందియా ప్రవీణ్, రాంబాబు, సురేష్, జగన్, జి.వెంకన్న, లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

కమ్ముకుంటున్న మబ్బులు..ఆవి'రైత'న్న ఆశలు

- వడ్ల రాశులతో కిక్కిరిసిన కొనుగోలు కేంద్రాలు

నవతెలంగాణ-పినపాక



తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం క్వింటాకు రూ. 500 మద్దతు ధర ప్రకటించింది. దీనితో రైతన్నల ముఖంలో చిరునవ్వు వికసించింది. వరి కోతలు కోపించిన రైతన్నలు ప్రభుత్వ నిబంధన మేరకు తేమ శాతం ఉండేలా పంటను ఆరబోసి అమ్ముకుందామనుకున్న అన్నదాతలకు ఆకాశంలో వరుస మబ్బులు పడుతుండటం ఆవేదనకు గురిచేస్తుంది. వరుస మబ్బులు, వానలతో అన్నదాతల గుండెల్లో గుబులు మొదలైంది. ఆరుగాలం కష్టించి పంటసాగు చేసుకునే రైతన్నను అమ్ముకునే సమయంలో కష్టాలు వెంటాడుతున్నాయి. పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో రాశులు పోసి సూర్యుడి కోసం ఎదురు చూస్తున్నారు. వర్షంతో ధాన్యం తడిసిన రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. సాగులో ఆశించిన స్థాయిలో దిగుబడి రాకున్నా ప్రభుత్వం ప్రకటించిన బోనస్ తోనైన ఊరటకలిగిస్తుందనుకున్న రైతులు అసలు పంట అమ్ముడు పోతుందో లేదోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమ్ముడు పోయినా మిలర్లనుండి బారికోతలు తప్పవంటున్నారు విశ్లేషకులు. ఆరిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. వర్షం రాకుండా టార్పాలిన్ టవర్లు కప్పుకొని రైతులు వేచి చూస్తున్నారు. ప్రభుత్వం టార్పాలింగ్ కవర్లను సబ్సిడీపై అందించకపోవడంతో వ్యాపారస్తులు ఇష్టమైన ధరలకు అమ్ముతున్నారు.

రైతు సమస్యలపై పోస్ట్ కార్డు ఉద్యమం

నవతెలంగాణ-కారేపల్లి

రైతు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని చర్లపల్లి, మాణిక్యారం గ్రామాలలో పోస్ట్ కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, పనిముట్లు ఇవ్వాలని పోస్ట్ కార్డు ద్వారా రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. అర్హులైన రైతులకు రుణమాఫీ కాలేదని రూ. 2లక్షల పైబడి రుణం ఉన్న రైతులకు కూడ మాఫీ వెంటనే చేయాలని లేఖలో కోరారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల వివక్ష చూపుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలులో అలసత్వం ప్రదర్శించిందని విమర్శించారు. రైతు సమస్యలపై దశలవారు ఉద్యమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరపటి సీతారాములు, కల్తి రామచంద్రు, కరపటి లక్ష్మయ్య, పాయం వెంకన్న, బత్తుల శేఖర్, ఎల్లెబోయిన వీరబాబు, పాయం ఎర్రయ్య, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

వైరా నియోజకవర్గానికి అధిక నిధులు కేటాయించాలి

నవతెలంగాణ-కారేపల్లి



అభివృద్ధిలో వెనకబడిన ఏజన్సీ నియోజవర్గమైన వైరా కు ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం కారేపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక నీటి వసతులతోనే నియోజకవర్గ రైతులు వ్యవసాయాన్ని చేస్తున్నారన్నారు. సీతారామ ప్రాజెక్టు నీటిపై పాలకులు నియోజకవర్గ ప్రజలను ఊరిస్తున్నారు తప్ప నీళ్ల రప్పించటం లేదని విమర్శించారు. పోడు సమస్య అధికంగా ఉందని పోడు రైతులకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తేవటం ద్వారా సీపీఐ(ఎం) ప్రజా సమస్యలు పరిష్కారం చూపుతుందన్నారు. ఈనెల 11 సిపిఐ(ఎం) వైరా డివిజన్ మహాసభలు కొనిజర్ల మండలం సింగరాయపాలెం జరపనున్నట్లు తెలిపారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే.నరేంద్ర, నాయకులు వజ్జ రామారావు, తలారి దేవప్రకాష్, దాసరి మల్లయ్య, బానోత్ బన్సీలాల్, కొండబోయిన ఉమావతి, తేజావత్ చందర్, రేగళ్ల మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

'10 నుంచి సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె సైరన్'

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఈనెల 10వ తేదీ నుంచి విద్యాశాఖలో సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెకు సైరన్ కొట్టారు. దీంతో కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలు, భవిత సెంటర్ల ల్లో విద్యా బోధన ఆగనుంది. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెలో జిల్లా విద్యాశాఖ కార్యాలయాల సిబ్బంది, మండల విద్యాశాఖ కార్యాలయాల సిబ్బంది, క్లస్టర్ పాఠశాలల సిబ్బంది, ఉన్నత పాఠశాలలోని ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ సిబ్బంది పాల్గొనడం వలన టెక్నికల్ ఆన్‌లైన్ పనులు, యూడిఐఎస్‌ఈ, ఏపిపిఏఆర్, ఎండిఎం బిల్స్ లాంటి కార్యక్రమాలకు ఆటంకాలు ఏర్పడనున్నాయి. దీంతో పాటు పాఠశాల విద్యాశాఖ కార్యాలయాలు వెల వెల పోవడంతోపాటు విద్యాశాఖ అడ్మినిస్ట్రేషన్ సైతం స్తంభించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలలో ప్రతి జిల్లా కేంద్రంగా జిల్లా స్థాయిలో ఈ సమ్మె చేపట్టేందుకు ఉద్యోగులు సిద్ధమయ్యారు. గత సంవత్సరం 13/09/2023 న హన్మకొండలో గౌరవ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు విద్యాశాఖలోని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల అందరిని రెగ్యులర్ చెయ్యాలని, ఆ లోపు తక్షణమే పే స్కేల్ అమలు చెయ్యాలని టిఎస్ఎస్‌యుఎఫ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వ శిక్ష ఉద్యోగులు గత 20 సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలతో శ్రమ దోపిడీకి గురి అవుతున్నారని, మాయవ్వనం మొత్తం ప్రభుత్వాలు దోచుకున్నాయని, పెరిగిన నిత్యావసర ధరల వలన బ్రతకలేక చస్తున్నామని ఆవేదన పడుతున్నారని అన్నారు. భారత దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి - సమాన వేతనం వెంటనే అమలు చెయ్యాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఉద్యోగులు సమ్మె బాట పట్టారన్నారు.

మండలంలో ఇళ్ళు లేని పేదలను ఆదుకోండి

- ఎమ్మెల్యే జారేకి ప్రజా పంథా నాయకుల వినతి

నవతెలంగాణ-అశ్వారావుపేట

నివాస స్థలం లేని నిరుపేదలను ఆదుకుని వారికి నివాసయోగ్యం కల్పించాలని ప్రజా పంథా (మాస్ లైన్) జిల్లా నాయకులు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణను కలిసి వినతి పత్రం అందించారు. మండల పరిధిలోని వినాయకపురం శివారు ఎర్రగుంటపల్లిలో గత మూడు సంవత్సరాల నుంచి ఇళ్ల స్థలాల కోసం నిరుపేదలు పోరాటాలు చేస్తున్న క్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోకినపల్లి ప్రభాకర్, మండల కార్యదర్శి వాసం బుచ్చి రాజు ల ఆధ్వర్యంలో స్థానిక శాసనసభ్యులు గౌరవనీయులు జారే ఆదినారాయణ ను కలిసి ఇళ్ల స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించ గలరని కోరారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు జారే ఆదినారాయణ మాట్లాడుతూ సమస్యను పరిశీలన చేసి తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి ఎర్రగుంటపల్లి వద్ద నిరుపేదలు ఇంటి స్థలాల కోసం నిర్వహిస్తున్న పోరాటాన్ని శాసనసభ్యులు అర్థం చేసుకొని వారికి న్యాయం చేయడానికి సుముఖత తెలిపినందుకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుంటపల్లి ఇంటి స్థలాల కోసం పోరాటం చేస్తున్న సలీం, కొడిమి వెంకన్న బాబు సరియం మహేష్, మడకం రామకృష్ణ, పార్టీ నాయకులు పండరి వీరబాబు,కొడిమి చంద్ర,కట్ట బుచ్చమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'తెలుగు యువత రాష్ట్ర నాయకులు జయరాం అబద్ధపు ప్రకటనలు మానుకోవాలి'

నవతెలంగాణ-బూర్గంపాడు

తెలుగు యువత రాష్ట్ర నాయకులు పొగాకు జయరాం అబద్ధం మాటలు మానుకోవాలని టీడీపీ పినపాక నియోజకవర్గ నాయకులు వట్టం నారాయణ దొర అన్నారు. ఆదివారం సారపాకలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పినపాక నియోజకవర్గంలో పొగాకు జయరాం పర్యటనలు మొదటి నుండి పినపాక నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో విభేదాలు సృష్టిస్తున్నాయన్నారు. గతంలో జానంపేటలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకి వచ్చి విభేదాలు సృష్టించారని తెలిపారు. తనకున్న నలుగురు అనుచరులను అడ్డం పెట్టుకొని పార్టీ నాయకులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా శుక్రవారం బూర్గంపాడు మండలం సారపాకకు వచ్చి కావాలనే ఉద్దేశపూర్వకంగా అబద్ధపు ప్రకటనలు చేస్తున్నారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో నే ప్రథమ స్థానంలో సభ్యత్వాలు ముమ్మ రంగా కొనసాగుతున్న పినపాక నియోజకవర్గం వచ్చి వర్గ విభేదాలను సృష్టించడానికి ప్రయత్నిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తాళ్లూరి జగదీశ్వరరావు, మండల నాయకులు వాసిరెడ్డి చలపతిరావు, గల్లా నాగభూషయ్య, మండల అధికార ప్రతినిధి కాకర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

రెడీమేడ్ దుస్తుల వితరణ

నవతెలంగాణ-మధిర

మధిరలో మిలినియం స్కూల్ జీవీ అకాడమీలో విలీనం కావడం చేత ఆ యూనిఫామ్ డ్రెస్‌లు మారాయి. ఆ డ్రెస్‌లు నిరుపేద పిల్లలకు పనికి వస్తాయి అంటూ జీవి అకాడమీ జోనల్ హెడ్ రాజేశ్వరి, మధిర జీవి అకాడమీ స్కూల్ సిబ్బంది, ప్రముఖ సామాజిక సేవకుడు (మధిర ఆశ మిత్ర) లంకా కొండయ్య వాటిని ఆదివారం నందిగామ బైపాస్ రోడ్డులో ఉన్న సంచార జాతుల కుటుంబాలకు చెరుకూరి నాగార్జునరావు, మునిగోటి కళా పరిషత్ అధ్యక్షులు మునిగోటి వెంకటేశ్వర్లు, లంకా కొండయ్య చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఈ జీవి అకాడమి యాజమాన్యానికి సామాజిక కార్యకర్త కొండయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లంకా సేవా ఫౌండేషన్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుక మూగబోయింది

- ప్రసాద్ సంస్మరణ సభలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం



ప్రజల పక్షాన రాజ్యాంగ బద్ధమైన హక్కుల కోసం ప్రశ్నిస్తూ పోరాడే పోటు ప్రసాద్ మరణంతో ప్రశ్నించే గొంతుక మూగబోయిందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని పువ్వాడ ఆడిటోరియంలో జరిగిన పోటు ప్రసాద్ సంస్మరణ సభలో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రసాద్ మరణం ఓ షాక్ అని, ఊహించని ఈ పరిణామం నుంచి కోలుకోవడం పార్టీ శ్రేణులకే కాదు ఆయన సన్నిహితులకు ఇబ్బందికరమేనన్నారు. హక్కుల కోసం ప్రజల పక్షాన నిరంతరం పోరాడే ప్రసాద్ లాంటి వారిని కోల్పోవడం యావత్ సమాజానికి తీరని లోటన్నారు. హక్కుల కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం నినదిస్తూ, వివరిస్తూ రాజ్యాంగ హక్కుల అమలుకు పోరాటాలు సాగించే వ్యక్తులను కోల్పోవడం ఈ వ్యవస్థకు చాలా నష్టమన్నారు. పోటు ప్రసాద్ మితభాషి అని ఇలా ఉండేవారిలో సామాజిక పరమైన సంఘర్షణ ఉంటుందన్నారు. ప్రజాస్వామిక విలువలకు కట్టుబడి పోరాటాలు సాగిస్తున్న వ్యక్తులు మరణించడం అట్టడుగు వర్గాల ప్రజలకు తీరని నష్టమన్నారు. పోటు ప్రసాద్ తుదిశ్వాస వరకు ప్రజల హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం పోరాడారని సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల వేళ ఖమ్మం జిల్లా సమితిని రాష్ట్రంలోనే మిగిలిన జిల్లాలకు ఆదర్శంగా నిలిపిన ప్రసాద్ మహోన్నతుడని నవచేతన విజ్ఞాన సమితి అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు పల్లా వెంకటరెడ్డి తెలిపారు. ఆదర్శవంతమైన కమ్యూ నిస్టులలో పోటు ప్రసాద్ ఒకరని ఆయన ఆశయ సాధనకు కృషి చేయడమే. ఆయనకు ఇచ్చే నివాళి అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. ప్రసాద్లో లౌక్యం ఉందని అదే సమయంలో బాధ్యతల విషయంలో రాజీపడే వాడు కాదన్నారు. ఈ సభలో వివిధ పార్టీల నాయకులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, ఝాన్సీ, లింగయ్య, ఎం.వెంకటేశ్వర రావు, యూసుఫ్, ఎ.వనజ, బాగం హేమంతరావు, పశ్య పద్మ, ఎస్కె సాబీర్‌పాషా, మహ్మద్ మౌలానా, గుమ్మడి నర్సయ్య, ఆవునూరి మధు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తుమ్మల యుగంధర్, పోట్ల మాధవరావు తదితరులు ప్రసంగించారు. ఈ సభకు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షత వహించగా రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి అతిథులను వేదికపైకి ఆహ్వానించారు.





'ప్రజావాణి'కి అధికారులు సకాలంలో హాజరు కావాలి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

సోమవారం భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలో నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు వారి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని పేర్కొన్నారు. సంబంధిత యూనిట్ అధికారులు ఉదయం 10.30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో హాజరుకావాలని సూచించారు.

'విజయవంతంగా ముగిసిన సీఎం కప్'

- ప్రతిభ కనబరిచిన ఎంజేపీ గురుకులం విద్యార్థులు

నవతెలంగాణ-అశ్వారావుపేట



తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన వార్షికోత్సవం పురష్కరించుకుని చేపట్టిన విజయోత్సవాలలో భాగంగా యువజన క్రీడలు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఎం కప్ - 2024 పంచాయితీ స్థాయి టోర్నమెంట్ ఆదివారం విజవంతంగా ముగిసింది. గత రెండు రోజులుగా అశ్వారావుపేటలోని గుడ్ న్యూస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల క్రీడా ప్రాంగణంలో సీఎం కప్ - 2024 మండల స్థాయి బృందం పర్యవేక్షణలో అశ్వారావుపేట ఏజీహెచ్ఎస్ పీడీ సున్నం రామారావు సారధ్యంలో నిర్వహించారు. అశ్వారావుపేట గ్రామపంచాయతీ స్థాయిలో అశ్వారావుపేటలోని ఎంజేపీ బీసీ గురుకులం, జెడ్పీ హెచ్ఎస్ బాలురు, బాలికలు, ఏజీహెచ్ఎస్, టీఎంఆర్ఐఎస్(బాలికలు), గుడ్ న్యూస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ మొత్తం ఏడు పాఠశాలలు విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో, 100, 800, 1500 మీటర్లు పొరుగు పందెం, షాట్ పుట్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో క్రీడలు నిర్వహించారు. వాలీబాల్ క్రీడలో బాయ్స్, గర్ల్స్ రెండు విభాగాల్లో ఎంజేపీ బీసీ గురుకులం విద్యార్థులే ప్రథమ స్థానంలో నిలిచారు.ఈ క్రీడలను ఆయా పాఠశాలల పీడీ, పీఈటీలు సున్నం రామారావు, ఎం.పద్మజ, కే.సీతా కళ్యాణి, టి.వసంత, పి.ప్రమీల, ఎస్‌కే.షకీలాలు నిర్వహించారు.

గ్లోబల్ రెయిన్ బో స్కూల్‌కు ఎక్సలెన్స్ అవార్డు

- స్వీకరించిన కరస్పాండెంట్ మహ్మద్ ఎర్షాద్ అహ్మద్

నవతెలంగాణ-కూసుమంచి



నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకుగాను మండల కేంద్రంలోని గ్లోబల్ రెయిన్ బో పాఠశాలకు అరుదైన అవార్డు దక్కింది. ఆదివారం హైదరాబాద్ హైటెక్స్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో ఈటి టెక్ ఎక్స్ ట్రైల్ బ్లజర్ ఎక్సలెన్స్ అవార్డు 2024-25ను పాఠశాల కరస్పాడెంట్ మహ్మద్ ఎర్షాద్ అహ్మద్ అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతంలో కూడా కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్య అందేలా కృషి చేసినందుకుగాను అవార్డును ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. నర్సరి నుంచే ఆధునిక సాంకేతిక అందించి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారని కొనియాడారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నారని అభినందించారు. ఈ అవార్డు తమ పాఠశాల బోధనాస్థాయికి ప్రతిబింబమని తెలిపారు. సైన్స్ క్విజ్‌లు, కథా రచన, వ్యాసరచన పోటీ, నృత్య పోటీ, పాటల పోటీలు, ఒలంపియాడ్ పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థుల సృజనాత్మకతను పెద్ద పీట వేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఈ అవార్డు రావడం మరింత బాధ్యతను పెంచిందన్నారు. రాబోయే రోజుల్లో సీబీఎస్‌ఈ, ఫౌండేషన్ విద్యను అందించేందుకు అడుగులు వేస్తున్నట్లు పేర్కొన్నారు.

పొదెం వీరయ్య సుడిగాలి పర్యటన

నవతెలంగాణ-దుమ్ముగూడెం

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తెలంగాణ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పొదెం వీరయ్య ఆదివారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన పలువురిని పరామర్శించడంతో పాటు ఓనీల అలంకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై అనారోగ్యంతో ఇంటి వద్దనే ఉంటున్న రేగుబల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తోటమల్ల సంగీతరావు ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును అయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతారాంపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బుర్రి రమేష్ లావణ్య దంపతుల కుమార్తె పుష్పాలంకరణ వేడుకకు హాజరై చిన్నారి సృజనను ఆశీర్వదించారు. అనంతరం గత నాలుగు రోజుల క్రితం మృతి చెందిన లక్ష్మీనగరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కొడిమి మల్లీశ్వరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు వీరమాచినేని వినీల్, టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్స్ జిల్లా కన్వీనర్, కనుబుద్ది దేవా, సీనియర్ నాయకులు శిరపు అప్పలరెడ్డి, నటరాజ స్వామి, గడ్డం బాలాజీ, డింగి సందీప్‌రెడ్డి, తరుణ్ మిత్ర, వాసిరెడ్డి సాంబశివరావు, కొల్లాపూడి వరుణ్, శ్రీధర్, గద్ద వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మేమెంతో మాకంత వాటా కావాలి

- భద్రాచలం బీసీ సంఘాల ఐక్యవేదిక

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

మేమెంతో మాకంత వాటా కావాలని భద్రాచలం బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. ఆదివారం భద్రాచలం బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో 33 కులాల కన్వీనర్ల సమావేశం గోల్డ్ స్మిత్ కాలనీలోని వీరబ్రహ్మం కళ్యాణ మండపంలో బొలిశెట్టి రంగారావు అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా కోకన్వీనర్లు కడియం రామాచారి, తాళ్ల రవికుమార్, బండారు నాగేశ్వరావు మాట్లాడారు. 75 సంవత్సరాల నుండి బీసీలకు తీవ్రంగా అన్యాయం జరిగిందని, ఇప్పుడు బీసీలు చైతన్యం అయ్యారని, వచ్చే ఎన్నికల్లో బిసిలకు రాజకీయ పార్టీలు కనుక సరియైన ప్రాధాన్యత ఇవ్వని పార్టీలు కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ కులగనన అనంతరం బీసీల 50% రిజర్వేషన్ కల్పించాలని, మేమెంతో మాకంత వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్రం ప్రభుత్వం తీసుకు వచ్చిన ఈడబ్ల్యూఎస్ స్కీంను వెంటనే తొలిగిచాలని, దీనివల్ల బీసీ బిడ్డలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 33 కులాల సంఘం పెద్దలు పాలొగొన్నారు. రాబోయే రోజుల్లో బీసీ ఐక్యవేదిక బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ కమిటీ తీర్మానం చేసింది.

చదివిన ఊరికే అధికారిగా సేవలు

- పూర్వ విద్యార్థుల సన్మానం

నవతెలంగాణ-అశ్వారావుపేట



చదివిన పాఠశాలకే ఉపాధ్యాయుడిగా నో లేక స్వంత ఊరికే అధికారిగా నో ఉద్యోగిగా రావడంలో అనుభూతే వేరు. బాల్య స్నేహితులో లేక సహ విద్యార్థులే సహ ఉద్యోగులు అయితే పరమానందం మే. ప్రస్తుతం అశ్వారావుపేట కార్యదర్శిగా పని చేస్తున్న కోటమర్తి శ్రీరామ మూర్తి అశ్వారావుపేట జిల్లా పరిషత్ లోనే చదువుకున్నారు. ఈ పాఠశాల 1988 - 1989 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం అశ్వారావుపేటలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో కార్యదర్శిగా పని చేస్తున్న శ్రీరామ మూర్తికి సన్మానం చేసారు. ఈ కార్యక్రమంలో తన సహ విద్యార్థులలో ప్రస్తుతం పలు రంగాల్లో వివిధ హెూదాల్లో ఉన్న నరసింహారావు, మధు, శ్రీను, లక్ష్మయ్యలు పాల్గొన్నారు.

ఏడాదిలో రూ.90 వేల కోట్ల పెట్టుబడులు

ఎంఎస్ఎంఈ రంగం అభివృద్ధికి కొత్త పాలసీ తెచ్చాం | **టీ ఫైబర్‌తో మారుమూల ప్రాంతాలకూ ఇంటర్నెట్ సేవలు : ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు**



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టిన మొదటి ఏడాదిలో రూ.90 వేల కోట్ల పెట్టుబడులు సమీకరించిందని ఐటీ పరిశ్రమ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. ప్రజావిజయోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లోని పార్క్‌హయత్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలు కంపెనీలతో పెట్టుబడులకు సంబంధించిన ఎంవోయూలను కుదుర్చుకుంది. టీఫైబర్, మీ సేవ, టీ-వర్క్స్, టీజీన్యాబ్ అప్లికేషన్, అడెక్స్, ప్రాజెక్టు సన్మతి మొదలగు ఐటీ సేవలను ఈ సందర్భంగా ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో రూ.40 వేల కోట్లు, అమెరికా, దక్షిణకొరియా పర్యటనలో రూ.32 వేల కోట్లు, స్థానికంగా మరో రూ.19 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చారని చెప్పారు. దేశంలోని అనేక రాష్ట్రాల పోటీలను తట్టుకుని తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలను ఒప్పించామని పేర్కొన్నారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ మరిన్ని పరిశ్రమలను రాష్ట్రానికి రప్పించడం ద్వారా ఉపాధి, ఉద్యోగావకాశాలను సృష్టిస్తున్నామని చెప్పారు. పరిశ్రమలు పెట్టేందుకు వచ్చే వారికి అనుమతుల నుంచి మొదలుకుని రాయితీల వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధివిధానలతో ముందుకు పోతున్నామని పేర్కొన్నారు. గత సర్కార్ పదేండ్ల పాలనలో రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలు పీకల్లోతు కష్టాల్లో కొట్టుమిట్టాడాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాము అధికారం చేపట్టిన వెంటనే వాటి స్థితిగతులపై అధ్యయం చేసి దేశంలోనే మొదటి సారీగా కొత్త ఎమ్ఎస్ఎమ్ఈ పాలసీ తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. పదేండ్లుగా రాయితీలు అందక ఈ రంగానికి వివిధ సబ్సిడీల రూపంలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,000 కోట్లకు చేరుకున్నాయని చెప్పారు. వీటన్నింటిని దశల వారీగా చెల్లించేందుకు తమ సర్కార్ సిద్ధంగా ఉందని అన్నారు. టీఫైబర్ సేవల ద్వారా మారుమూల ప్రాంతాలకు సైతం తక్కువ ధరకే ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. దీని ద్వారా మొబైల్, కంప్యూటర్, టీవీ వినియోగించవచ్చని అన్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద పెద్దపల్లి జిల్లాలోని అడవి శ్రీరాంపూర్, సంగారెడ్డి జిల్లాలోని సంగుపేట, నారాయణపేట జిల్లాలోని మద్దూర్‌లో ఈ సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. వీటి పని తీరు ఆధారంగా మార్పులు, చేర్పులు చేసి త్వరలో రాష్ట్ర మంతా విస్తరిస్తామని పేర్కొన్నారు. అడవి శ్రీరాంపూర్, మద్దూర్ వాసులతో ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మీ సేవ ద్వారా కొత్తగా 150 రకాల పౌర సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నామని వివరించారు. వ్యవసాయ రంగానికి సేవలందించేందుకు అడెక్స్, మాదకద్రవ్యాలను నివారించేందుకు టీజీన్యాబ్ అప్లికేషన్, గ్రామీణ, అల్పాదాయ వర్గాల్లోని మహిళకు డిజిటల్‌పై అవగాహన పెంచేందుకు ప్రాజెక్టు సన్మతి యాప్‌లు ఎంతగానో ఉపయోగ పడుతాయని మంత్రి పేర్కొన్నారు.

నాలుగు కంపెనీలతో ఎంవోయూలు కొత్తగా 5,200 మందికి ఉద్యోగాలు

కొత్తగా నాలుగు ప్రముఖ కంపెనీలతో పెట్టుబడులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూలను కుదుర్చుకుంది. ఆజాద్ ఇంజినీరింగ్ కంపెనీ రూ.800 కోట్లు, ప్రీమియర్ ఎనర్జీస్ 1,950 కోట్లు, ప్రీమియర్ ఎనర్జీస్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ కంపెనీ సోలార్ రంగంలో రూ.3,342 కోట్లు, లెన్స్‌కార్ట్ సంస్థ రూ.1,500 కోట్లు మొత్తం రూ.7,592 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. వీటికి సంబంధించి ఆయా సంస్థల ప్రతినిధులు మంత్రి సమక్షంలో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేశ్‌రంజన్‌తో ఎంవోయూ కుదుర్చుకున్నారు. వీటి ద్వారా 5,200 మందికి ఉద్యోగ అవకాశాలు అందనున్నాయి. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్మెన్ నిర్మలా జగ్గారెడ్డి, పరిశ్రమల శాఖ కమిషనర్ డాక్టర్ మల్సూర్, టీజీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.వి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఆజాద్ ఇంజినీరింగ్, లెన్స్‌కార్ట్, ప్రీమియర్ ఎనర్జీస్ ప్రతినిధులు భూపతి రాజు, అమిత్ చౌదరి, రేవతి రోహిణి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అధోగతి

- కాంగ్రెస్ పాలనలో సమానంగా సంక్షేమం,అభివృద్ధి : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ- మరిపెడ

గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, వారు చేసిన రూ.7వేల కోట్ల పైచిలుకు అప్పులకు వడ్డీలు కడుతూ సంక్షేమాన్ని, అభివృద్ధిని జోడెడ్ల లెక్క సమానంగా నడుపుతూ ముందుకు తీసుకెళు తున్నామని రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం కేంద్రంలో అమృత్ పథకం కింద రూ.25.58కోట్ల అంచనాతో అభివృద్ధి కార్యక్రమాలు, కురవి మండలం కందికొండలో సుమారు రూ.125 కోట్లతో ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా పాఠశాలల భవన సముదాయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మరిపెడ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పండిన మొత్తం ధాన్యం కొనుగోలు చేస్తున్నదని అన్నారు. సన్న రకాలకు రూ.500 బోనస్‌తో పాటు రైతులకు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 24 గంటల్లోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నట్టు చెప్పారు. పేదవారి కలలను నెరవేర్చడానికి ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రవేశపెట్టి రూ.5లక్షల రుణ సదుపాయం కల్పిస్తున్నామని అన్నారు. అన్ని తరగతుల ప్రజలు కుల, మత భేదం లేకుండా ఒకే దగ్గర చదువుకునేలా కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. రైతు సంక్షేమం, మహిళా సాధికారికత, ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఉచిత బస్సు సర్వీసు, పేద విద్యార్థులకు భారం కాకుండా మెస్ చార్జీలు పెంచడం, క్షేత్రస్థాయిలో గ్రామీణ పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళినాయక్, జిల్లా పరిషత్ సీఈవో పురుషోత్తం, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, జిల్లా అధికారులు కిరణ్‌కుమార్, మరియన్న, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, హౌసింగ్, మెప్మా జయ శ్రీ, రెవెన్యూ డివిజన్ అధికారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీలో కేంద్రం బాధ్యతలను విస్మరించడం తగదు

- రైతు బిడ్డగా తెలంగాణ తల్లి విగ్రహం
- రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం : కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



నవతెలంగాణ-జగిత్యాలటౌన్

రైతులకు రుణమాఫీ చేసే విషయంలో ఒక రాష్ట్రానికే బాధ్యత ఉంటుందా.. కేంద్రానికి బాధ్యత లేదా అని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యూపీఏ హయాంలో కేంద్రమే బాధ్యత తీసుకుని రుణమాఫీ చేసిందని గుర్తుచేశారు. ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిర భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహం రాచరిక వ్యవస్థకు అద్దం పట్టేలా రూపొందించిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బిడ్డను పోలి ఉండేలా విగ్రహాన్ని రూపొందించినట్టు చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు విషయంలో బీఆర్ఎస్ విమర్శలు తగవన్నారు. తెలంగాణ తల్లి అనేది సామాన్యుల తల్లి, అన్ని వర్గాలకు అనుకూలంగా ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 200 యూనిట్ల ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం, రూ.500లకే సిలిండర్ పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. రైతులు పండించిన సన్న రకం వరికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇవ్వడం లేదన్నారు. మహిళా సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో అమలు చేస్తున్నామన్నారు. దేశంలో మీరెక్కడైనా అమలు చేస్తున్నారా అని బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాను ప్రశ్నించారు.

ప్రభుత్వాధికారులకు ఆమ్యామ్యాలు

(మొదటిపేజీ తరువాయి)

ఉండవని అనుకుంటాయని అవినీతి వ్యతిరేకత అంశంపై మాట్లాడుతూ డెలాయిట్ ఇండియా పార్ట్నర్ ఆకాశ్ శర్మ అన్నారు. బలమైన అవినీతి-వ్యతిరేక కార్యక్రమాన్ని ఆయన సూచించారు.

అవినీతి అంతం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీన వైఖరి కొందరు అధికారులకు ఆయుధంగా మారుతున్నదని మేధావులు, సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవినీతి వ్యతిరేకంగా పలు చట్టాలు, సంస్థలు వంటి వ్యవస్థ ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో బలంగా పని చేయకపోవటం కారణంగానే ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని అంటున్నారు. ఇకనైనా ప్రభుత్వాలు స్పందించి, అవినీతిపై రాజీలేని పోరాటం చేయాలని వారు సూచిస్తున్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి

- తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యశాఖలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న డాక్టర్లతో పాటు ఈఎస్ఐ డాక్టర్ల డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం కోరింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని కోఠిలో ఆ సంఘం మొదటి జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షులు డాక్టర్ నరహరి, సెక్రెటరీ జనరల్ డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ రవూఫ్‌తో పాటు వివిధ జిల్లాల నుంచి వంది మంది నాయకులు హాజరయ్యారు. రిమోట్ గ్రామీణ ప్రాంతాల్లోని మెడికల్ కాలేజీల అలవెన్స్, 142 జీవో సవరణ, టీవీవీపీ ని డైరెక్టర్ ఆఫ్ సెకెండరీ హెల్త్ సర్వీసెస్‌గా మార్పు, ఈఎస్ఐ డైరెక్టర్‌గా డాక్టర్‌ను నియమించడం తదితర డిమాండ్లపై సమావేశంలో చర్చించి తీర్మానించారు. ఈ డిమాండ్లతో వచ్చే వారం వైద్యారోగ్యశాఖ కార్యదర్శిని కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్టు నాయకులు తెలిపారు.

ఉక్రెయిన్‌కు అమెరికా నుంచి డాలర్ల వరద

- సాయాన్ని వేగవంతం చేసిన బైడెన్ సర్కారు
- ట్రంప్ అధికారంలోకి రావటానికి ముందు కీలక పరిణామం



వాషింగ్టన్ : అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ ఉక్రెయిన్‌కు సాయాన్ని వేగవంతం చేశారు. ఆ దేశానికి మళ్లీ డాలర్ల వరదను పారించారు. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారం చేసే రోజు దగ్గరపడే కొద్దీ.. బైడెన్ సర్కారు ఉక్రెయిన్‌కు సాయాన్ని వేగవంతం చేస్తుండటం గమనార్హం. తాజాగా ఉక్రెయిన్‌కు దీర్ఘకాలంలో దాదాపు బిలియన్ డాలర్లు (రూ.8.4వేల కోట్లు) సాయం చేస్తామని అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ ప్రకటించారు. ఇప్పటికే దేశ కాంగ్రెస్ ఆమెదముద్ర వేసిన ప్యాకేజీల మొత్తాన్ని ట్రంప్ కార్యవర్గం అధికారం చేపట్టకముందే.. కీవ్‌కు అందజేసేందుకు తొందరపడుతోంది. "త్వరలోనే ఈ బాధ్యత కొత్త ప్రభుత్వం చేతికి వెళ్తుంది. వారే ఈ యుద్ధం ఏ మార్గంలో వెళ్లాలో నిర్ణయిస్తారు. మేము కొన్నేండ్లుగా వేసిన బలమైన పునాదిపై వారూ ముందుకెళతారని ఆశిస్తున్నాను" అని లాయిడ్ ఆస్టిన్ వివరించారు. ఈ తాజా ప్యాకేజీల్లో డ్రోన్లు, హిమార్స్ రాకెట్ వ్యవస్థల్లో వాడే మందుగుండు సామగ్రి వంటివి ఉన్నాయి. ప్రస్తుతం ఉక్రెయిన్ యుద్ధం ఉన్న దశను బట్టి వీటి అవసరం చాలా ఉందని నిపుణులు చెబుతున్నారు. ఉక్రెయిన్ సెక్యూరిటీ అసిస్టెన్స్ ఇనీషియేటివ్ కార్యక్రమం కింద వీటిని అందిస్తున్నారు.

భవిష్యత్తులో యుద్ధాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ ఆయుధ సామగ్రి అందజేస్తున్నామని అమెరికా వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే 725 మిలియన్ డాలర్ల ప్యాకేజీని ఇటీవలే ప్రకటించారు. తాజాగా దానికి అదనంగా 988 మిలియన్ డాలర్ల సామగ్రిని ఇస్తామని బైడెన్ కార్యవర్గం ఉక్రెయిన్‌కు హామీ ఇచ్చింది. అమెరికా నుంచి కీవ్‌కు 2022 నుంచి ఇప్పటి వరకు 62 బిలియన్ డాలర్లు ఆయుధాలు, ఇతర సాయం అందించారు. ఇటీవల కాలంలో ఉక్రెయిన్‌పై రష్యా దాడులను గణనీయంగా పెంచంది. దీనికి తోడు ఉత్తర కొరియా దళాలు కూడా వచ్చి పోరాడటం మొదలు పెట్టాయి. అమెరికా మిత్ర దేశమైన డెన్మార్క్ ఇప్పటికే ఉక్రెయిన్‌కు రెండో విడత సాయం కింద ఎఫ్-16 యుద్ధ విమానాలను ఇటీవలే అందించింది.

వీటి సాయంతో తాము రష్యా క్షిపణులను కూలుస్తున్నట్టు జెలెన్‌స్కీ కూడా ధ్రువీకరించారు. రెండేండ్ల నుంచి జరుగుతున్న భీకర యుద్ధంలో నాటో కూటమి ఉక్రెయిన్‌కు అండగా నిలిచింది. ఇటీవల రష్యా భూభాగంలో దాడులకు వీలుగా దీర్ఘశ్రేణి ఆయుధాల వినియోగానికి కూడా అమెరికా నుంచి కీవ్‌కు అనుమతులు లభించాయి.

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తరలిరండి

- టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి భారీ ఎత్తున తరలి రావాలని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ నుంచి ఆయన పార్టీ నాయకులతో ఆయన జూమ్‌లో మాట్లాడారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉందని తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మెన్లలతో ఆయన మాట్లాడారు. ఏడాదిలో కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో మంచి స్పందన ఉందన్నారు. మెజార్టీ ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. ఏడాది పాలనపై ప్రభుత్వం నిర్వహిస్తున్న సభలకు ప్రజలు లక్షలాదిగా తరలి వచ్చారని అన్నారు. సోమవారం జరిగే ముగింపు ఉత్సవాల్లో భాగంగా సచివాలయం వద్ద సాయంత్రం నాలుగు గంటలకు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని కోరారు.

విగ్రహ రూపశిల్పి రమణారెడ్డికి అభినందనలు

రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఆవిష్కరించనున్న తెలంగాణ తల్లి విగ్రహం, తెలంగాణ అమరవీరుల జ్యోతి రూపశిల్పి రమణారెడ్డిని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అభినందించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు. తెలంగాణ తల్లి విగ్రహంలో అమరవీరుల పిడికిళ్లను జోడించడం స్పూర్తిదాయకమని కొనియాడారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- రాజ్యాంగ, మౌలిక విధానం, లౌకికతత్వాన్ని కాపాడాలి : టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభల్లో ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, రాజ్యాంగ, మౌలిక విధానం, లౌకికతత్వాన్ని కాపాడాలని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అన్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ప్రారంభమైన టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఆరో మహాసభల్లో నాగేశ్వర్ పాల్గొని మాట్లాడారు. ఈ దేశ ఐక్యతను, ప్రతిష్టతను, అభివృద్ధిని చాటే భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలైన లౌకికవాదం, సామ్యవాదం.. అంశాలను తొలగించాలని ఆలోచనలు చేయడం అభివృద్ధి నిరోధకాలే అవుతాయన్నారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 వసంతాలు గడిచిన సందర్భంగా ఇటీవలే సుప్రీంకోర్టు తీర్పు భారత రాజ్యాంగ మౌలిక లక్షణాలైనా లౌకికవాదం, సామ్యవాదం తొలగించాలనే ఆలోచన చేయడం సరైంది కాదని, వాటి మీద చర్చను కూడా జరపాల్సిన అవసరం లేదని తోసిపుచ్చిందని గుర్తు చేశారు. భారత రాజ్యాంగం కొన్ని మౌలిక అంశాల ఆధారంగా నిర్మించబడిందని తెలిపారు. పార్లమెంటుకు రాజ్యాంగాన్ని మార్చే అధికారం ఉందా.. అనే వాదనకు ఆయన రాజ్యాంగం మార్చే అధికారం లేదని, రాజ్యాంగంకు లోబడే పని చేయాలన్నారు. భారతదేశం వివిధ మత విశ్వాసాలతో కూడినదని, మత విశ్వాసాన్ని రాజ్యానికి రుద్దొద్దని హితవుపలికారు. ఎవరి మతం వారు స్వేచ్ఛగా విశ్వసించవచ్చని, ఇతర మతంపై పెత్తనం చెలాయించే హక్కు ఎవరికీ లేదన్నారు. ఆర్టికల్ 14 ప్రకారం పౌరులందరూ సమానులే అని ప్రాథమిక హక్కుగా చేర్చాలన్నారు. సోషలిస్టులుగా ఉండాలా క్యాపిటలిస్టులుగా ఉండాలా అనేది ప్రజలు నిర్ణయిస్తారని అంబేద్కర్ అన్నట్టు చెప్పారు. ఉపాధ్యాయులు పుస్తక పఠనానికి దూరం కాకూడదని, నిత్యం నిత్య విద్యార్థులుగా అధ్యయనం పెంపొందించుకోవాలని తెలిపారు. భారత దేశ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని, కాబట్టి ఆ గురుతర బాధ్యత నిర్వర్తించడానికి టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయులను ముందుండి నడిపిస్తోందని, ఆ సంఘం బాటలో నడవాలని ఉపాధ్యాయులకు సూచన చేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కే.జంగయ్య తదితరులు పాల్గొని మాట్లాడారు.

హక్కులతో పాటు బాధ్యతల కోసం పరిశ్రమించాలి

- రేపటి భారతావనిలో నైతిక విలువలు పెంచాలి : సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హక్కులతో పాటు బాధ్యతల కోసం పరిశ్రమించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఎస్‌టీయూటీఎస్ 78వ వార్షిక కౌన్సిల్ సమావేశాలు పర్వతరెడ్డి అధ్యక్షతన జరిగాయి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపటి భావి భారతావనిలో నైతిక విలువలు పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. ఉపాధ్యాయులకు హక్కులతో పాటు ప్రశ్నించే తత్వాన్ని సామాజిక కోణాన్ని అలవాటు చేయడం మంచి పరిణామమన్నారు. నిర్మాణాత్మక ప్రతిపక్షంగా కొనసాగడం, క్షేత్రస్థాయిలో అసంబద్ధతలను విధానాలను సలహాలను సూచనలను ప్రభుత్వానికి నివేదించడం అభినందనీయమన్నారు. రాజ్యాంగ విలువల కోసం పరిశ్రమించే వారికి అన్ని రకాల మద్దతు లభిస్తుందని హామీ ఇస్తూ ఇటీవల విద్యార్థులు ఉపాధ్యాయులపై దాడి చేయడం బాధాకరమన్నారు. అలాంటి పరిస్థితులు తలెత్తకుండా రేపటి తరానికి నైతిక విలువలను పెంపొందించాలని సూచించారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగం, ఉపాధ్యాయుల పట్ల సానుకూలంగా ఉండడం శుభసూచకమన్నారు. సమస్యల పరిష్కారంలో తమ వంతు సహకారం ఉంటుందని తెలిపారు. సంఘం పూర్వ అధ్యక్షులు ఏపీ మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ బలపరిచిన, జాక్టో ఉమ్మడి ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థి పూల రవీందర్,ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్, ఎస్‌టీయూ ఏపీ అధ్యక్షులు సాయిశ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

- గజ్వేల్, అశ్వారావుపేటలో ఘటనలు
- బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యేలు



నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్/ అశ్వారావుపేట

సిద్దిపేట జిల్లా గజ్వేల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ రూరల్ మండలంలోని రాయపోల్, దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లలో కానిస్టేబుళ్లగా విధులు నిర్వహిస్తున్న వర్కల్ పరంధాములు(46), పూసల వెంకటేష్(38) ఇద్దరూ కలిసి రాయపోల్ నుంచి హైదరాబాద్ ఈసీఐఎల్‌లో రన్నింగ్ మారథాన్‌కు ఆదివారం తెల్లవారుజామున బైక్‌పై బయలుదేరారు. అయితే గజ్వేల్ పట్టణ సమీపంలోని జాలిగామ బైపాస్ రోడ్డుకు వచ్చే సమయానికి గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి బలంగా ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాలను గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఈ ప్రమాదం గురించి గజ్వేల్ సీఐ సైదా జిల్లా పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దాంతో ఎస్పీ డాక్టర్ అనురాధ, అడిషనల్ డీసీపీ యస్.మల్లారెడ్డి, సిద్దిపేట ఏసీపీ మధు గజ్వేల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సైదా, దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మార్చురీలో ఉన్న మృతదేహాలపై పుష్పగుచ్ఛాలు వేసి నివాళు లర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి.. తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డిపార్ట్‌మెంట్ తరపున రావాల్సిన అన్ని బెనిఫిట్స్ త్వరలోనే కుటుంబ సభ్యులకు అందజేస్తామన్నారు.

తక్షణ ఖర్చుల కోసం ప్రభుత్వం తరపున ఇరు కుటుంబాలకు కలిసి రూ.60 వేలు అందజేశారు. అదే విధంగా, మృతుల స్నేహితులు, అధికారులు, సన్నిహితులు పలువురు వారి మృతదేహాలను సందర్శించి పుష్పగుచ్ఛాలు వేసి నివాళులర్పించారు. పలు సామాజిక సేవ కార్యక్రమాల్లో వీరిద్దరూ ముందుండేవారని వారు కొనియాడారు. కాగా, ఘటన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు.. వారి మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ వారి కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు.

అశ్వారావుపేటలో ఇద్దరు మృతి

ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని లారీ వేగంగా ఢీ కొట్టడంతో వాహనంపై ఉన్న ముగ్గురు కిందపడ్డారు. వారిలో ఇద్దరు మృతిచెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఆంధ్రప్రదేశ్, ఏలూరు జిల్లా, జీలుగుమిల్లి మండలం పి.అంకంపాలెం (నారాయణపురం)కు చెందిన పేరాబత్తుల మనోజ్ (27) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మారెప్ప గూడెంలో కౌలు పద్ధతిలో వేరుశనగ సాగు చేస్తున్నారు. వ్యవసాయ పనుల కోసం తన స్వగ్రామానికి చెందిన మొగిటి వీరభద్రంతో పాటు అశ్వారావుపేట మండలం పాపిడిగూడెంకు చెందిన బద్దే వెంకటేశ్వరరావు(57)ను తీసుకుని ద్విచక్ర వాహనంపై ఆదివారం బయలుదేరాడు. వీరు ముగ్గురు ద్విచక్ర వాహనం ప్రయాణిస్తూ నారంవారిగూడెం కాలనీ సమీపంలోకి రాగానే లారీ ద్విచక్ర వాహనాన్ని అతి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మనోజ్, వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందారు.

వీరభద్రం తీవ్రంగా గాయపడటంతో సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఘటనాస్థలికి చేరుకున్న ఎస్ఐ యయాతి రాజు మృతదేహాలను పంచనామా నిమిత్తం మార్చురీకి తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా, లారీ డ్రైవర్ గోళ్ళ సైదులు మద్యం మత్తులో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. మృతుడు మనోజ్ తండ్రి రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కాగా, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బాధిత కుటుంబ సభ్యులు వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు.

అధ్యక్షా..!

(మొదటిపేజీ తరువాయి)

నేతృత్వంలోని సబ్‌కమిటీ సిఫార్సులనూ పరిశీలించి, ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు. అన్నింటికీ ప్రజాపాలన విజయోత్సవాలే ప్రధాన అవరోధంగా ఉండటం, జిల్లాలు సహా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం అంతా అవే పనుల్లో నిమగ్నమై ఉండటంతో అసెంబ్లీ సమావేశాలను ప్రారంభించి, మళ్లీ వారం తర్వాత పూర్తిస్థాయి చర్చలు జరపాలని ప్రభుత్వం భావిస్తున్నది. స్పీకర్, మండలి చైర్మెన్ల సంయుక్త సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్ తదితర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు.

ఇదీ తొలిరోజు ఎజెండా

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అసెంబ్లీ సమావేశాల ప్రారంభ తొలిరోజు రాష్ట్ర ప్రభుత్వం ఐదు ఆర్డినెన్సుల్ని సభలో ప్రవేశపెట్టనుంది. 2024 తెలంగాణ జీతాలు, ఫించను చెల్లింపు, అనర్హతల తొలగింపు (సవరణ) ఆర్డినెన్స్, పురపాలక సంఘాల (సవరణ) ఆర్డినెన్స్, హైదరాబాద్ మహానగరపాలక సంస్థ (సవరణ) ఆర్డినెన్స్, వస్తుసేవల పన్ను ఆర్డినెన్స్, పంచాయతీరాజ్ (సవరణ) ఆర్డినెన్సుల్ని శాసనసభలో ప్రవేశపెడతారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క 2022-23 ఆర్థిక సంవత్సర తెలంగాణ విద్యుత్ ఆర్థిక సంస్థ 9వ వార్షిక నివేదిక ప్రతిని సభలో ప్రవేశపెడతారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి సభలో ప్రకటన చేస్తారని శాసనమండలి కార్యదర్శి డాక్టర్ వీ నర్సింహాచార్యులు తెలిపారు.

చట్టవిరుద్ధంగా ఫిజిషియన్ శాంపిళ్ల నిల్వ

- క్రాంతి మెడికల్ అండ్ జనరల్ స్టోర్‌లో తనిఖీలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డ్రగ్ కంట్రోల్ అధికారులు చేసిన దాడుల్లో అనేక అక్రమాలు బయటపడుతున్నాయి. హన్మకొండ జిల్లా, వేలేర్ మండలం, వేలేర్ గ్రామంలోని క్రాంతి మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్‌పై చేసిన దాడిలో పెద్ద మొత్తంలో ఫిజిషియన్ శాంపిళ్లను పట్టుకున్నారు. వీటితో పాటు కాలం చెల్లిన మందులను కూడా డీసీఏ అధికారులు సీజ్ చేశారు. వీటి విలువ రూ.ఒక లక్ష వరకు ఉంటుంది. విశ్వసనీయ సమాచారం మేరకు అధికారులు చేసిన ఈ దాడిలో ఉచితంగా డాక్టర్లు ఇవ్వాల్సిన ఫిజిషియన్ శాంపిళ్లు కూడా ఉన్నాయి.

గుమ్మడి గింజలతో...

తరచూ గుమ్మడి గింజలు తీసుకుంటే.. అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. గుమ్మడి గింజల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. అధిక బరువుతో బాధపడేవారు గుమ్మడి గింజలు తింటే.. మేలు జరుగుతుంది.

క్యాన్సర్‌కు చెక్..

గుమ్మడి గింజల్లోని కెరొటినాయిడ్లు, విటమిన్ ఇ వంటి యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షిస్తాయి. గుమ్మడి గింజలు తరచుగా తీసుకుంటే.. గ్యాస్ట్రిక్, ప్రోస్టేట్, బ్రెస్ట్, లంగ్, పేగు కేన్సర్ల నుంచి రక్షణ లభిస్తుంది. మహిళలు గుమ్మడికాయ విత్తనాలను తరచుగా తీసుకుంటే బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయి. నెలసరి నిలిచిన మహిళల్లో రొమ్ము క్యాన్సర్ ముప్పు తగ్గటానికీ గుమ్మడి గింజలు తోడ్పడుతున్నట్టు కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.

షుగర్ కంట్రోల్‌లో ఉంటుంది..

షుగర్ పేషెంట్స్‌కు గుమ్మడి గింజలు మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. గుమ్మడి గింజల్లో యాంటీడయాబెటిక్ లక్షణాలు ఉన్నాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని కంట్రోల్‌లో ఉంచుతాయి. గుమ్మడికాయ విత్తనాలలో ట్రిగోనిలైన్, నికోటినిక్ యాసిడ్, డి-కైరో-ఐనాసిటాల్ అనే సమ్మేళనాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని కంట్రోల్‌లో ఉంచుతాయి.

జుట్టు స్ట్రాంగ్‌గా ఉంటుంది..

రోజూ చెంచా గుమ్మడి విత్తనాలను తీసుకుంటే జుట్టు దృఢంగా ఉంటుంది. గుమ్మడి గింజల్లోని సెలెనియం, మెగ్నీషియం, ఐరన్, కాల్షియం, కాపర్, ఏ, బీ, సీ విటమిన్లు జుట్టు కుదుళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇవి తింటే చుండ్రు సమస్య కూడా రాదు.

పని చేసే చోట ఇలా...

ప్రతి మనిషిలోనూ పాజిటివ్, నెగెటివ్... ఇలా రెండు రకాల భావోద్వేగాలుంటాయి. అయితే పాజిటివ్ ఎమోషన్స్ వల్ల ఎలాంటి సమస్యలూ తలెత్తకపోయినా, నెగెటివ్ ఎమోషన్స్ మాత్రం మనల్ని మానసికంగా కుంగదీస్తాయి. మహిళలకు ఈ సమస్య మరీ ఎక్కువ. ముఖ్యంగా పని చేసే చోట ఇలాంటి భావోద్వేగాలు అస్సలు ప్రదర్శించకూడదంటున్నారు నిపుణులు. లేదంటే వాటి ప్రభావం మన కెరీర్‌పై పడే అవకాశాలున్నాయంటున్నారు. అవేంటో తెలుసుకుందాం...



అబ్బబ్బా... ఎంత చేసినా ఈ పని మాత్రం అయిపోవట్లేదు. దీనికి తోడు ఎవరైనా రాకపోతే వారి పనీ నేనే చేయాలి అంటూ కోపం తెచ్చుకుంటుంటారు కొంతమంది. అయితే దీనివల్ల నిరాశానిస్పృహలు అవహించడం తప్ప మరే ప్రయోజనమూ ఉండదు. ఇక ఆ సమయంలో ఎవరు మాట్లాడించినా ఆ కోపాన్నంతా వారిపై చూపిస్తుంటారు. ఇలాంటి ధోరణి పని చేస చోట అస్సలు మంచిది కాదంటున్నారు నిపుణులు. ఇలా చేయడం వల్ల ఇటు మీ పనీ పూర్తి కాదు... అటు ఇతరులతోనూ అభిప్రాయభేదాలు ఏర్పడతాయి. కాబట్టి పని భారం ఎక్కువగా ఉన్నప్పుడు కోపం తెచ్చుకోకుండా శాంతంగా ఆలోచించాలి. ఈరోజే కచ్చితంగా పూర్తి చేయాల్సిన పనులేంటో చూసుకొని మీకున్న సమయంలోనే వాటిని పూర్తి చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఆ తర్వాత సమయం ఉంటే మిగతా పనులు చేయడం, లేదంటే వాటిని మరుసటి రోజు పూర్తి చేయడం... ఇలాంటి చిన్న చిన్న ప్రత్యామ్నాయ మార్గాల్ని అనుసరిస్తే పని ఎక్కువగా ఉందన్న చికాకు మీపై పడకుండా ఉంటుంది.

బాధపడుతున్నారా..?

మంచి మంచి ఉద్యోగాలు చేస్తూ ఉన్నత స్థానాల్లో కొనసాగుతున్న వారికి కూడా ఇటు వృత్తిపరంగా, అటు వ్యక్తిగతంగా ఎన్నో సమస్యలుంటాయి. అయితే కొందరు ఈ రెండింటినీ సమన్వయం చేసుకోలేక సతమతమవుతుంటారు.







ఈ భావోద్వేగాల్ని అదుపు చేసుకోలేక అక్కడే ఏడ్చేస్తుంటారు. కానీ ఇలా సహోద్యోగుల ముందు, పై అధికారుల ముందు ఏడవడం వల్ల వారికి మీరు చులకనయ్యే అవకాశముంది. కాబట్టి సమస్య ఏదైనా భావోద్వేగాల్ని అదుపు చేసుకోవడం, వాటి ప్రభావం మీరు చేసే పనిపై పడకుండా చూసుకోవడం ఉత్తమం. మరీ అంతలా బాధనిపిస్తే మీకు కాస్త క్లోజ్‌గా ఉన్న సహోద్యోగులతో లేదంటే మీ కుటుంబ సభ్యులతో పంచుకొని దాని పరిష్కారం కోసం వారి సహాయం తీసుకోవడంలో తప్పు లేదు.

ఈర్ష్యాద్వేషాలకు దూరంగా...

ఆఫీసన్నాక అందరు ఉద్యోగులూ ఒకే రకంగా పని చేయాలని, అందరి ఆలోచనలూ ఒకే తరహాలో ఉండాలని రూలేం లేదు. కొందరికి పని విషయంలో ఉత్తమమైన ఆలోచనలు రావొచ్చు. దాంతో వారు పై అధికారుల మెప్పు పొందవచ్చు. మరికొందరు తటస్థంగానే ఉండచ్చు. అయితే ఇలా సహోద్యోగుల్ని ప్రశంసించేటప్పుడు కొందరు వారిపై అసూయ పడుతుంటారు. 'అబ్బా... ఆ మాత్రం పనికే పొగడాలా..' అంటూ వారిపై ఈర్ష్యాద్వేషాలు పెంచుకుంటుంటారు. కానీ ఇలాంటి వాటి వల్ల ఇతరులకు మీపై చెడు అభిప్రాయం కలగడం తప్ప మరే ప్రయోజనాలు ఉండదు. కాబట్టి సహోద్యోగుల విషయంలో ఇలా ఆలోచించడం మాని.. మీకు తెలియని విషయాలు వారి నుంచి తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. ఉద్యోగులందరితో స్నేహపూర్వకంగా మెలుగుతూ వారి విజయాన్ని మనస్ఫూర్తిగా అభినందించడం నేర్చుకోవాలి.

మనసు పాడుచేసుకోవద్దు

పై అధికారులు అప్పగించిన పనిని సరైన సమయంలో పూర్తి చేయకపోయినా, పని చేయడానికి పెట్టుకున్న డెడ్‌లైన్లో అది పూర్తవ్వకపోయినా, అందులో తప్పులున్నా చాలా మంది ఉద్యోగుల మనసుల్లో అపరాధ భావం మెదులుతుంటుంది. అయితే దీని ప్రభావం ఆ తర్వాత మనం చేసే పనులపై పడడంతో పాటు... అది మన మనసునూ కుంగదీస్తుంది. కాబట్టి మీలో ఉన్న అపరాధ భావాన్ని వెంటనే తొలగించడం మంచిది. ఇందుకోసం పదే పదే దాని గురించి ఆలోచించి మనసు పాడుచేసుకోవడం కాకుండా అనుకున్న సమయంలో పని పూర్తిచేయలేకపోవడానికి గల కారణాలేంటో తెలుసుకొని వాటిని పునరావృతం కాకుండా చూసుకోవాలి. తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా చెక్ చేసుకోవాలి. ఫలితంగా మరోసారి ఈ భావన మనసులోకి రాకుండా పనిపై పూర్తి ఏకాగ్రత నిలిపి దాన్ని శ్రద్ధగా చేయగలుగుతాం.

అభద్రతా భావం వద్దు

కొత్తగా ఉద్యోగంలో చేరినా, అందులో కొన్నేండ్ల అనుభవం గడించినా కొందరికి వారు చేసే ఉద్యోగం పట్ల అభద్రతా భావం ఉంటుంది. పని విషయంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ కాకపోవడం, ప్రతి విషయంలోనూ ఇతరులతో పోల్చుకోవడం... వల్ల ఈ సమస్య వస్తుంది. తద్వారా మీపై మరింత ఒత్తిడి పడి, చేస్తున్న పని కూడా సరిగ్గా చేయలేరు. కాబట్టి పని విషయంలో అప్‌డేట్‌గా ఉండడం, పోల్చుకోవడం మాని మీకు తెలియని విషయాలను సహోద్యోగులను అడిగి తెలుసుకోవడం వల్ల అభద్రత మీ దరి చేరకుండా జాగ్రత్తపడొచ్చు. అలాగే కెరీర్‌లోనూ రాణించవచ్చు.

కలిసి మెలిసి ఉండండి

కొంతమంది మన పనేదో మనది ఇతరులతో అవసరం లేదన్నట్టుగా వ్యవహరిస్తుంటారు. కానీ కొన్ని పనులకు ఇతరుల సహాయం అవసర ఉన్నా, లేకపోయినా... మరికొన్ని పనులు బృందంతో కలిసి చేయాల్సి వస్తుంది. ఇలాంటప్పుడు సహోద్యోగులతో సులభంగా కలిసిపోతేనే పనులు విజయవంతంగా పూర్తవుతాయి. కాబట్టి అందరితో కలిసిపోతూ మీకు సందేహం ఉన్న విషయాల్లో సహోద్యోగుల సలహాలు తీసుకోవడం మంచిది. తద్వారా వాళ్లతో చెలిమి పెరుగుతుంది. మీకూ మనసు ప్రశాంతంగా ఉంటుంది. సకాలంలో పనులు పూర్తి చేయగలుగుతారు.

ఇంటి గోడలపై మరకలు పోవడం లేదా?

ఇంటి గోడలపై మరకలు పడితే వదిలించడం కాస్త కష్టమే. కొన్నిసార్లు అయితే వీటిని తొగించడానికి ఎంతో కష్టపడాలి, అయినా సరిగ్గా వదలవు, కొన్ని సార్లు గోడ రంగు కూడా ఊడిపోతూ ఉంటుంది.కొన్నిసార్లు ఈ మరకలు పోవాలంటే మళ్లీ పెయింటింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ మరకలు పడ్డప్పుడల్లా పేయింటింగ్ వేయలేం కదా.ఇది ఖర్చుతో కూడుకున్న పని. అలాంటప్పుడు ఖర్చులేకుండా సింపుల్ చిట్కాలతో మరకల్ని పోగొట్టి కొత్త ఇంటిలా మెరిసేలా చేయొచ్చు. అదేలాగో ఇప్పుడు చూద్దాం.



హైడ్రోజన్ పెరాక్సైడ్‌తో ఎలాంటి మొండి మరకల్ని కూడా ఈజీగా పోగొట్టొచ్చు. దీనికోసం ఏం చేయాలంటే..

- హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను బేకింగ్ సోడాతో 1: 1 నిష్పత్తిలో కలపండి. ఈ మిశ్రమాన్ని స్పాంజ్ లేదా మైక్రోఫైబర్ క్లాత్‌ని ఉపయోగించి గోడలపై అప్లై చేసి కాసేపు అలాగే వదిలేయండి. కాసేపటి తర్వాత తడి గుడ్డతో తుడిస్తే గోడలపై ఎలాంటి మరకలైనా పోతాయి.
- బేకింగ్ సోడా స్క్రబ్బింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది.పెరాక్సైడ్ బ్లీచింగ్‌లా పనిచేసి మరకల్ని సులభంగా పోగొడుతుంది. ఒకవేళ గోడలపై మరకలు లేకపోయినా ఈ కెమి కల్‌ను స్ప్రే చేస్తే దుమ్ము, దూళి క్షణాల్లో వదలగొడుతుంది.

మాపై చార్జిషీట్ కాదు

(మొదటిపేజీ తరువాయి)

ఫోన్లను టాప్ చేయటం, డబ్బు మూటలు పట్టుకొచ్చిన వారిని తప్ప ఎవరినీ కలవకపోవడం, ప్రజలు నోరు తెరవకుండా ధర్నా చౌక్‌లను ఎత్తేయడం, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులను కలవకపోవడం, భారత రాజ్యాంగం ప్రకారం సంక్రమించిన స్వేచ్ఛను హరించివేయటం, ప్రశ్నించిన ప్రతీవాడినీ బెదిరించటం... పదేండ్ల కేసీఆర్ పాలనలో జరిగింది ఇదే...' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమది తుగ్లక్ పాలన అంటూ బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారనీ, నిత్యం సచివాలయానికి వస్తూ, ప్రజలతో మమేకమవుతున్న తమది తుగ్లక్ పాలనా? లేక పదేండ్లపాటు ఫామ్‌హౌస్ నుంచి పరిపాలన సాగించిన కేసీఆర్‌ది తుగ్లక్ పాలనా? చెప్పాలంటూ సూటిగా ప్రశ్నించారు. ఎర్రవెల్లిని రాజధానిగా చేసుకుని, ఫాంహౌస్‌ను సెక్రటేరియట్‌గా చేసుకుని ఎవరి మాటా వినకుండా రాష్ట్రాన్ని తన ఇష్టం వచ్చినట్టు పాలించిన కేసీఆర్‌ది తుగ్లక్ పాలన కాదా? అంటూ నిలదీశారు. ఆయన భారతదేశంలో ఓ మోడ్రన్ తుగ్లక్ అంటూ ఎద్దేవా చేశారు. ఆ టైటిల్‌కు కేసీఆర్ తప్ప మరో యాభై ఏండ్ల వరకూ ఎవరూ పోటీపడబోరంటూ విమర్శలు గుప్పించారు. హరీశ్‌రావు విడుదల చేసిన చార్జిషీట్...'దొంగే.. దొంగా..దొంగా...' అని అరిచినట్టుగా ఉందని దుయ్యబట్టారు.

నిలదీద్దాం

(మొదటిపేజీ తరువాయి)

శాసనసభ, శాసన మండలిలో పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వం కలసి రాకపోతే అర్జెంటు మోషన్ ఇచ్చి అయినా.. చర్చలకు పట్టు పడుతామని తెలిపారు.



అసెంబ్లీ సమావేశాలకు మూడంచెల బందోబస్తు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలకు మూడంచెల బందోబస్తును పోలీసు అధికారులు ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దాదాపు రెండు వేల మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లను చేశారు. అసెంబ్లీ ప్రధాన గేట్ల వద్ద ఏర్పాటు చేసిన బారీకేడ్ల వద్ద అడుగడుగునా సాయుధ పోలీసులను ఏర్పాటు చేయటమేగాక లోనికి వచ్చే ప్రతి ఒక్కరినీ వాహనాలతో సహా సోదా చేసి మరీ లోపలికి వదిలేలా భద్రతా సిబ్బందికి ఆదేశాలు అందాయి. అలాగే, అసెంబ్లీ లాబీలో సివిల్ దుస్తుల్లో పరిసరాలపై కన్నేసి ఉంచేలా సిబ్బందిని నియమించారు. అసెంబ్లీ ప్రధాన గేటు మొదలుకొని లాబీలోకి ప్రవేశించే మార్గాల వద్ద మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేసి సీసీ కెమెరాలతో పరిసరాలపై దృష్టిని వేసి ఉంచేలా చర్యలు తీసుకున్నారు. మరోవైపు, అసెంబ్లీ వెలుపల కిలోమీటర్ దూరం వరకు ఎలాంటి సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించకుండా నిషేదాజ్ఞలను విధించారు. అలాగే, అసెంబ్లీ వైపునకు వచ్చే ప్రధాన కూడళ్ల వద్ద సాయుధ పోలీసులతో పాటు అశ్వికదళాలను కూడా బందోబస్తులో వినియోగించారు. అసెంబ్లీలోకి పాసులు లేకుండా ఏ ఒక్కరినీ అనుమతించరాదని నగర పోలీసు కమిషనర్ సివి ఆనంద్ ఆదేశాలు కింది స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బందోబస్తుకు ముందస్తుగా అవసరమైతే రంగంలోకి దింపటానికి ఎస్ఐబీ, టీఎస్ఎస్పీ బలగాలను కూడా సిద్ధంగా ఉంచారు. ముఖ్యంగా, అసెంబ్లీ సమావేశాలను పురస్కరించుకొని విపక్షాలతో పాటు వివిధ యువజన సంఘాలు, విద్యార్థి సంఘాలు అసెంబ్లీ వద్ద ఆందోళనకు దిగే అవకాశమున్నందున వారిని అసెంబ్లీ గేట్ల సమీపంలోకి రాకుండా నిరోధించటానికి నగర టాస్క్‌ఫోర్స్‌తో స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే, ఆదివారం ఉదయం అసెంబ్లీ వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాంశ్ యాదవ్ స్వీయపర్యవేక్షణలో పోలీసు అధికారులు, సిబ్బంది డ్రెస్ రిహార్సల్స్ నిర్వహించారు.

సిరియాలో తిరుగుబాటు

(మొదటిపేజీ తరువాయి)

స్వాగతించాయి. సిరియాలోని డమాస్కస్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని, ప్రభుత్వ ప్రసార కేంద్రాలతో సహా కీలకమైన కేంద్రాలను వశపరచుకున్న తర్వాత తిరుగుబాటు దళ కమాండర్ అహ్మద్ అల్ షరా మొదటిసారి జాతి నుద్దేశించి టెలివిజన్‌లో ప్రసంగిస్తూ, ప్రభుత్వ సంస్థలు వేటితోను మిలిటరీ అప్రోచ్ కాకూడదని హుకుం జారీ చేశారు. అధికారికంగా అధికార మార్పిడి జరిగేంతవరకు మాజీ ప్రధాని మహ్మద్ అల్ జలాలీ ఆధ్వర్యంలోనే పరిపాలన ఉంటుందని చెప్పారు.

అయిదు దశాబ్దాల బాత్ పార్టీ నిరంకుశ పాలనకు నేటితో తెర పడిందన్నారు. మరో వైపు ప్రధాని మహ్మద్ అల్ జలాలి మాట్లాడుతూ, అధికార బదలాయింపు సాఫీగా సాగేందుకు తాను సహకరించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ప్రజలతో ఎన్నుకోబడిన ఏ నాయకత్వంతోనైనా కలిసి పనిచేయడానికి తాను సుముఖంగా ఉన్నానన్నారు. సిరియాలో 'అసాధారణ పరిణామాలను' అమెరికా అధ్యక్షుడు జో బెడెన్ నిశితంగా పరిశీలిస్తున్నారని' వైట్ హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. పదవీచ్యుతుడైన అధ్యక్షుడు అల్‌అసద్ కుటుంబం అయిదు దశాబ్దాలకు పైగా సిరియాను పాలిస్తూ వచ్చింది. 2000లో తన తండ్రి హఫీజ్ అసద్ మరణం తర్వాత అల్ అసద్ అధికారం చేపట్టారు.

. సిరియాలో అతి ప్రాచీన నగరమైన పల్మీరా, హామ్. అలెప్పో నగరాలను వశపరచుకున్న తిరుగుబాటుదారులు డమాస్కస్‌ను అన్ని వైపుల నుంచి ఆదివారం చుట్టుముట్టారు. పెద్దగా ప్రతిఘటన లేకుండానే డమాస్కస్ తిరుగుబాటుదారుల వశమైంది. దీంతో రాజధానిలోని మెయిన్‌స్క్వేర్‌లో తిరుగుబాటుదారులు సంబరాలు చేసుకున్నారు.

డమాస్కస్‌లోని ఇరాన్ దౌత్య కార్యాలయాన్ని తిరుగుబాటు దారులు ధ్వంసం చేశారు. అంతకుముందు సైద్నాయ సైనిక జైలుపై దాడి చేసి అక్కడ ఉన్న ఖైదీనలందరినీ విడుదలజేశారు. 'దీంతో క్రూరమైన నిర్బంధం నుంచి మా కైదీలకు విముక్తి లభించిందని' తిరుగుబాటు దళ నాయకుడొకరు వ్యాఖ్యానించారు. 2011లో మొదటి సారి అసద్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగింది. అప్పటి నుంచి అమెరికా దన్నుతో జిహాదిస్టులు, స్థానిక మిలీషియా గ్రూపులు ప్రభుత్వ దళాలతో ఘర్షణలకు దిగుతూ సిరియాను అంతర్యుద్ధంలోకి నెట్టాయి. ఈ అంతర్యుద్ధంలో దాదాపు మూడున్నర లక్షల మందికిపైగా చనిపోయినట్లు ఐరాస నివేదికలు పేర్కొంటున్నాయి.

రైతులపై మళ్లీ జులుం

(మొదటిపేజీ తరువాయి)

మోహరించి రైతులను అడ్డుకుంటూనే ఉన్నారు. ఇప్పుడు కూడా అదే యుద్ధ వాతావరణం కనిపించింది. ఢిల్లీ సరిహద్దుల్లో ముండ్లకంచెలు, ఇనుప బారికేడ్లతో దారులు మూసేశారు. దీంతో రైతులు తమ పాదయాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. తదుపరి కార్యాచరణను సోమవారం నిర్ణయిస్తామని నేతలు తెలిపారు. 101 మందితో కూడిన బృందం ఆదివారం కాలినడకన సాగింది. అనుమతి లేని కారణంగా అక్రమ పాదయాత్ర చేయలేరని పోలీసులు మైక్ లో తెలిపారు. 'మీరు రైతులని రుజువు ఉందా?' అంటూ ప్రశ్నించడం వాగ్వాదానికి దారితీసింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు వారిపై టియర్‌గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. రైతుల కండ్లు మండుతుంటే..సహచర రైతులు అండగా నిలిచారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అదే కొనసాగడంతో పాదయాత్రను నిలిపివేశారు. పది మంది గాయపడ్డారనీ, ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందని రైతు నాయకుడు సర్వన్ సింగ్ పాందర్ తెలిపారు. సమస్యను కేంద్రం పరిష్కరించే వరకు పోరాటాన్ని విరమించేది లేదని స్పష్టం చేశారు.

కాగా, ఖనోరీ సరిహద్దులో రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించి ఆదివారం నాటికి 13 రోజులు పూర్తయింది. రైతులు సమ్మె తీవ్రతరం చేయడంతో ఖనోరి, శంభు ప్రాంతాల్లో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. శంభులో నిషేధ ఉత్తర్వులు ప్రకటించారు. ఆ ప్రాంతంలో మొబైల్ ఇంటర్నెట్ సేవలు నిషేధించారు. ఢిల్లీ సరిహద్దుల్లో కూడా భద్రతను పెంచారు. రైతుల డిమాండ్లలో రుణ మాఫీ, మద్దతు ధరలకు చట్టపరమైన రక్షణ వంటివి ఉన్నాయి.

పరిహారం కోసం ఉద్యమించిన రైతులు జైల్లోనే నిరాహారదీక్షలు

యూపీలోని నోయిడాలో ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టి అరెస్టయిన రైతులు జైల్లో నిరాహారదీక్షను ప్రారంభించారు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం నుంచి గౌతమ్ బుద్దనగర్ జిల్లా జైలులో రైతులు నిరాహార దీక్షలు ప్రారంభించినట్టు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) తెలిపింది. గ్రేటర్ నోయిడాకు చెందిన 150 మందికి పైగా రైతులు జిల్లా జైలులో ఉన్నారు. ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పెద్ద ప్రాజెక్టుల కోసం సేకరించిన భూమికి తగిన పరిహారం, అభివృద్ధి చేసిన భూమికి పది శాతం వాటా కల్పించాలనే ప్రధాన డిమాండ్లతో ఎస్‌కేఎం



వారం రోజులుగా నిరసనలు చేస్తోంది. ఆదివారం కూడా నోయిడాలో రైతులు నిరసన తెలిపారు.

మరోవైపు, యూపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. 1997 నుంచి వివిధ ప్రాజెక్టుల కోసం భూములిచ్చిన వారి జాబితాను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు అధిక నష్ట పరిహారం చెల్లించడంలో భాగంగానే ఈ చర్య తీసుకుంది. అయితే దీనికి సంబంధించి ఎలాంటి సమాచారమూ ఇవ్వలేదని రైతు నాయకులు తెలిపారు.

ఎయిర్ షో..అదరహో

(మొదటిపేజీ తరువాయి)

కోణంలో తిరగడం, ఫల్టీలు కొట్టడం, ఒకదానినొకటి క్రాస్ చేసుకోవడం, త్రివర్ణ పతాకాన్ని సూచించేలా మూడు రంగుల పొగను ఒక సీక్వెన్స్‌లో విడుదల చేయడం, లవ్ సింబల్, దాని మధ్యలో బాణం గుర్తును గీయడం లాంటి విన్యాసాలు అబ్బురపరిచాయి. 'మా ప్రదర్శనలూ వీక్షించండి' అన్నట్టుగా ఎయిర్‌షో జరుగుతున్న క్రమంలోనే పక్షులు కూడా గుంపులుగా ట్యాంక్‌బండ్‌పై చక్కర్లు కొట్టడం వీక్షకులను కట్టిపడేసింది. ఎయిర్‌షోను, రాహుల్ సిప్లిగంజ్ పాటలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్, ఆయా శాఖల ఉన్నతాధికారులు ట్యాంక్‌బండ్, ప్రసాద్ ఐమాక్స్ థియేటర్ వేదికల నుంచి వీక్షించారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులకు సమాచార శాఖ కమిషనర్ హరీశ్ స్వాగతం పలికారు.

నమస్తే చిచ్చాస్ 1,2,3,4....

'నమస్తే చిచ్చాస్...1,2,34...అరె పొద్దుగాలే బయలెళ్ల..బోనంపెట్టి బయలెళ్ళ..గండిమైసికి మొక్కెళ్లు...గాలిమోటరెక్కెళ్లు..అరె..పెద్దపులి...' అంటూ తన గానంతో రాహుల్ సిప్లిగంజ్ హుషారెక్కించారు. పోతురాజు వేషం వేసిన కళాకారులతో ఆడిపాడారు. ఆయన ఆ పాట పాడుతున్నంత సేపు వీక్షకులు కూడా డ్యాన్స్ వేసి మరింత జోష్ పెంచారు. 'ఓహో ఓహో జంబియా..వలంపల్లి జంబియా..నాతో మాట్లాడు జంబియా..' అని పాడుతూ ఉర్రూతలూగించారు.

నాటునాటు..సాంగ్‌తో పాటు పలు పాటలను పాడి వీక్షకులను మెప్పించారు. రాహుల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సత్కరించారు. మరో రెండు వేదికల్లో జి.నీల బృందం బోనాల కోలాటాన్ని, మైథిలి అనూప్ బృందం మోహని అట్టం, ప్రమోద్‌రెడ్డి బృందం భరతనాట్యాన్ని పదర్శించాయి. టీఎస్ఎస్ కళాకారులు పాటలు పాడి వినిపించారు. బీర్రు కిరణ్ టీమ్ థియేటర్ స్కిట్‌ను ప్రదర్శించింది.

ఏడాది పాలనంతా ఎడతెగని వంచనే

(మొదటిపేజీ తరువాయి)

ఎండగట్టారు. ఆరు గ్యారెంటీల అమల్లోని డొల్లతనాన్ని బట్టబయలు చేశారు. ఆరు గ్యారంటీలతోపాటు ఏడో గ్యారెంటీ అయిన ప్రజాస్వామ్య పాలనను అందిస్తామంటూ అధికారంలోకి వచ్చిన రేవంత్... నిరంకుశత్వాన్ని మిగిల్చారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఎరగని నిర్బంధకాండను రుచి చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూళ్లు, హాస్టళ్ల ముందు పికెట్లు, ముఖ్యమంత్రి సొంతూరుకు వెళ్లేందుకు కూడా పోలీసుల అనుమతి, మీడియా, సోషల్ మీడియాపై ఆంక్షలు, రాజకీయ కక్షతో తప్పుడు కేసు బనాయింపు, లైబ్రరీల్లో సైతం లాఠీఛార్జీలు, అశోక్ నగర్‌ను శోకసంద్రంగా మార్చిన వైనాన్ని ఆయన ఈ సందర్భంగా ఏకరువు పెట్టారు. బుల్డోజర్లతో ఇండ్లను కూల్చి పేదల జీవితాలను ఛిద్రం చేశారని వాపోయారు. లగచర్ల లంబాడీల మీద థర్డ్ డిగ్రీని ప్రయోగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రకంగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన పాలనంతా ప్రతిపక్షాలకు తిట్లు, ప్రజలను కొట్టుడు, దేవుళ్ల మీద ఒట్లు, తనకు, తన వారికి దోపిడీ సొమ్ము నోట్లంటూ ఎద్దేవా చేశారు. ప్రతీరోజూ ప్రజా దర్బార్ హామీతో అధికారంలోకి వచ్చిన రేవంత్... దాన్ని ఒక్క రోజు బాగోతంగా మార్చారని సెటైర్లు విసిరారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామనే హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. కేసీఆర్ మార్క్ పాలన దేశానికి దిక్సూచి అయితే, రేవంత్ మార్క్ పాలన దేశం ముందు నవ్వుల పాలైందని దుయ్యబట్టారు. ఎయిర్ పోర్టు రద్దు, ఫార్మాసిటీ రద్దంటూ అనాలోచిత ప్రకటనలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీశారని విమర్శించారు. ప్రభుత్వంలో పరిపాలనా వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని తెలిపారు. శాంతిభద్రతలు దిగజారి, క్రైమ్ రేట్ పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాదిలోనే సంక్షేమాన్ని విధ్వంసం చేశారని చెప్పారు. కూల్చిన ఇండ్లే తప్ప నిర్మించిన ఇండ్లు లేవని ఎద్దేవా చేశారు. ముసలోళ్లను కూడా ముంచిన ముదనష్టపు ప్రభుత్వమని దుయ్యబట్టారు. దివ్యాంగులనూ దోఖా చేసిన దిక్కుమాలిన ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదిలోనే హంసపాదులా కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను సీఎం రేవంత్ కేఆర్ఎంబీకి అప్పగించారని తెలిపారు. ఆయన పాలనలో ఇరిగేషన్‌కు బదులుగా ఇరిటేషన్ పెరిగిపోయిందని చెప్పారు. హామీలతో ప్రజలను, ఓట్లతో దేవుళ్లనూ మోసం చేశారన్నారు. తెలంగాణ వ్యవసాయాన్ని నిలబెట్టిన రైతుబంధు పథకం ఊసే లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట కొనుగోళ్ల ఆలస్యంతో రైతులకు తీరని నష్టం కలిగిందనీ, పంట బోనస్ పత్తా లేకుండా పోయిందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో జాదూ క్యాలెండర్‌ను ప్రకటించారని ఎద్దేవా చేశారు. నిరుద్యోగులను నిర్బంధించారనీ, నిరుద్యోగ భృతి రూ.4 వేలు అంటూ కాంగ్రెస్ జాతీయ నేత ప్రియాంక గాంధీ చెప్పిన మాటలు నీటిమూటలయ్యాయని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక గురుకులాలకు గ్రహణం పట్టిందనీ, 49 మంది విద్యార్థులను బలి తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదు డీఏలకు బదులుగా ఒక్క డీఏను ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగులకు మొండి చెయ్యి చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చారని తెలిపారు. మూసీ ప్రక్షాళన పేరుతో మూటలు వెనుకేసుకునే పథకంలో లంకెబిందలు చూశారని ఆరోపించారు. మూసీ నిర్వాసితులు, హైడ్రా బాధితులు ఏడాది పాలన మీద దుమ్మెత్తి పోస్తున్నారని హరీశ్‌రావు ఈ సందర్భంగా తెలిపారు.

ఈవీఎంలపై విశ్వాసం లేదు

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాలోని మర్కద్వాడి గ్రామంలో యాంటి-ఈవీఎం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలు జరుగుతాయి. కొందరు గెలుస్తారు. కొందరు ఓడిపోతారు.అయితే "ఇటీవల మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలున్నాయి. ఈవీఎంలపై ప్రజల్లో విశ్వాసం లేదు. అయినా.. ఓటు వేశారు. అమెరికా, ఇంగ్లాండ్‌తో సహా ప్రపంచమంతా బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహిస్తోంది. భారత్‌లో మాత్రమే ఈవీఎంలు ఎందుకు? ఇక్కడి ప్రజలు బ్యాలెట్‌లతోనే ఎన్నికలు నిర్వహించాలని కోరుకుంటున్నారు" అని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై స్థానిక ప్రజల్లో ఎలాంటి ఫిర్యాదులున్నా తనకు అందజేయాలని వాటిని ఎన్నికల కమిషన్‌కు, రాష్ట్ర ముఖ్యమంత్రికి పంపిస్తానని శరద్ పవార్ తెలిపారు. మరోవైపు.. ఎన్నికల్లో ఈవీఎంలను దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ.. ఎంవీఏ ఎమ్మెల్యేలు శనివారం ప్రమాణ స్వీకారం చేసేందుకు నిరాకరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆదివారం వారు ప్రమాణస్వీకారం చేశారు.

పోరాటాలకు సిద్ధమవ్వాలి

హక్కుల సాధన, రక్షణకు ఉద్యమాలే శరణ్యం | **ఉద్యమాల ఖిల్లా.. జగిత్యాల జిల్లా..**

- బీజేపీ మతోన్మాదంపై కార్మికరంగాల్లో అవగాహన అవసరం
- మతవైషమ్యాలే బీజేపీ ఎజెండా
- గుజరాత్ అల్లర్లు మొదలుకుని మణిపూర్ హింసాకాండ వరకూ..ఎక్కడ విద్వేషాలు రగిలినా.. దానివెనుకుండేది ఆర్ఎస్ఎస్, బీజేపీయే..
- అదానీని రక్షించే పనిలో ఉన్న శ్రద్ధ.. దేశ ప్రజలపై మోడీకి లేదు..
- రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపైనా నిలదీయాలి.. ఇచ్చిన హామీలపై పోరాడాలి : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య
- జగిత్యాల జిల్లా మూడో మహాసభలు ప్రారంభం



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'పోరాటాలకు ప్రజలు సిద్ధమవ్వాలి. అటు కేంద్రంలో బీజేపీ ప్రజల మధ్య మతవైషమ్యాలు చెలరేపుతూ ఓట్ల రాజకీయం చేస్తూ అధికార పీటంపై కూర్చుంటోంది. క్రమంగా ప్రజల హక్కులను హరిస్తూ దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతూ వస్తోంది. గుజరాత్ అల్లర్లు మొదలుకుని ఇటీవలి మణిపూర్ హింసాకాండ వరకూ ఆ పార్టీ చేస్తున్న ఆరాచకాలు అంతాఇంతా కాదు. ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చకపోగా.. రాజ్యాంగాన్ని మార్చి మనుస్మృతిని అమలు చేయాలనే కుట్ర చేస్తోంది. ఇది కచ్చితంగా ప్రజల హక్కులను హరించడమే.. మరోవైపు రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు సైతం ఇచ్చిన ఏ ఒక్క హామీని సరిగా అమలు చేయడం లేదు. పాలకులుగా ప్రజల ఆస్తులు కాపాడాల్సింది పోయి.. కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాల్సిందే. అందుకు ఎర్ర జెండా ఎల్లప్పుడూ వెంట ఉంటుంది. ఉద్యమాల ఖిల్లా అయిన జగిత్యాల జిల్లాలో కమ్యూనిస్టు పోరాట చరిత్ర మరువలేం. ఆ స్ఫూర్తితోనే ఉద్యమాలకు సిద్ధం కావాలి' అని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జీ.నాగయ్య పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) జగిత్యాల జిల్లా మూడో మహాసభలను కోరుట్ల పట్టణంలో ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. బస్టాండ్ నుంచి సినారె భవన్ (సభాప్రాంగణం) వరకు పెద్దఎత్తున ప్రజాప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రాంగణ వేదికపై కమ్యూనిస్టు యోధులు పుచ్చలపల్లి సుందరయ్య, సీతారాం ఏచూరి, మల్లు స్వరాజ్యం చిత్రపటాలకు పూలు వేసి నివాళ్లు అర్పించారు. పార్టీ జెండా ఆవిష్కరించి అనంతరం పార్టీ నాయకులు ఇందూరి సులోచన, ఎంఏ చౌదరి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో నాగయ్య ప్రసంగించారు. గుజరాత్ అల్లర్లు మొదలుకుని మణిపూర్ హింసాకాండ వరకూ చోటుచేసుకున్న ప్రతి మత ఘర్షణల్లో ఆర్ఎస్ఎస్, బీజేపీ పాత్ర ఉందని వివరించారు. పైగా మణిపూర్‌లో గిరిజనుల మధ్య హింసాకాండను చెలరేపి అక్కడి కొండప్రాంతాలను ఖాళీ చేయిస్తోందన్నారు.



అందు కు అక్కడి భూగర్భం లోని ఖనిజాలు అదానీ లాంటి కార్పొరేట్లకు అప్పగించే కుట్ర చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు రాజ్యాంగ యంత్రాన్ని తన చెప్పు చేతల్లో పెట్టుకొని రాచరిక పాలన సాగిస్తోం దన్నారు. మతం, ఆహారపు అల వాట్లు వ్యక్తిగ తమైనా.. అందులోనూ ఆంక్షలు చెలరేపుతూ ప్రజల మధ్య చిచ్చుపెడు తోందన్నారు. రాజస్థాన్‌లో అజ్మీరా దర్గా ఒకప్పటి హిందూ ఆలయమని, దేశంలో మసీదులు, చర్చీలు కూలదూసే పనిగట్టుకుందని తెలిపారు. మరోవైపు ఆదిలాబాద్ లాంటిప్రాంతంలో ఓ మైనార్టీ వ్యక్తి గిరిజన మహిళపై లైంగికదాడి చేస్తే.. యావత్తు మైనార్టీ ఇండ్లన్నీ ధ్వంసం చేసేలా ఉసిగొల్పిందన్నారు. సనాతన ధర్మం గొప్పదంటూ ప్రచారం చేస్తున్న ఆ పార్టీ.. ఆధర్మంలో దళితులకు, మహి ళలకు ఏ స్థానం ఉందో చెప్పగలరా అని ప్రశ్నించారు. అదానీకి దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా లంచాలు ఇస్తూ సంపద దోచుకుంటున్న తీరు ఇటీవల బట్టబయలైందని, అమెరికాలో ఏకంగా ఆయనపై కేసు కూడా నమోదైం దని తెలిపారు. అయినా ఆయనపై చర్యలు తీసుకోకుండా రక్షించే పనిలో కేంద్రంలోని బీజేపీ ఉందని విమర్శించారు. బీజేపీ తీరు ఇలానే కొనసాగితే శ్రీలంక ఉదంతమే పునరావృతమవుతుందని చెప్పారు. ఆ దేశంలో ప్రజలంతా ఆకలికేకలతో రోడ్డెక్కితే అప్పటివరకూ ఉనికిలో లేని ఎర్రజెండానే అండగా నిలబడిందని, ఏకంగా ఇప్పుడు కమ్యూనిస్టు నేతనే దేశాధ్యకుడిగా ఎన్నికయ్యాడని తెలిపారు.

హామీల అమలులో రాష్ట్ర సర్కారూ విఫలం

ఆరుగ్యారంటీలు సహా సుమారు 400లకుపైగా హామీలిచ్చి ప్రజాస్వామ్య పాలన అందిస్తామని చెప్పిన కాంగ్రెస్‌కు ఈ రాష్ట్ర ప్రజలు అధికారం కట్టబెట్టారని తెలిపారు. అయితే మహిళలకు ఫ్రీబస్సు పథకం తప్ప మిగిలిన గ్యారంటీలన్నీ మరిచిపోయిందన్నారు. మహిళలకు రూ.2500సాయం, దళితబంధు స్థానంలో అంబేద్కర్‌పేరుతో రూ.12లక్షలిచ్చే పథకం, రైతుభరోసా, రైతుబీమా వంటి పథకాలకు ఇంకా రూపకల్పనే చేయలేదన్నారు. రూ.2లక్షల్లోపు రైతుల రుణమాఫీ చేస్తామని చెప్పి కేవలం లక్షన్నర వరకు రుణాలు మాత్రమే దశలవారీగా మాఫీ చేసిందని, అందులోనూ ఇంకా అర్హులు మిగిలారని, వారితోపాటు మిగిలిన రైతుల రుణాల మాఫీపై ఇంకా స్పష్టత ఇవ్వలేదన్నారు. మరోవైపు పేదలంతా ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటుంటే బుల్డోజర్లతో బీఆర్ఎస్ కూల్చిందని అన్నారు. అదే సంస్కృతి కాంగ్రెస్ కొనసాగిస్తోందన్నారు. పాలకులు మారినా మారని విధానాలపై ప్రజలంతా పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది. సీపీఐ(ఎం) ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని, ఈ మహాసభల్లో అందుకు అవసరమైన భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఈ మహాసభల్లో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణ, రాష్ట్ర నాయకులు పీ.శ్రీకాంత్, టీ10 సీఈఓ సుందర్, సీపీఐ(ఎం) జగిత్యాల జిల్లా కన్వీనర్ జీ.తిరుపతినాయక్, జిల్లా కమిటీ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున హాజరయ్యారు.

'మెజార్టీ' కోరిక ప్రకారమే భారత్ నడుస్తుంది

వీహెచ్‌పీ కార్యక్రమంలో అలహాబాద్ హైకోర్టు జడ్జి వివాదాస్పద వ్యాఖ్యలు



అలహాబాద్ : మెజార్టీ కోరిక ప్రకారమే భారత్ దేశం నడుస్తుందని అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ వ్యాఖ్యలు చేయడం వివాదంగా మారింది. ఆదివారం అలహాబాద్ హైకోర్టు లైబ్రరీ హాల్ న్యాయవాదులు, వీహెచ్‌పీ వాలంటీర్లతో మాట్లాడుతూ జడ్జి ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఇది హిందూస్థాన్ అని చెప్పడానికి నాకు ఎలాంటి సందేహం లేదు. ఇది మెజార్టీ కోరిక ప్రకారమే నడుస్తుంది' అని అన్నారు. ముస్లింలు తమ సంస్కృతులు అనుసరించాలని హిందువులు కోరుకోరని, అయితే ముస్లింలు తమ దేవుళ్లని, సంస్కృతిని, గొప్పవారిని అవమానించకూడదనే హిందువులు కోరుకుంటున్నారని చెప్పారు. అలాగే, ముస్లిం పేరును ప్రస్తావించకుండా వారు హిందువుల జంతువులను చంపుతున్నప్పుడు వారి పిల్లలు దయ, సహనంతో ఎలా ఉంటారని ప్రశ్నించారు. 'మేం (హిందువులు) మా పిల్లలకు సహనం, దయ నేర్పుతాం. జంతువలు, ప్రకృతిని ప్రేమించడం నేర్పిస్తాం. కానీ మీకు అలా ఉండదు. మీ పిల్లల ముందే మా జంతువులను వధిస్తారు. దీంతో మీ పిల్లలు సహనం, దయ ఎలా నేర్చుకుంటారు' అని ప్రశ్నించారు. అలాగే, ఉమ్మడి పౌర స్మృతిని (యూసీసీ) కూడా జడ్జి ఈ సమావేశంలో ప్రస్తావించారు. ముస్లింలు అనేక మంది భార్యలను కలిగిఉండటం, ట్రిపుల్ తలాక్, హలాల్.. ఇక చెల్లవని చెప్పారు. యూసీసీ సుప్రీంకోర్టు కూడా సమర్థిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ దినేష్ పాఠక్ కూడా పాల్గొన్నారు. అయితే ఆయన అక్కడ ప్రసంగించలేదు.

కాగా, జడ్జి శేఖర్ కుమార్ యాదవ్ ప్రసంగం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పదవిలో ఉన్న ఒక జడ్జి వీహెచ్‌పీ కార్యక్రమంలో ఎలా పాల్గొంటారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే వివాదాలు జడ్జి యాదవ్‌కు కొత్త కాదు. 2021లో 'ఆక్సిజన్‌ను పీల్చే, విడుదల చేసే ఏకైక జంతువు ఆవు'అని చెప్పడం ద్వారా వార్తల్లోకి వచ్చారు. ఆవును జాతీయ జంతువుగా మార్చాలని డిమాండ్ చేశారు.

43 వేల మంది సైనికుల్ని కోల్పోయాం : జెలెన్‌స్కీ

రష్యాతో మూడేండ్లుగా ఉక్రెయిన్ యుద్ధం

కీవ్: ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో ఇరువైపుల భారీ సంఖ్యలో ప్రాణనష్టం జరిగినట్టు నివేదికలు అంచనా వేస్తున్నాయి. వీటికి సంబంధించి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కీలక ప్రకటన చేశారు. దాదాపు మూడేండ్లుగా చేస్తున్న యుద్ధంలో 43వేల మంది సైనికులను కోల్పోయామన్న ఆయన.. మరో 3.70లక్షల మది సైనికులు గాయాలపాలయ్యారని వెల్లడించారు. డోనాల్డ్ ట్రంప్



మక్రాన్‌లతో భేటీ అయిన ఆయన.. భవిష్యత్తులో మరోసారి రష్యా దాడి చేసే అవకాశం లేనివిధంగా శాంతి ఒప్పందం అవసరమన్నారు. "శాంతికి విఘాతం కలిగించడానికి రష్యా ప్రయత్నాలు చేసింది. మాపై దురాక్రమణకు పాల్పడింది. మాకు న్యాయమైన, శాశ్వత శాంతి అవసరమని డోనాల్డ్ ట్రంప్‌తో చెప్పా. గతంలో మాస్కో పదే పదే వ్యవహరించినట్టుగా కాకుండా మరో సారి తమ శాంతికి విఘాతం కలగకుండా ఆ ఒప్పందం ఉండాలి" అని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌లో తక్షణమే కాల్పుల విరమణ అమల్లోకి తేవాలని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చారు.

ప్రజాస్వామ్య కోణానికి విరుద్ధంగా పాలన

- శ్రీలంక తరహాలో కమ్యూనిస్టులకు పూర్వ వైభవం తథ్యం : సీపీఐ (ఎం) ఖమ్మం డివిజన్ మహాసభలో రాష్ట కార్యదర్శి తమ్మినేని



నవతెలంగాణ-ఖమ్మం

ప్రభుత్వాలు మారినా ప్రజా సమస్యలు అపరిష్కృతంగానే ఉంటున్నాయని, ప్రజాస్వామ్య కోణానికి విరుద్ధంగా ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. శ్రీలంక తరహాలో మనదేశంలోనూ కమ్యూనిస్టుల పాలన తథ్యమనే విశ్వాసంతో ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఖమ్మంలోని సెయింట్ మేరీస్ పాఠశాల ఆవరణలో సీతారాం ఏచూరి, బుద్ధదేవ్ భట్టాచార్య ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సీపీఐ(ఎం) ఖమ్మం డివిజన్ కమిటీ మహాసభలో తమ్మినేని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కేసీఆర్ పదేళ్ల ప్రజాస్వామ్య కోణానికి విరుద్ధంగా పాలించారన్నారు. ప్రజల బతుకులు బాగుపడాలంటే ఏ పార్టీ చెప్పినా సమస్యలు ఒకే విధంగా ఉంటాయన్నారు. విద్య వైద్యం, భూమి, ఉద్యోగం, ఉపాధి, సరైన వేతనం, సామాజిక న్యాయం ఉన్నప్పుడు ప్రతి కుటుంబం హాయిగా... సోషలిజం తరహాలో జీవిస్తాయని వివరించారు. ఏ పార్టీ చెప్పినా ఈ ఏడు అంశాల గురించే చెబుతుంటాయని, కమ్యూనిస్టులు వీటన్నింటినీ ప్రభుత్వమే సమకూర్చా లంటున్నాయని, కానీ బూర్జువా పార్టీలు వీటిని ప్రయివేట్ చేతిలో పెడతాయని తెలిపారు. కమ్యూనిస్టు రాజ్యంలోనే విద్య, వైద్యం ఉచితంగా లభిస్తాయని చెప్పారు. పరిశ్రమలు రావాలన్నా.. ఉద్యోగ కల్పన జరగాలన్నా.. ప్రజల కొనుగోలు శక్తి పెరగాలన్నా.. ఎర్రజెండాలోనే సాధ్యమని వివరిం చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్పా... మిగిలిన ఆరు గ్యారంటీలలో ఏ ఒక్కటీ సంపూర్ణంగా అమలు చేయలేదన్నారు. రైతుబంధు కింద ఏడాదికి ఎకరానికి రూ.15 వేలు వస్తాయని ఓటు వేస్తే ఉన్న రూ.10 వేలు పోయాయని అన్నారు. ఏడాది కాలంగా రైతు భరోసా పంట పెట్టుబడి పథకాన్ని అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికులకు రూ. 12వేలు, మహిళలకు నెలకు రూ. 2,500, నిరుద్యోగులకు భృతి ఇవేవీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా గత కేసీఆర్ ప్రభుత్వం 5 లక్షల ఎకరాలకు పోడు పట్టాలిస్తే.. రేవంత్ రెడ్డి తాము అధికారంలోకి వచ్చాక మిగిలిన మూడు లక్షల ఎకరాలకు పట్టాలిస్తామన్న హామీ, హామీగానే మిగిలిందన్నారు. పట్టాలు ఇవ్వకపోగా భూములు లాక్కోవడానికి ప్రభుత్వం ప్రయత్నం చేసిందని ఆరోపించారు.

> ప్రభుత్వాలు మారినా అపరిష్కృతంగానే ప్రజా సమస్యలు

రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్ లో ఫార్మసిటీ పేరుతో లగచర్లలో 3000 ఎకరాల గిరిజనుల భూములను బలవం తంగా లాక్కు నేందుకు యత్నిం చారని గుర్తు చేశారు. సీపీఐ (ఎం) బృందం లగచర్ల పర్యటనకు తొలుత అనుమతి నిరాకరించిన సీఎం.. రాష్ట్రవ్యాప్తంగా ఎర్రజెండాలు ఉద్యమిస్తాయని హెచ్చరించడంతో అనుమతిం చారని తెలిపారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం అక్కడున్న భూములకు మార్కెట్ వ్యాల్యూ ప్రకారం నాలుగు రెట్లు అదనంగా చెల్లిం చాలని తాము సీఎంను డిమాండ్ చేసినట్టు చెప్పారు. అంతేకాదు, ఫార్మాసిటీ ఏర్పాటును విరమించుకోవడం కమ్యూనిస్టుల విజయంగా తెలిపారు.

ఓట్లూ సీట్లూ లేకున్నా ఎర్రజెండా గుండె బలంతోనే ఇదీ సాధ్యమైందన్నారు. పక్కనున్న శ్రీలంకలో మూడు శాతం ఓట్లున్న కమ్యూనిస్టులు అప్పటి ప్రధాని రాజపక్సే నిరంకుశ విధానాలపై తిరుగుబాటు చేయడంలో విజయం సాధించారని, ఫలితంగా ఆ దేశ ప్రజలు కమ్యూనిస్టు నాయకులు దిసనాయకే 49శాతం ఓట్లతో పట్టం కట్టారని తెలిపారు. మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ మూడింట రెండొంతుల సీట్లను కమ్యూనిస్టులు సాధించటం గమనార్హం అని అన్నారు. మన దేశంలోనూ ప్రభుత్వాలు అదే తరహా పాలను కొనసాగిస్తున్నాయని, ఇదే నిరంకుశ పాలన కొనసాగితే దేశంలోనూ కమ్యూనిస్టుల పాలన వస్తుందనే విశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. సాయిబాబు, పోతినేని సుదర్శన్ కూడా ప్రసంగించారు. ఈ మహాసభలో రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బుగ్గవీటి సరళ, కళ్యాణం వెంకటేశ్వరరావు, భూక్యా వీరభద్రం, బండి రమేష్, బొంతు రాంబాబు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసంలో "తెలంగాణ" మాస పత్రిక ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

రైతులపై పోలీసుల్ని ఉసిగొల్పుతారా..?

- బీజేపీ ప్రభుత్వాలతీరుపై డీఎంకే ఎంపీ కనిమొళి



చెన్నై : పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కోసం పోరాడుతున్న రైతులపై పోలీసులను ప్రయోగిం చడం అమానుషమని డీఎంకే ఎంపీ కనిమొళి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండించారు. తక్షణమే రైతు ప్రతినిధులతో చర్చలు జరపాలని, డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. "పంటలపై ఎంఎస్‌పీకి చట్టపరమైన హామీతో సహా తమ న్యాయమైన డిమాండ్‌ల కోసం ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా, అమానుషంగా పోలీసులను ప్రయోగించడాన్ని ఖండిస్తున్నాను" అని ఎక్స్‌లో పేర్కొన్నారు. దేశాన్ని పోషిస్తున్న అన్నదాతలపై లాఠీ, టియర్ గ్యాస్‌తో దాడి చేయడం దారుణం అని కనిమొళి తెలిపారు.

పెద్దల కోసం పిల్లల కవిత్వం

'ఏనుగమ్మ ఏనుగు' పుస్తకావిష్కరణలో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె. శివారెడ్డి



హైదరాబాద్ : ఊహను కవిత్వంగా మలిచే అద్భుతశక్తి కవికి ఉంటుందని కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె. శివారెడ్డి అన్నారు. ఆదివారం సోమాజీగూడలోని ప్రెస్‌క్లబ్‌లో కవి వసీరా రాసిన 'ఏనుగమ్మ ఏనుగు' పుస్తకాన్ని శివారెడ్డితో పాటు పిల్లలు అన్విత్ వంకలంక, నాని, అరుణిస్ రాజిరెడ్డి, జెస్సీతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ.. అటు ప్రపంచం, ఇటు సమాజం రెండింటిని జోడించి రాసే కవులు అరుదుగా ఉంటారనీ, అలాంటి కవుల్లో వసీరా ఒకరని వివరించారు. కవి చేసే అంతర్, బహిర్ ప్రయాణమే అతని కవిత్వమన్నారు. మూడు సంపుటాలతో ఇప్పటికే మంచి కవిగా ముద్ర వేయించుకున్న వసీరా తన నాలుగో సంపుటితో ఆ ముద్రను శాశ్వతం చేసుకున్నాడని తెలిపారు. ఏ వయసుకా ముచ్చట అంటారు కదా... అలా ఉంటుంది వసీరా కవిత్వమని అభివర్ణించారు. "ఈ ఆరు పదుల వయసులో తాతయ్యాడు. తన మనవడు, మనవరాలికే కాదు తనలాంటి ఎంతో మంది తాతలకి ఆనాటి ఏనుగమ్మ... ఏనుగు పద్యాన్ని మరోసారి గుర్తు చేశారు" అని వక్తలు కొనియాడారు. ఇప్పుడు, ఆ సమస్త ప్రపంచంలోని మనవలు, మనవరాళ్లను తన వీపుపై ఎక్కించుకుని ఏనుగాట ఆడుకుంటున్నారని వివరించారు.

తెలుగు కవిత్వంలో ఉన్న అన్ని వర్గాల వారు లోలోపల వసీరాని తమ వర్గం వాడే అని సంబర పడ్డారనీ, నిజానికి వసీరా ఏ వర్గం వాడూ కాదని చెప్పారు. తాను నమ్మిన సిద్ధాంతాన్ని కవిత్వీకరించినట్టుగానే తనకు తారసపడిన సాదాసీదా అంశాలను కూడా అంతే సాదాసీదా భాషలో కవిత్వీకరించారని కొనియాడారు. "కవిగా వసీరాకి ఏది వస్తువో ఎంత తెలుసో... దాన్ని ఎలా చెప్తే రక్తి కడుతుందో కూడా బాగా తెలుసు. బహుశా విప్లవాన్నీ కాంక్షిస్తూ రాసిన పద్యాలకి మురిసిన వీవీ, శివారెడ్డి వంటి కవులు వసీరా మృదు కవిత్వానికి కూడా అంతే ఆనందించారు. తన మూడో సంపుటి సెల్ఫీలో అయితే తన విప్లవ కాంక్ష ప్రకృతి మీద ప్రేమలకు తోడుగా ఆధ్యాత్మిక కవిగా కూడా తనని తాను నిరూపించుకున్నాడు. ఇంతకు ముందు అన్నట్టు ఆ వయసుకు ఆ ముచ్చట అది. డీహ్యూమనైజేషన్ బ్రాండ్ ఏఐ (వర్షన్ 2024) అని నామకరణం చేసి ఏనుగు ఎక్కుదాం అనుకున్న మనల్ని అది ఎక్కే ముందు సమాజం ఇలా ఉంది" అని వక్తలు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వాడ్రేవు చినవీరభద్రుడు, ప్రసాద్ మూర్తి, పసునూరి శ్రీధర్‌బాబు ప్రసంసించారు. సాహితీప్రియలు, కవులు హాజరై కవి వసీరాను అభినందించారు.

పేదలను అంటిపెట్టుకుని ఉంటే మంచి ఫలితాలు




- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య
- ముగిసిన మేడ్చల్ జిల్లా మూడో మహాసభలు
- నూతన జిల్లా కమిటీ ఎన్నిక

నవతెలంగాన-సిటీబ్యూరో

ఎర్ర జెండా.. పేదలను అంటిపెట్టుకుని ఉంటే మంచి ఫలితాలు వస్తాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రగతి నగర్‌లో జరుగుతున్న పార్టీ మూడో మహాసభలు ఆదివారం ముగిసాయి. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. శ్రీలంకలో భయానక పరిస్థితులు ఉన్న చోట కమ్యూనిస్టు నాయకుడు అధ్యక్షుడయ్యాడని తెలిపారు. ప్రజల కోసం ఐక్యంగా పని చేస్తే మన దేశంలో కూడా ఎర్రజెండా ఎగరడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. మన దేశంలో జరిగే అరాచకాలు శ్రీలంకలో జరిగిన మారణహోమం కంటే ఎక్కువేమి కాదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలని సూచించారు. ఈ మహాసభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, డీజీ నర్సింహారావు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి గా పి.సత్యం



సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శిగా పి.సత్యం వరుసగా మూడో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ముగిసిన జిల్లా మహాసభల్లో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా కార్యదర్శితో పాటు కె.రవి, జె.చంద్రశేఖర్, ఏ. అశోక్, ఎం.వినోద, జి.శ్రీనివాసులు, ఐ.రాజశేఖర్ ఎన్నికవ్వగా, జిల్లా కమిటీలో ఆర్.సంతోష్, ఆర్. వరప్రసాద్, ఎం.శంకర్, ఎస్.సబిత, కె.లక్ష్మణ్, ఎంపీ నరేష్, ఎన్.శ్రీనివాస్, బీఐ వెంకట్ రామయ్య, జె.వెంకన్న, జి. లక్ష్మణ్, లింగస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

దొంగల చేతివాటం

- 'మహా' సీఎం పమాణస్వీకారోత్సవంలో విలువైన వస్తువులు చోరీ

ముంబయి: మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణస్వీకరణ కార్యక్రమంలో దొంగలు తమ చేతి వాటం ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి వేల సంఖ్యలో వచ్చిన ప్రజల నుంచి బంగారం, విలువైన వస్తువులు కాజేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

దక్షిణ ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో మహారాష్ట్ర సీఎం ప్రమాణస్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖులతో కలిపి దాదాపు ఐదు వేల మందికి పైగా హాజరయ్యారు. ఈ క్రమంలోనే కొందరు కేటుగాళ్లు దొంగతనానికి పాల్పడ్డారు.

13 బంగారు గొలుసులను కాజేసినట్టు సమాచారం. మరికొందరి నుంచి రూ. 12 లక్షలకు పైగా విలువైన వస్తువులను చోరీ చేశారు. మరో మహిళ 20 గ్రాముల నగ పోయిందని తెలిపారు. ఇలా 13 మంది ఫిర్యాదు చేశారు. కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులను గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఇటీవల వెలువడిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మహాయుతి కూటమి 230 స్థానాలతో అఖండ విజయం సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం విదితమే.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886